రామాయణ సుధాలహరి

సుందర కాండము

'సందేశమాల' ప్రచురణములు

సఫలత (success) రు 2-0-0

బుకర్-టి-వాషింగ్టను రు 1-0-0

భారతీయ ప్రతిభ రు 2-0-0

— రామాయణ సుధాలహరి —

బాలకాండము రు 2-0-0

అయోధ్యా కాండము రు 2-0-0

అరణ్య కాండము రు 2-0-0

కిష్కింధా కాండము రు 2-0-0

సుందర కాండము రు 2-0-0

యుద్ధ కాండము అచ్చులో

ప్రతులకు:

'సందేశమాల', తెనాలి.

రామాయణ సుధాలహరి

సుందర కాండము

రచయిత:

గౌ. శ్రీ కల్లూరి చంద్రమౌళి

స్థానిక శాఖామాత్యులు - మద్రాసు రాష్ట్రము

సంపాదకులు:

'సందేశమాల'- తెనాలి.

స్వామ్యములు :
సంపాదకులవి

గ్రంథములు దొరకుచోటు :
'సందేశమాల', తెనాలి

ఖర - ౧౯౫౧

వెల : రెండు రూపాయలు

పబ్లిషర్సు :
'సందేశమాల', తెనాలి

భారతీ ప్రెస్, తెనాలి
1951

ఓమ్

రామాయణ సుధాలహరి

సుందర కాండము

'సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనం
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరః కపిః
సుందరేసుందరంమంత్రం సుందరే కిం న సుందరం'

'సుందర కాండమునం దభి వర్ణితుడగు శ్రీరాముడు సుందరుడు. కథ సుందరము. సీత సుందరి. వనము సుందరము. కావ్యము సుందరము. హనుమంతుడు సుందరుడు. మంత్రము సుందరము. ఈ సుందర కాండ మున సుందరముగాని దేమున్నది?'

అని సౌందర్యారాధకులగు నభియుక్తులు వచియింతురు.

నామ విచారము

రామాయణకావ్య కల్పకమునందు సుందరకాండ మొక పవిత్రకాండమని ప్రశస్తిగాంచి పారాయణ యోగ్యతను బడసినది.

భారతేతిహాసమునందు భగవద్గీత యుపనిషత్థ్సానము నాక్రమించుకొని యుజ్జ్వలతారయై ప్రకాశించుచున్నట్లే రామాయణ సుధాలహరిలో సుందరకాండ మొక పవిత్ర సుందర ఘట్టమై ప్రకాశించుచున్నది.

సంపూర్ణ రామాయణ పారాయణమునకు ఫలశ్రుతి చెప్పబడినది. అయిన నా ఫలశ్రుతి యీ కాండాంతమున విశేషించి వర్ణింపబడినది. అంతియగాదు; ఈ కాండాంత ర్భాగములగు నా యీ ఘట్టముల కంతమునగూడ ఫల శ్రుతి వచియింపబడినది. కాని యీ రీతి తక్కిన కాండాంత ర్భాగ ఘట్టములకు వచియింపబడ లేదు.

ఈ కాండ ఫలశ్రుతి యీ గ్రంథమునకేగాదు; బ్రహ్మాండ పురాణము, స్కాంద పురాణము, పరాశర సంహిత మున్నగు ప్రసిద్ధ గ్రంథములయందుగూడ బహులముగ బ్రశంసింపబడినది. కావున దీనికి గారణమేమో యూహిం చింపవలసి యున్నది. అందులకు ముందుగ నీ కాండమున కేపేరేల వచ్చినదో గూడ మనము విమర్శింపవలసియున్నది.

నూత్న భావ కల్పనములకు బ్రాకులాడు భావుకులు కొంద ఱూహింతురుగదా! 'సుందర కాండము' నందలి 'సుందర'పదమేదేని ప్రదేశ వాచకమై యుండనగునేమో! అని. వారి యూహకు గారణమిది. 'బాలకాండము

మూలరామాయణమున కొందరు లేదనుచున్నారుగదా!
పోగా యుద్ధకాండమునకు లంకా కాండమని పేరున్నది.
కాగా నా పక్షమున 'అయోధ్యా, అరణ్య, కిష్కింధా, లంకాశబ్దములు ప్రాదేశిక వాచికములుగాన 'సుందర' కాండము గూడ నొకానొక చోటును సూచింపవచ్చును.'

దీని కాధారము నిరాధారమగుటచే నీ యూహ మపోహమే యనుకొనవచ్చును.

ఈ కాండము సుందర నామక మగుట కనేకు లనేక విధముల కారణములు వచియించుచుందురు. చూడుడు. 'రాజ! సర్వాంగ సుందరియగు సీత యెచ్చటనేని గాన బడినదా?

(కచ్చిత్ క్షితిభృతాం నాథ! దృష్టా సర్వాంగ సుందరీ)

యన్న ప్రశ్నమునకు 'రామ! అభిరామయు, బతి వ్రతయు నగు సీతను నేను రావణాంతఃపురమున గాంచి తిని. ఆమె తన సర్వ మనోరథములను నీయంద నిలుపు కొని ప్రాణములు బిగ్గబట్టుకొని యున్నది.'

(తత్ర దృష్టా మయా సీతా రావణాంతఃపురే సతీ
సన్న్యస్యత్వయి జీవంతీ రామా రామ! మనోరథమ్)

అన్న ప్రత్యుత్తర మీ కాండమునందే లభించినది.'

'వియోగాగ్నిలో దపించి, తపించి కృశించియున్న సీతా రాములకు ప్రాణాధారములును, పరితోషజనకములును నగు రామ ముద్రికను, సీతా చూడామణిని సీతా రాముల కర్పించి వారికిని, పాఠకజన మానసములకును బరిశ్రాంతిగల్పించినదీ కాండమే. కాననిది సుందరమైనది.

లంకావాసులు, లోక కంటకులునగు రావణాది దుష్ట రాక్షససంహార కాండమున కీ కాండమునందే ప్రారంభ మహోత్సవమయినది.' కావున నిది సుందరము.

'అలౌకికమగు శ్రీరామసౌందర్య మీ కాండమునంద సీతతో నభివర్ణించి వచియింపబడ్డది' గాన నీపేరువచ్చినది.

అట్లే 'జానకీ సౌందర్యము శ్రీరామునితో సరసముగ వర్ణింపబడినది.' కావున నీ నామము సార్థకము.

(సుష్ఠు ఆద్రియతే ఇతి సుందరః)

లెస్సగా నాదరింపబడునది గాన నిది సుందరమైనది.

'సీతాయా శ్చరితం మహత్' అని వాల్మీకి చేయెత్తి చాటిన పవిత్ర వాక్యతత్త్వమును, వాల్మీకి మహర్షి యొక్క యీ మహాసంకల్పమును, దాని పరిపూర్ణ పరిణతియు నిండే ప్రస్ఫుటమగును. అగుటచే దీనికీ పేరు వచ్చినది.

రాముడు రామాయణమునందలి యితర కాండము లలో ప్రత్యక్షముగనుండి ప్రధాన ఘట్టములలో బాల్గొని యుండెను. కాని యీ కాండమునన్నో ! చివరిభాగమున మాత్రము శ్రీరాముని మనము చూడగల్గుదుము. అయ్యాను నాతని గూర్చిన ముచ్చటలు, ప్రభావములు సర్వదా మన కర్ణపుటముల శబ్దించుచునే యుండును.

బాలకాండము రాముని బాల్యమును బ్రశంసించెను. సీతాకల్యాణమును జిత్రించెను. కల్యాణమయి యగు నా సీతయే యిచ్చట పతి వియోగమున విప్రలంభావస్థలో విపరీత బాధల ననుభవించుచున్నది. ఈ వియోగావస్థతో నీ కాండమునందలి 'సుందర'త్వమున కేమేని సంబంధ ముండునా? యని చూతము.

విశ్వాతీతమైన సౌభాగ్యముచే సుందరతగల్గును గాదా!

(విశ్వాతిశాయీ సౌభాగ్యత్వాత్ సుందరః)

అని శంకరుని నిర్వచనము. ప్రియులయందలి సౌభాగ్య ఫలమే సౌందర్యము.

(ప్రియేషు సౌభాగ్య ఫలాహి చారుతా)

అని తద్జ్ఞుల తలంపు. అనగా సాంఘిక జీవితమున-దన పురుషుని పవిత్ర ప్రేమను, నిర్మల హృదయమును బడయుటయే స్త్రీ విషయమున సౌందర్యము. తన సతీ

హృదయమును, పవిత్ర ప్రేమను బడయుటయే పురుష విషయమున సౌందర్యము. అనగా సతీ రత్నమగు సీతను భార్యగా బడయగల్గుట రాముని సౌభాగ్యము. పురుషోత్తముడగు శ్రీరాముని బొందగల్గుట సీతా సౌభాగ్యము.

అయినచో నీ సౌభాగ్య మెప్పుడు సుందరమగును? సంయోగమునందా? లేక వియోగమునందా? దీనికి కవి కులపతియగు కాళిదాసుడు చక్కగ సమాధానము చెప్పినాడు. 'నీ విరహావస్థచే విలపించు నీ ప్రియ విలాపమునంద నీ సౌభాగ్యము ప్రకటమగుచుండును.

(సౌభాగ్యం తే సుభగ విరహావస్థయా వ్యంజయంతీ)

రాముడు సౌందర్యమూర్తి యని పేరొకనబడుట కిదియు గారణమందురు.

'హృదయమును ద్రవింపజేయునది గాన సుందరము.'

(సుతరాం ఉనత్తి సుందరః)

ఈ హృదయద్రావణము ముఖ్యముగ విప్రలంభ శృంగారము నంద గల్గునని రసజ్ఞులందురు. అట్టిది గావున నిది సుందరకాండమైనది.

'దూరమయిన వస్తువు తిరిగి లభించుట సుందరము.'

(నష్టలాభస్తు సుందరః) అపహృత యగు సీతా ప్రాప్తి విషయ మిం దభివర్ణితమగుటచే నిది సుందరమైనది.

లేక 'ప్రణష్టస్య యథాలాభః' అన్నట్లు కోల్పోయిన యమూల్య రత్నమును గాంచుట సుందరము. కటికి చీకటినుండి కమనీయ ప్రకాశము గాంచగల్గుట సుందరము గాదా!

భావ విశేషమును, అసామాన్య కార్యములను, అనుభూతిని మాటలతో నభివర్ణింపజాలము.

ఈ కాండమున హనుమంతుడొనరించిన కార్యములవర్ణనీయములు. వాల్మీకి యంతటి మహాకవీశ్వరునికిని వర్ణింప నలవిగానివి. ఆంజనేయుని కృత్యముల కిందు హద్దుపద్దులు గానరావు. తత్తత్సమయానుకూలముగ-తన కుచితమని తోచినదానిని దనకుదాన నిర్ణయించుకొని స్వతంత్రముగ సంచరించెను. కావుననే కవి యట్టి కార్యములను 'సుందరమ్, సుందర'మ్మని మాత్రము పేరొక్కనెను. కాన నీ కాండము సుందర కాండమయినది.

సీతాన్వేషణ ప్రయత్నములందు హనుమత్కార్యములలో నౌచిత్య వివేకమును, కళాసంపదయు, రసనిధానమును నెచ్చట బట్టిన నచ్చట హృదయాహ్లాదకరమై యొప్పారుచుండును. కాన నిది సుందరమైనది.

'మదించి యుద గ్రములైన దశేంద్రియము లనెడు దశ
ముఖములుగల మనోరూపరాక్షసాధిపతి యాక్రమింపగా

భవసముద్రముచే బరివృతమగు నీ దేహమున దీనదశ
నొందియున్న పురుషుడు హనుమత్తుల్యుడగు నాచార్యు
నిచే నవ గతార్థుడై లంకాబద్ధయగు సీతాదేవివోలె
నోదార్పబడుచున్నాడు.'

(ప్రస్తోదగ్ర దశేంద్రియానన మనో నక్తంచరాధిష్ఠితే
దేహేఒస్మిన్ భవసింధునా పరివృతే దీనాందశాం ప్రాపితః
అద్యత్వే హనుమత్సమేన గురుణా విజ్ఞాపితార్థఃపుమా
లంకారుద్ధ విదేహరాజతనయాన్యాయేన లాలప్యతే)

—సంకల్ప సూర్యోదయమున వేదాంత దేశికాచార్యులు.

అన్నట్లు సంసారసముద్రమును దాటుటకును, (దశేంద్రి
యము లనెడు దశముఖములుగల) మనోరూప రావణుని
మర్దించుటకును నాదర్శమైనవాడు హనుమంతుడు. అట్టి
యాదర్శమును మనకు జూపుచున్న సుందర కాండము
మన కేల యారాధ్యము గాకపోవును? ఇట్టి యాదర్శ
ములు భారతీయులకు సంప్రదాయ సిద్ధములు. వాల్మీకి
యిట్టి కావ్యసంప్రదాయముల కొజ్జబంతి. వాల్మీకియుద్దే
శమును తత్సాఫల్యమును నిండే మనము కాంచగలము.

అంతియకాదు; 'అసలు వాల్మీకి మహర్షి కవిత్వమే
యీ కాండమున పదనెక్కి, చేవదేఱి, నునుపుబాఱి, జిగి

మాటి, రసకందమై, రసిక హృదయానంద సంధాయకమై యున్నది'. కాన నిది సుందరమైనది.

ఈ సామాన్య కారణము లెట్లయిన నుండ నిండు. అందుల కొక విశేషకారణమున్నట్లు తోచుచున్నది.

ఈ కాండమున బ్రధాన కథానాయకుడు హనుమంతుడుగదా! ఆ హనుమంతునివంటి ప్రభు భక్తిపరాయణుడును, బల వీర్య తేజశ్శాలియు, రామసేవా ప్రవీణుడును, స్వార్థత్యాగియు, భక్తి మదగ్రగణ్యుడును రామాయణ కథాప్రపంచమున నన్యుడొక్కడు గానరాడనుట యతిశయోక్తి గాజాలదు.

దేహసౌందర్యమున వాయుపుత్రుడు కొంత దీసిపోయినను, నాంతరంగిక సౌందర్యమున మాత్ర మసమానుడు. యథార్థముగ నాలోచించినచో నాత్మ సౌందర్యమే సౌందర్యము గాని మేని సౌందర్యమొక సౌందర్యమేగాదుగదా! అట్టి, యథార్థమగు నాత్మ సౌందర్యమున హనుమానుడసమానుడనుటలో ననుమానము లేదు. ఆవంతయేని మాలిన్యము లేక యార్జవ భావసంపదతో, పరిపూర్ణ వికాసముతో పరిఢవిల్లుచున్న యాత్మానందముతో నలరారుచున్న వాని కాత్మ సౌందర్యమెంతటిదో యెవరు చెప్పగలరు?

'అచ్చట సూర్యుడు ప్రకాశింపడు. చంద్రుడును, నక్షత్రములును ప్రకాశింపవు. ఈ విద్యుత్తులును వెలుగ జాలవు. ఇక నీయగ్నిమాట చెప్పనేల?'

(నతత్ర సూర్యో భాతి న చంద్ర తారకం
నేమా విద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః...)

అని కరము కంఠమెత్తి ప్రశంసించినట్టియు, 'వేవురు సూర్యు లాకాశమున నొక్కమా ఱుదయించినట్లు'

(దివి సూర్య సహస్రస్య భవే ద్యుగప దుత్థితా
యది భాస్సదృశీ సాస్యా ద్భాస స్తస్య 'మహాత్మనః)

అని భగవద్గీత వర్ణించినట్టియు పరమాత్మ రూప మును భావించుచుండు వాయుపుత్త్రుడు సౌందర్యవంతు డనుట ప్రమాదముకాదు. కనుకనే హనుమద్ధ్యానము నకు 'సుందర హనుమ'న్మంత్రమనియు, 'సువర్చలా హనుమ'న్మంత్రమనియు నిఱుదెఱగుల మంత్రములు పరాశర సంహితాదులయందు ఘచియింపబడి యున్నవి. అగస్త్య సంహితయం దతడు సుందర హనుమంతుడని ప్రశంసింపబడుట కిదియే కారణము.

సువర్చల హనుమంతుని భార్య. అతడు తన పెద్ద తనమున నీమెను బెండ్లాడెనని పురాణములు పలుకు చున్నవి. ఆ నామముతో జేర్చి యాతని ధ్యానించినచో

నత డిష్టసిద్ధుల నెసగునట. కాన నా యిరువురను గలిపి కొందరు ధ్యానింతురు.

సుందర హనుమన్మంత్ర మాలా రూపమగు నీ కాండము సుందరకాండమనుట చోద్యముకాదు.

ఈ మంత్ర మాల కధిదేవత యాంజనేయుడు.

ఇతడు ప్రకాశించుచున్న 'భాస్కరతుల్యుడు, నుదార భుజవిక్రముడును, కందర్పకోటి లావణ్యుడును'.

(ఉద్యదాదిత్య సంకాశ ముదార భుజ విక్రమం
కందర్పకోటి లావణ్యం.....)

ఇత్యాది ధ్యాన శ్లోకములచే ధ్యానింపదగినవా డందురు.

మఱియు నాంజనేయుడు శంకరాంశమునజన్మించియు, విష్ణుభక్తి ప్రపత్తులచే వృద్ధినొందియు, నిట్లే యగ్ని వాయ్వాది యంశములచే ననేక మహాకార్యము లాచరించియు నున్నవాడుగాన నితనియందు సర్వదేవతాశక్తి రూప సుందరత్వము మూర్తిభవించి యున్నది. కావున హనుమంతుడు సుందరుడనుటకు సందియ మందనక్కఱ లేదుగదా!

సుందరకాండ ప్రశస్తి

కానింతము. నామ విచారమును వీడి యీకాండ ప్రాశస్త్యమునకు గారణముల నాలోచింతము.

సుందర కాండమును బీజకాండమని పేర్కొని దీనిని పారాయణము చేయవలయునని పెక్కు పురాణములు వక్కాణించి యున్నవి. భక్తులట్లే పాటించుచుందురు.

ఈ కాండమున రామాయణకథ యెల్ల సంగ్రహ రూపమున సంగ్రథింపబడి యున్న దనియు, నందువలననే దీనికి ప్రాశస్త్యము వచ్చినదనియు గొంద అనుచుందురు. వారి భావమిది. రాముడు సుగ్రీవుని చాటున నజ్ఞాత రూపమున నుండుట రాముని బాల్యమును సూచించును. అట్లే రాముడు లంకనున్న సీతకు దన యంగుళీయమును బంపుట సీతా కల్యాణమును, ఋశ్యమూక నివాసము చిత్రకూటపర్వతము నాశ్రయించిన యరణ్యవాసమును, సుగ్రీవుని స్నేహపూర్వక సహాయము కిష్కింధాకాండ విషయమును, హనూమ త్సముద్రలంఘనము సుందర కాండ విషయమును, లంకాదహనము యుద్ధకాండ కథను, సీతా కుశలవార్తా శ్రవణము కావ్యాంత ఫల శ్రుతిని దెల్పుచు నీ కాండము సంగృహీత రామచరిత్ర ముగా నుండుటచే నిది పారాయణ యోగ్యమైనది.

విష్ణు నవతారమగు రామచంద్రుడు మోక్షదాయకు డగుటచే నట్టి యాతని నైహిక కార్యములందు యోజింపరాదనియు, నిట్టివానికి హనుమంతుడే సమర్థు

డనియు, గాన హనుమాను నారాధనమ యిట్టి యల్ప ముల కర్హ మనియు ననుచుందురు.

(ఐహికేషు చ కార్యేషు మహాపత్సు చ సర్వదా
నైవయుజ్యే రామచంద్రః కేవలం మోక్షదాయకః)

ఈ విషయమునే యాంజనేయుడు తాను స్వయముగ' జెప్పియున్నాడట!

'ఐహిక విషయములందు రామసేవకుడ నగు నన్ను స్మరింపుడు. మీ వాంఛితార్థములను మేలొనర్తును.'

(ఐహికే సమనుప్రాప్తే మాం స్మరేద్రామసేవకం
వాంఛితార్థం ప్రదాస్యామి భక్తానాం.....)

'ఆంజనేయు బూజించిన చో నెల్ల దేవతలను బూజించినట్లే.'

(ఆంజనేయః పూజిత శ్చే త్పూజితా స్సర్వదేవతాః)

ఇత్యాదిగా పరాశర సంహితాదు లీతని మహత్త్వ మును బ్రశంసించుచున్నవి.

కనుక హనుమదన్యథార్థ రూపవిశేషాదులను స్మరించుటకు సుందరకాండమునకంటె నన్యమగు నాధారము లేదు. కావున నిది పారాయణ యోగ్యమైనది.

భారతమునందలి విరాటపర్వమువలె రామాయణము నందలి సుందరకాండ మొక ప్రత్యేక కావ్యరత్నమయి నవ రసోత్పాదకమై విరాజిల్లుచుండును.

సీతారాముల వియోగమున శృంగారమును, లంకానగర మున హనుమచ్చేష్టలయందు హాస్యమును, సీతాబాధాను భావమున కరుణమును, సముద్రోల్లంఘన లంకాదహన రాక్షస సంహారాదులయందు వీరాద్భుతాదులును, హను మంతుడు లంకాద్వీపమునుండి మరలివచ్చి సీతా చూడా రత్నమును శ్రీరాముని కిచ్చిన సందర్భమున శాంతమును నిత్యాదిగా వివిధ రసములును కుత్తుక బంటిగా విలసిల్లు చుండుటచే నీ కాండము నొక కావ్యరత్న మనుట సము చితమే యగును. కనుకనే యిది రసిక జనుల కారా ధ్యము - పారాయణ యోగ్యము అయినది.

హనుమంతుడు జితేంద్రియుడై రాక్షస మాయా జాల విచ్ఛేదమొనర్చి, పరిపూర్ణమగు నిజ స్వరూపమున బ్రకాశించుచుండు నీ సుందరకాండము జ్ఞానులకు ఆనంద దాయకమగుట సమంజసమే యగును.

మఱియు భగవద్భక్తి బలమున నపార ఘోర సాగ రము నుల్లంఘించి, భగవత్కార్యమును సమగ్రముగ నిర్వహించి, భగవదనుగ్రహమునకు పాత్రమైన యీ కాండ కథ సంసార సాగరము నుల్లంఘించి, పరమేశ్వరా నుగ్రహమును బడయ వాంఛించుచుండు భక్తకోటి కను రక్తి పాత్రమగుట యత్యంత యోగ్యమేగదా!

చిరకాల వియోగ బాధానుభవానంతరము రాముడు సంతృప్తిని బొంది యానందింపగల్గినాడు. అట్టి సంతుష్టు నభినందించినచో నతని యనుగ్రహము బడయవచ్చును. కావున నిది పారాయణ యోగ్యమైనది.

దౌత్య ప్రశస్తి

హనుమంతుడు కిష్కింధలో బ్రదర్శించిన విజ్ఞాన పారంగతత్వమును, స్నేహసంధాన చాతుర్యమును గాంచి రాముడు వానిని మిగుల బ్రశంసించియుండెను.

ఆంజనేయుడు రామ లక్ష్మణులను దన భుజస్కంధ ముపై నిడుకొని, సుగ్రీవునికడకు గొనిపోయి వారికి సఖ్య బంధమును గల్పించెను.

తమకుచిత దూతగానుండి తమ కార్యమును సఫలతా పూర్వకముగ సాధింపగలవాడు హనుమంతుడే యని శ్రీరాముడప్పుడే నిర్ణయించుకొనెను.

మఱియు వానరులెల్లరు సమావేశమై సీతాన్వేషణార్థము హనుమానుడే యర్హుడని నిశ్చయించిరి గదా!

నిజముగా నిట్టి కార్యములందు దూతయే సంధిగా నుండును. సంధిగావించుటయు, యుద్ధమును గొనితెచ్చుటయు దూతచేతిలోని పనియే.

ఈకాండమున హనుమంతుని దౌత్యమే హృదయము.

మహాకావ్యమున మంత్ర దౌత్య ప్రయాణాజి నాయ
కాభ్యుదయము లనెడు పంచసంధులు పనుపడియుండుట
దెలిసిన విషయమే గదా!

రామాయణమునం దవి యున్న తపథము నధిష్ఠించెను. కథాగమనమును బ్రోత్సహించి సరలమార్గమున బ్రవహింపజేసెను. ఇందు మంత్రసంధి దేవతలు బ్రహ్మసాన్నిధ్యమున నున్నపుడు దేజరిల్లుచుండును. దౌత్యసంధికిట నాంజనేయుడే యధిష్ఠాన దేవత.

కౌరవపాండవ సంధి నుద్దేశించి మహాభారతమున పార్థసారథియే పయనింపవలసి వచ్చెను. కాని రామాయణమునన్నో! దౌత్యము హనుమానునిది. భగవద్దౌత్యమొక చోట. భక్తదౌత్యమొకతావున. అన్నదమ్ముల కాస్తి విషయమున నైకమత్యము గల్పించుట యొకరిపని. అనురక్తులగు నాలుమగలకు సాన్నిధ్యము గల్పించుట మరియొకరి పని. తన కార్యనిర్వహణమునకు గృష్ణునకు భూతలమునకే పోవలసి వచ్చెను. పోయి వీరిమాటలు వారికి జెప్పుటయే యాతని కర్తవ్యము. కాని భక్తునికో! తన ధర్మనిర్వహణార్థము మహాసముద్రమును లంఘింపవలసి వచ్చెను. మఱియు జానకి యెచ్చట నున్నదో గని పట్టవలయును. ఆమెను సమీపించి యామె నోదార్చ

వలయును. మాయాదక్షులగు రాక్షసుల నడుమ నామె విశ్వాసమునకు పాత్రమై, తన కాంచినందులకు గుఱు తుగ నామెచెంతనుండి యే దేని గుర్తు బడయవలయును. వీని యన్నిటిని సాధించుటకు దూతయందు విశిష్ట లక్షణ ములు వెలయవలయును.

ఆంజనేయుడు నిర్మల బ్రహ్మచారి. అట్టి యాతడు దానవ మాయాజాలముతో తబ్బిబ్బులగుచున్న యొక మహా పతివ్రతా రత్నమును విశ్వసింపజేయుట సామాన్య కార్యముగాదు. ఆ విశ్వాస సంపాదనమును రాక్షస రాజ్య రాజధానియగు లంకాపట్టనమునందు. ఆ రాక్ష సులో! మాయాదక్షులేగాక క్రూరతాధ్యక్షులు.

శ్రీకృష్ణుడు తన సంధికార్యమున సఫలత నొంద జాలకపోయినాడు; కాని యాంజనేయుడో! తన పూనిన కార్యమున ధన్యుడైనాడు. తన వీర్యశక్తి ప్రభావము నసురానీకముపై బ్రసరింపజేసి వారినెల్లర దల యెత్తనీయక యడగ గొట్టినాడు. రావణ సోదరుడగు విభీషణు నంతటి వానిచే నాతని సోదరుని గాదనిపించి రాముని చెంత జేర్చి శరణు గోరించినాడు.

కృష్ణుడు తన విశ్వరూపము బ్రదర్శించియు దుర్యోధ నాదుల విశ్వాసము బడయలేక, 'యింద్రజాలికు' డని

వారి హేళనలకు బాత్రమయ్యెను. కాని హనుమంతుడో! తన యమోఘ వీర్య ప్రభావముచే 'నితడొక యసామాన్య వ్యక్తి' యను నభిప్రాయము వారికి గల్గించెను.

కృష్ణుడు ధృతరాష్ట్రుని జేరి 'నేను దీనిని యాచింప వచ్చితిని' (ఏత ద్యాచితుమాగతః) అని తన దైన్యమును జూపి కర్తవ్యమెల్ల నతని నెత్తిన పెట్టెను. కాని యాంజనేయుడో! తా నొక సేవకుడయ్యి శత్రురాజు సమక్షమున దన ప్రభువగు శ్రీరాముని దివ్యతేజశ్శాలిగ బ్రకటించి 'రావణ! నీవు బ్రదికి బట్ట గట్టదలచుచో నీ సీతా సతిని శ్రీరాముని కొప్పగించి యాతని శరణు గోరుము' అని ధైర్యముతో, చేయెత్తి, స్పష్టముగ హితోపదేశము చేసెను. ఈ విషయములను జూచినచో ప్రభువునకంటె భటుడే - భగవంతునికంటె భక్తుడే మిన్నగ బ్రవర్తించి నట్లు స్పష్టమగుచున్నది. భగవదాజ్ఞాంచయు నిట్టిదియే. తన కుమారుడు దనకంటె మిక్కిలిగా నుండవలయునని గాదా తండ్రి కోరుకొనుచుండును!

హనుమంతుడు తన దౌత్య నిర్వహణార్థము దాన వులయెడ సామదాన భేద దండోపాయములను యథావకాశముగ, యథా యోగ్యముగ బ్రకటించి, తన రాజ

కీయ విజ్ఞాన ప్రావీణ్యమును బ్రదర్శించి తాను పూనిన ధర్మమును దక్షతతో నిర్వహించెను.

హనుమంతుడు తా దెచ్చిన రామాంగుళీయమును సీత కొసగినపు డామె దాని నొక వరముగ భావించెను. లంకిణి యెడ నాతడు ప్రయోగించిన భేదోపాయమే లంకారహస్యముల నెల్ల నామెచే వెలువరించెను.

భారతమున దేవత లొకమాఱు నలుని దమ దూతగ నెన్నుకొని తమ వాంఛితార్థమును తమకు దామ వ్యర్థ మొనర్చుకొనిరి. కాని రామాయణము నందలి వాన రులో! తమ కర్తవ్యమును, దత్సాధనోపాయములను, త దుచిత సామర్థ్యమును లెస్సగ విచారించి, అందులకు యోగ్యుడగువాని నెన్నుకొని తాము కృతకృత్యులు కాగల్గిరి. కార్యమును సఫలమొనర్చిరి.

నలుడు దమయంతి చెంతకరిగి 'దేవతలు నా సమీప మున కేతెంచి తమ సందేశాశ్వరములను నాయం దుంచి తమ నడగమ్మగ ననున్ననర్చుకొనిరి'అని పల్కెనుగదా!

(అలంకృతాసన్న మహీ విభాగై
రయం జన స్తైరమరై ర్భవత్యాం
అవాపితో జంగమ లేఖ్య లక్ష్మ్యం
నిక్షిప్య సందేశ మయాశ్వరాణి)

ఈ నలుని దౌత్యము విపరీత ఫలితమునే యొసగెను. నలుడు తానే దమయంతిని వలచి యామెను గ్రహించెను.

ఇట్లు దేవతలు తమరాయబారిగ నలునెన్నుకొని దమయంతీ వరణమునకు నలున కొక చక్కని యవకాశము గల్పింప జాలిరేగాని స్వీయ మనోరథమును జేకూర్చుకొన జాలకపోయిరి.

హనుమద్దౌత్యము సర్వవిధముల జరితార్థమైనది. అనిల పుత్రుని సందేశ ప్రాప్తియే లేనిచో జనక పుత్రికి ప్రాణత్యాగమే సంఘటిల్లి యుండెడిది. జానకీదేవి తాను దన ప్రాణములను వీడనెంచి, యందుల కుంకించు సమయమున హనుమంతు డామెకు విశ్వాసము గల్పించి నూత్న జీవితము నొసగెను. అతడు తన వాక్ప్రభావముచే నామెకు విశ్వాసము బురికొల్పి యామె ప్రాణములు దక్కించి ధన్యుడయ్యెను.

హనుమత్ ప్రయాణము

'రావణునిచే నపహృతయగు సీతా స్థానము నన్వేషించుటకు హనుమంతు డాకాశమార్గమున నెగిరెను.'

(తతో రావణ సీతాయాః సీతాయా శ్చత్రు కర్శనః
ఇయేష పద మన్వేష్టుం చారణా చరితే పథి)

హనుమంతుడు సీతాన్వేషణము నర్థించి చారణు లాదరించు నాకాశమార్గమున కెగిరెను. అవును; ఉన్నత ఫలము నందదలచుకొను వాడున్నత మార్గమున బ్రవర్తింపవలయునుగాని యధమ మార్గమున సంచరించినచో నపురూప ఫలముల నెట్లందగల్గును?

హనుమంతుడు శత్రుకర్శను డనుట యథార్థము. ఆ కర్శనము కేవల బాహ్యావిషయమునకేకాదు; ఆంతరిక విషయమునను నది పరిపూర్ణ సత్యమే. కామక్రోధాదులగు శత్రుషట్కమును నాంజనేయునికంటె మిన్నగ నడగగొట్టిన వా రెవ్వరున్నారు?

బ్రహ్మపదమును గాంచుటకు బ్రహ్మచర్య ముత్తమ సాధనము - సోపానము. కనుకనే భగవద్గీత సయితము 'బ్రహ్మమునుగోరి మహాత్ములు బ్రహ్మచర్యము నవలంబింతురు.' (యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి) అని ముక్తకంఠముతో వక్కాణించియున్నది. అటులనే హనుమంతుడు బ్రహ్మచర్య వ్రతానుష్ఠాతగనుకనే-బ్రహ్మచర్యవ్రత మహత్త్వమువలననే సీతాపదమును గాంచగల్గును. అందును నెక వింత గలదు. రామపదము నుండి తత్ప్రోత్సాహమున - తత్సాధనముగ నతడు సీతాపదమును జేరగల్గును.

ఈ మహాకార్యసిద్ధికి రావణుడే ప్రబలాటంకము. ఈ యాటంకము దాటుటకు శత్రుకర్శనుడే సమర్థుడగును. అట్టివాడు హనుమంతుడు. అతడు తా నే దేని యుద్దే శించెనా ! దానిని సాధించె ననియే మనము విశ్వసింప వచ్చును. అతడు పర్వతశిఖరముపై నధిష్ఠించి, యుంకించి, యొకింత క్రుంగి యొక్కా-పున పై కెగిరెను.

'రామచాపమునుండి నిర్గమించి వాయువేగముతో బోవు బాణమువలె నేను రావణపాలితమగు లంకానగర మున కరిగెదను.' అని హనుమంతు డనెను.

(యథా రాఘవ నిర్ముక్తశ్శర శ్శ్వసన విక్రమః
గచ్ఛే త్తద్వ ద్గమిష్యామి లంకాం రావణపాలితామ్)

ఇందు హనుమంతుడు బాణోపమితుడు. అయినను బాణమునకు స్వయం గమనము లేదు. దాని గమనమునకు వెలుకాని ప్రేషణము-ప్రేరణ మవసరము. ఆంజనేయునికో! స్వయంగమనశక్తి యున్నది. అతనియందు చైతన్యశక్తి యున్నది. అత డహంకారమును జయించినయోగి. శక్తి మంతుడయ్యు పరమ భక్తుడుగాన పరమాత్మాధీనుడు. పరమేశ్వరేచ్ఛానుసారము ప్రవర్తించువాడు. కావుననే శ్రీరామాజ్ఞ నతడు శిరసావహించెను. రామ ప్రోత్సా హమే యాతని ప్రయాణమున కాధారము. అతడు

భగవదధీనుడు కనుకనే యతడు బాణసముడు. కేవలము నిమిత్త మాత్రుడన్నమాట.

'ఓ యర్జున! నీవు నిమిత్త మాత్రుడవుగానుండుము' (నిమిత్త మాత్రం భవసవ్యసాచిక) అన్న కృష్ణుని కర్జునుడు నిమిత్త మాత్రుడయినట్లే హనుమంతు డిచ్చట రామునికి నిమిత్త మాత్రుడయినాడు. రామునికి తన బాణమువలె నాంజనేయు డొక సాధన మయ్యె నన్న మాట. శ్రీరామ బాణములు తమ విధి కృత్యములను సాధించి, విజయవంతములై తిరిగి రాముని జేరునట్లు హనుమంతుడును దన విధి విధానములను నిర్వహించి మరలి శ్రీరాముని జేరగల్గెను.

ఇచ్చట నాంజనేయుడు తన్ను బోల్చుకొన్న బాణమును బట్టి యొక యుపనిషద్వచనము స్మర్తవ్య మగుచున్నది.

'ప్రణవము ధనుస్సుగ, నాత్మను బాణముగ జేసి లక్ష్య మగు బ్రహ్మమును సాధింపవలయును. ఈ ప్రయోగము కడు జాగరూకతతో నెనర్పవలయును. శరమువలె దన్మయుడై పోవలయును.'

(ప్రణవో ధనుశ్శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యమ్ శరవ త్తన్మయో భవేత్)

—ముండకోపనిషత్తు.

రామాజ్ఞను దన శిరస్థలమున దాల్చిన హనుమం
తుడు విష్ణువును దన భుజస్కంధమున దాల్చిన సుపర్ణుని
వలెనే బయలుదేఱెను. వీని వేగాతిశయమునకు వృక్ష
సంతతులు వేళ్లతో బెల్లగిల్లి తన వెనువెంట బర్విడి వచ్చు
చుండగా సైన్య నివహములు వెన్నాడుచున్న రాజోత్త
మునివలె నాతడు విరాజిల్లుచుండెను. ఆ వేగమునకు
జలజల రాలుచున్న పూలు ప్రకృతి యాతని బుష్పస్నా
నము చేయించుచున్నట్లు పొలుపుమీఱుచుండెను.

భగవత్కార్యార్థము మహా ప్రయత్నమునకు బూనిన
యాతని బంచభూతములు ప్రసన్నములై యాశీర్వదించు
చుండెను. సర్వ ప్రకృతియు బరిపూర్ణ వికాసముతో
స్వస్తివాచకము చదువుచుండెను. అతని తండ్రియగు
వాయుదేవుడు నాడు పుత్రోత్సాహముతో పొంగి
పోయెను. సూర్యుడు తన పుత్రామాత్య సుత్సాహము
గాంచి యుజ్జ్వలించుచుండెను. బుషిమునులు ప్రసన్న
మనస్కులై పరిఢవిల్లుచుండిరి. ఆకాశమున సంచరించుచు
నమరు లానందముతో నధిగమించుచుండిరి. హనుమ
త్ప్రయత్నమునకు దైవబలమిట్లు దోహద మొసగుచుం
డెను. విశ్వకల్యాణార్థము కృషిచేయుచుండు మహాత్ముల

జీవిత ఘట్టములం దిట్టి లక్షణములు – సూచనములు
దోచుచునే యుండును. ఇట్టి ఘట్ట మొకటి చూడుడు.

'దిక్కు–లు ప్రసన్నము లయినవి. మరుత్తులు సుఖ స్పర్శములయినవి. అగ్ని హోత్రము ప్రదక్షిణార్చిస్సు లతో హవిస్సునాదరింపదొడగినది. ఆక్షణమున సర్వము శుభశంసకముగా నున్నది. లోకాభ్యుదయమున కట్టిదే గదా జన్మము!

(దిశః ప్రసేదుః మరుతోవవు స్సుఖాః
ప్రదక్షిణార్చి ర్హవి రగ్ని రాదదే
బభూవ సర్వం శుభశంసి తత్క్షణం
భవోహి లోకాభ్యుదయాయ తాదృశం)

—కాళిదాసు.

మారుతి యొనర్చుచున్న ప్రయత్నము గూడ లోకా
. భ్యుదయమున కేగదా! కనుకనే సర్వమును శుభమయమై
శోభిల్లుచున్నది. హనుమంతుడు ధృతిమంతు డనుట కిది
యొక కారణము. ధృతియన కార్యసాఫల్యమునకు సమర్థ
మగు నిచ్ఛాశక్తి పాటవము. ఏ యున్నత కార్యసాధన
మునకైన నీ ధృతి యత్యవసరము. దీనికి దోడు భక్తి
యున్నచో నిక జెప్పవలసిన దేమియుండును! అప్పుడే
మానవుడు సంపూర్ణత్వమును సంపాదించును. ఈ మహా

కార్య సాధనలోగల్గు నాతంకముల నడచి, కష్టముల నోర్చి, సాహసముతో మున్ముందు సాగవలయును.

సముద్రలంఘనము

హనుమంతునికి సముద్రోల్లంఘనమున సంఘటిల్లిన ప్రప్రథ మాతంకము మైనాక పర్వతము. మైనాకము సువర్ణమయము. అది సుందర పురుష రూపముతో సముద్రముపైకి దలయెత్తి, యాంజనేయు నవలోకించి తా నిచ్చునట్టి మధురఫలములు గ్రహించి తన శిఖర తలమున నెకింతసేపువిశ్రమింపుమనియాతనినభ్యర్థించెను. హనుమానునితండ్రి - అనిలదేవుడు తన కొనర్చిన యుపకృతిని, హనుమ యిప్పుడు చేయబూనిన రామ కార్యమును దలపోసి తా నెనర్చుచున్న యీ యల్ప సమ్మానము నాదరింపుమని మైనాకు డాతని వేడికొనెను.

అయినను హనుమంతుడు దీని నాటంకముగనే తలపోసెను. (విఘ్నోనేయ మితి నిశ్చితః) తన తలపైనున్న కర్తవ్యభారమును దలపోయు బుద్ధిమంతు డనవసరముగ నాటవిడుపుల నాసించుచుండునా? కనుకనే మారుతి యీ యాహ్వానమును మన్నింపలేదు. విశ్రాంతికి వెంగలి గాలేదు. స్నేహపూర్వకముగా కాళ్లకు జుట్టుకొన్న యీ ప్రథమ విఘ్నబంధమును బటాపంచలు చేయుట

యందే పావని దూరదర్శిత్వము, పవిత్ర దృక్పథము ప్రకటమగుచుండును. ఆటంకముల నెదుర్కొని యడచి వైవజాలు ధీరుల దృఢసంకల్పము లిట్టులే గదా యుండును!

ఇది జరిగిన పదపడి పావని శక్తియుక్తులను బరీక్షింప గోరి దేవత లాతని మార్గమున కభిముఖముగ సురస యను దాని నంపిరి. సురస వికారరూపముతో సముద్ర మధ్యమున నాతని నడ్డగించెను. అది నాగమాత. నాగులు భోగులు గాన నిది భోగమును సూచించును. భోగము యోగమునకు సామాన్యమగు నాటంక మాత్రముగాక ప్రబలవిరోధి. యోగియగు నాంజనేయుని భోగముచే బరీక్షింపవలయునని దేవత లుద్దేశించిరి. కాని యోగారూఢుడు భోగాకృష్టుడగునటయా!

హనుమంతుడు తొలుదొల్త సురసను బ్రతిమాలెను. తన రామకార్యార్థము దెలిపి తనకు సాయముచేయు మని ప్రార్థించెను. 'విషయాభిలాషిణీ! నీవు రాముని కి సహా యముచేయ నర్హురాలవు' అని యభ్యర్థించెను.

(కర్తుమర్హసి రామస్య సాహ్యమ్ విషయవాసినీ)

అందులకు నెప్పకున్న సురసనుగాంచి వాయుపుత్రుడు వినయము మీఱ వేడికొనెను.

:— నేను లంక కేగి, సీతాదేవినిగాంచి, రాముని కావార్త చెవులవేసి, మరలివచ్చి నీ కాహారమయ్యేద జుమా !

సురస యీ మాట కంగీకరింపక యిట్లు పలికెను.

:—అట్లు కాదు. దానికి నేనంగీకరింపజాలను. నీవు నా నోట బడవలసినదే.

'ఆహారమును, కామమును, కండూతియు సేవించిన కొలదియు వృద్ధియగుచు నుండును' గదా!

(ఆహారః కామః కండూతిః సేవనాత్తు వివర్ధతే)

ఈ విషయమునే భగవద్గీత యిట్లు చెప్పుచున్నది.

'కామము అనుభవమువలన నెప్పుడును శమియింపదు. హవిస్సుచేత నగ్ని హోత్రము శమియింపక వృద్ధిపొందు నట్లు కామమును మఱింత యభివృద్ధినే పొందుచుండును'.

(న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే)

హనుమంతుడు యోగసిద్ధుడు. అష్టసిద్ధులు నతనికి హస్తగతములు. అతడు దన్ను మ్రింగదలపడ్డ సురస కంటె దన మహిమాసిద్ధిచే బెరిగి యురవయ్యెను. సుర సయు దన నోటిని నాతనికంటె విరివియొనర్చుకుండెను.

ఆమె యిట్లు తన యాస్యగహ్వరమును విస్తృత మొన
ర్చుచు నెనర్చుచు నుండగనే ప్రత్యుత్పన్నమతియగు
హనుమంతుడు తన యణిమాసిద్ధిచే సూక్ష్మరూపము
ధరించి, సురసా వదనగహ్వరమునుజొచ్చి, యామెనోర్చి
యనాయాసముగ బయటికి వచ్చెను.

పిమ్మట నతనికి గల్గిన యాటంకము సింహిక. సింహిక
యన హింసిక. మానవాత్మ యున్నతికేగ నుత్సహించు
నపు డాతని యింద్రియానీక మాతని నధోగతికి లాగ
యత్నించుచుండును. సింహిక యొనర్చిన చేష్ట యిదియే.
కనుకనే యిది ఛాయాగ్రాహిణిగా వర్ణింపబడినది. హింసా
కరణమే సింహికా స్వభావము. ఇంద్రియారాధకు లిట్టి
వారే యనవచ్చును గదా!

హనుమానుడు వెన్నెంట దాని యుదరమున బ్రవే
శించి, దానిని వదవదలుచేసి రాహు విముక్తమగు పూర్ణ
చంద్రునివలె వెల్వడెను. ఇంద్రియానీకము నిట్లు నిగ్ర
హించుటయే హనుమానుని యోగారూఢత. పూర్ణ
యోగి గావుననే హనుమంతు డిట్లు తనకు సంఘటిల్లిన
సకలాతంకములను జయింపగల్గెను.

ఏ కార్యమునుగాని సఫలతా పూర్వకముగా సాధిం
చుట కవసరములగు గుణములు నాలుగు. అవి ధృతి,

ఆలోచన, మతి, సమర్థత. ఆ గుణములు గలవా డెన్నడు గాని వ్యర్థుడు గాడు. హనుమ కీ నాల్గు గుణములు సమృద్ధములుగదా!

(యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర యథా తవ
ధృతిః దృష్టి ర్మతిః దాక్ష్యమ్ స్వకర్మను నసీదతి)

తనకు గల్గిన యీ యాటంకము లను సోపానముల మీద నాంజనేయు డంభోరాశి నవలీలగా దాటి యావలి కేగెను. కాళిదాసన్నట్లు 'నిర్మముడగువాడు సంసారము నుత్తరించునట్లు హనుమానుడు సాగరమునుత్తరించెను.'

(హనుమాన్ సాగరం తీర్ణః సంసార మివ నిర్మమః)

'ఈ వానరుడు తాను చేయనడుముగట్టిన కార్యము ప్రతిలేనిది, దుష్కరమైనది.'

(దుష్కరం నిప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః)

'ఆజానుబాహువున కందదగిన ఫలము నాసించి కరములు పైకెత్తిన మఱిగుజ్జువానితో' కావ్యనిర్మాణము నకు బూనిన తన్ను బోల్చుకొన్నాడు కాళిదాసు.

(ప్రాంశు లభ్యే ఫలే లోభా దుద్బాహు రివ వామనః)

అట్లే యిప్పుడు వానరుడును దుష్కరమును, అప్రతిమానము నగు కార్యమును జేయ దలపెట్టినా డని మహర్షి యగు వాల్మీకి యనుచున్నాడు.

తాను ప్రార్థించిన కవి యశమును ధన్యతా పూర్వక
ముగా కాళిదాసు సంపాదించినట్లు అప్రతిద్వంద్వమును,
దుష్కరమును నగు కార్యము నీ వానరుడు సాధించునను
వాల్మీకి భావమును మనము విశ్వసింపవచ్చును. వాల్మీకి
వెల్లడించిన యీ భావమే కాళిదాసు గ్రహియించి
యున్నట్లు మన మూహించుట ప్రమాదముగాదు.

లంకాపురము

హనుమంతుడు మహాసముద్రము నట్లుల్లంఘించి
లంకాతీరమున - సముద్ర ప్రాంతమునగల త్రికూట పర్వ
తాగ్రముపై వ్రాలెను. వ్రాలి యీ పర్వతము మీద
నున్న లంకాపురమును గాంచెను.

లంకాపురము రావణ రాజధాని. ఇది విశ్వకర్మ నిర్మి
తము. అనగా రాజధానీ నగరమున కుండవలసిన సమగ్ర
లక్షణ సంశోభితము. పరరాజ దుర్గ్రహములగు దుర్గ
ములచే నిది పరిఢవిల్లుచుండును.

దుర్గములు షడ్విధములని రాజకీయ శాస్త్రము చెప్పు
చుండును.

(ధన్వ దుర్గం మహీ దుర్గ మబ్దుర్గం వార్క్ష మేవ వా
నృదుర్గం గిరిదుర్గం వా సమాశ్రిత్య వసే త్పురమ్)

అవి మరు భూ జల వృక్ష నర గిరి దుర్గములు. ఇందు జలాది దుర్గములు సహజములనియు, కృత్రిమము లనియు మరల నిఱు దెఱుగుల నుండును.

లంకా నగరము సముద్ర పరివేష్టిత మగుటచే సహజ జలదుర్గము దానికి సంరక్షకమై యున్నదనుట స్పష్టమే. దీని నాక్రమించుట శత్రురాజులకు స్వప్నవార్త. శత యోజన విస్తీర్ణమగు నీ సముద్రమును దాటి 'లంక జొచ్చుటకు నల్వురు మాత్రమే సమర్థులట. వారు సుగ్రీవాంగద హనుమ న్నీలులు'

(చతుర్ణా మేవ హి గతి ర్వానరాణాం తరస్వినాం
వాలి పుత్రస్య నీలస్య మమ రాజ్ఞశ్చ ధీమతః)
(యోజన మనగా సుమా రాఱుమైళ్లు.)

ఇట్టి విశాల సముద్ర పరివేష్టనమేగాక కోట చుట్టును గంభీర పరిఖలు - పద్మోత్పలాలంకృతములు గలవు.

ఇం దవిషమమై శత్రువులు కాలూన రాని పర్వతము లుండుటచేనది గిరిదుర్గరక్షితమనియు ప్రకటమగుచున్నది. వప్రము చుట్టును సాంద్ర కాననములు సమృద్ధములుగా నున్నవి. ఇదియే యరణ్యదుర్గము. శతఘ్నులు, ఉగ్రధను స్సులు, శూలాద్యాయుధములను దాల్చిన క్రూర రాక్ష సులు పట్టనమును భద్రముగా గాచుచుందురు. ఇదియే

నర దుర్గము. కాంచన ప్రాకారము శత్రుదుర్భేదమై దానిని గాపాడుచుండును. పాండురములగు ప్రతోలికలు (రథ వీధులు), వందలకొలది యట్టాలికలు (కోట బురుజులు), పతాకా ధ్వజములు, దివ్యములగు కాంచన తోరణములు, కాంచన లతాపంక్తులు, ప్రాసాద మాలావితతులు, పాండురములగు రాజభవనములు గల్గి యది గగన పురమువలె గానవచ్చుచున్నది. ఆపట్టనము వప్రప్రాకారము లను జఘనముతో, విపులమగు జలవన ములను చీరదాల్చి, కోటకొమ్మలమీద గూర్చియుంచిన శతఘ్ని శూలము లను కేశజాలముతో, నట్టాలకము లను నవతంసముతో మత్తకాశినివలె ప్రకాశించుచుండెను. కైలాస పర్వతమువంటి యున్నత భవనము లాకాశము నెఱయుచున్నవి. క్రూర సర్పములవంటి రాక్షసబృందము పట్టనము నెల్లెడల బరికించుచుండెను. అందు గదలుచున్న యాకేని వారికి దెలియనిది లేదు.

అది కాంచన సన్నిభములగు స్తంభములతో, స్వర్ణ నిభములగు గవాక్షములతో, ఏడెనిమిది యంతస్తులుగల సౌధములతో (సప్త భౌమాష్ట భౌమైశ్చ), స్ఫటిక శిలలుగూర్చిన స్థలములతో, పాండురావిద్ధములగువిమాన మాలలతో (సపాండు రావిద్ధ విమాన మాలినీ)

నమరావతివలె నలరారుచుండెను. అందలి శిల్ప మనల్ప సుందరమై యది మనోనిర్మితమువలె (మనసేవకృతాం లంకాం) నానందకరమై యున్నది.

అది రమ్యకాననతోయాఢ్యము; (రమ్యకాననతో యాఢ్యం.) సుపుష్టమైన చతురంగ బలములచే బరిపుష్ట మైనది; (సుపుష్టబలసంపుష్టామ్.) అది పాండుర ద్వార తోరణ పరిశోభితము; విద్యున్మే ఘా కీర్ణ సన్నిభము; (సవిద్యుద్ఘనాకీర్ణామ్.) జ్యోతిర్గణ నిషేవితము; (జ్యోతిర్గణ నిషేవితామ్.) కింకిణీజాలావృత పతాకాభాసితము;

(కింకిణీజాల ఘోషాభిః పతాకాభి రలంకృతామ్)

జాంబూనద ద్వార వైదూర్య వేదికాలంకృతము;

(జాంబూనదమయైః ద్వారైః వైదూర్యకృత వేదికైః)

అది వజ్రస్ఫటిక మణి సమూహ కుట్టిమ భూతలము;

(వజ్ర స్ఫటిక ముక్తాభి ర్మణి కుట్టిమ భూషితైః)

ఆకాశమున కెగురుచున్న ట్లున్న క్రౌంచ మయూర రాజ హంస నిషేవిత వైదూర్య సోపాన పాంక్తికము;

(వైదూర్య కృతసోపానైః స్ఫాటికాంతర పాంసుభిః చారుసంజీవ నోపేతైః ఖ మి వోత్పతితై శ్శుభైః క్రౌంచ బర్హిణ సంఘుష్టై రాజహంస నిషేవితైః)

తూర్యాభరణ నిర్ఘోష ఘూోషితము;
(తూర్యాభరణ నిర్ఘోషై స్సర్వతః పరినాదితామ్)
మటియు రత్నవసనములచే, గోశాలావతంసములతో, యంత్రాగార స్తనములతో భూషితయగు ప్రమదామణి వలె సమృద్ధమైనది;
(తాం రత్నవస నోపేతాం గోష్ఠా గారావతంసికాం
యంత్రాగారస్తనీ మృద్ధాం ప్రమదా మివ భూషితాం)
కపట ముద్గరములు (ఇనుప గుదియలు), దండములు, ధనుర్బాణములు, ఖడ్గములు, శతఘ్నులు, శూలములు, ముసలములు, పరిఘలు (ఇనుపకట్లగుదెలు) విచిత్ర కవచములు, శక్తులు, వజ్రములు, (అడ్డకత్తులు), అశనులు, (పిడుగులతో గూడిన మెఱుపుల వంటి యాయుధములు) తోమరములు, (ఓడనడపు గడల వంటి యాయుధములు) పాశములు మొదలగు పెక్కాయుధములను ధరియించిన రాక్షసులు కడు జాగరూకతతో నా పురమును గాచుచుండిరి.

వివిధమాలాధరులు, సుగంధానులిప్తాంగులు, స్వాభరణభూషితులు, నానావేష సమాయుక్తులు, స్వచ్ఛ కౌముదీ రాత్రిసమయమున సవిలాసముగ నందు జరియించుచుండిరి.

అశ్వములు, అద్భుతాశ్వములు చెవులు చిల్లులు పడునట్లుఅచుచుండెను. భద్రగజములు, శరన్మేఘ తండ ములవలె నున్నతములైన చతుర్దంత దంతావళములు, రథములు, యానములు, విమానములు ననేకము లండుండెను.

(వారణైశ్చ చతుర్దంతైః శ్వేతా భ్ర నిచ యోపమైః
భూషితై రుచిరద్వారం మత్తైశ్చ మృగ పక్షిభిః
రథై ర్వా నై ర్విమానైశ్చ.....)

భూషితములు, మదోన్మత్తములు నగు మృగపక్షుల చేతను, రాక్షస సహస్రములచేతను ప్రాకారద్వారములు రక్షింపబడుచుండెను.

రాజనీతివిశారదుడును, మహాబలశాలియు నగు రావణ పాలితమగు నిట్టి లంకాపురమును గాంచుసరి కాంజ నేయుని కొడలు జలదరించెను. లంకా రక్షణ ప్రయత్నా దులనుగాంచి నివ్వెఱ పాటొందెను.

ఆతడిట్లు పరిపరివిధముల భావించెను. 'ఇది సామము చేతగానీ, దానముచేతగానీ, భేదముచేతగానీ, యుద్ధము చేతగానీ జయింపదగినదిగాదు'.

(అవకాశో న సామ్నస్య రాక్షసే ష్వభిగమ్యతే
న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే)

దీని నే విధమున బ్రవేశింపనేర్తును ! ఏ యుపాయము చేత సీత నవలోకింపగల్గుదును! రాముని కార్యము నెట్లు సాధింపనోర్తును ! ఒకవేళ వానరు లిచ్చటికి వచ్చినను వారు చేయగల్గునదేమి?

(అగత్యా పీహ హరయో భవిష్యంతి నిరర్థకాః)

మహాబాహువగు దాశరథి వచ్చియు నిచ్చట చేయ గల్గునదేమియు గానరాదు.

(ప్రాప్యాపి సుమహాబాహుః కిం కరిష్యతి రాఘవః)

ఈ కార్య మెట్లు చెడిపోవకుండ సాధింపనగును ? ఎట్లు ధైర్యమును జిక్కబట్టుదును ? ఈ మహాసముద్రమును దాటుటకు బడ్డ యీ నాశ్రమ వృథా కాకుండుట యెట్లు?

(న వినశ్యే త్కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్ లంఘనంచ సముద్రస్య కథం ను న వృథాభవేత్')

ఇట్లు పలువిధముల విచారించుచు విచారించుచు మాయాదక్షులగు రాక్షసులను కపటరూపముచే గన్ను బ్రామియే సూక్ష్మరూపమున దాను లంకాపట్టనము జొర నిశ్చయించుకొనెను.

ఇంతలో శంఖప్రభయు, క్షీరమృణాలవర్ణమునుగలిగి సరోవరమునుండి పైకిలేచు రాజహంసమువలె నాకాశ మున చంద్రుడు తోచెను. ఆ చంద్రుడు హనుమంతునకు

సాచివ్యము నెఱపవచ్చినట్లు తారాగణముల మధ్యమున విరాజిల్లుచు, ననేక సహస్రరశ్మియయి జ్యోత్స్నా వితాన ముతో లోకముల నావరించుచు నుత్తిష్ఠుడయ్యెను.

ఇట్టి సమయమున మార్జార రూపమున పురిలోనికి జొచ్చుచున్న హనుమంతునకు లంకాధిదేవతయగు లంక గానవచ్చెను. అది లంకాపురమునందలి విపరీత శక్తులును, భోగములును మూర్తీభవించి రూపొందినది. ఇది భౌతిక సంపదలతో నెంత ప్రకాశించుచున్నను నాంతరంగికోన్నతి యావంతయు నందలేదు.

అట్టి లంకిణి హనుమంతుడు గానబడినంతనే వాని నడ్డగించెను. అడ్డగించి 'యోయీ! నేన యీ లంకాపురిని; (అహం హి నగరీ లంకా'.)అని యహంకృతితో నఱచుచు 'నన్ను జయింపక నీవీ లంకను జొఱలే'వని ఘోంకరించెను.

లంకాధిదేవతను నిర్జించుట యన లంకను జయించు టయే. అత డాలంక ననాయాసమున నిర్జించెను.

సాగరమును, లంకాత్మను నిట్లు ప్రత్యక్షమొనర్చు కొని 'మహాబాహుడగు హనుమంతుడు ద్వారమున ప్రాకారము పైకెగిరి, పురమున ప్రవేశించి శత్రు మూర్ధమున నుంచినట్లు ముందు వామపాదము నుంచెను.'

(అదాశ్వేన మహాబాహుః ప్రాకార మభి పుష్లువే
ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజ హితంకరః
చక్రేఽథ పాదం సవ్యంచ శత్రూణాం సతుమూర్ధని)

అందు వివిధరూప శోభితములగు భవనరాజములు కనులపండువుగ నుండెను. త్రిస్థానస్వర భూషితములగు గీతములును, మదనవిధ్వలగు నప్సరసలవంటి స్త్రీల మొల నూళ్లయు, వారి యందెలయు నినాదములును వీనుల విందు చేయుచుండెను.

అందందును రాజభక్తిపరులగుటచే సామముచే వారిని లోగొనుట సంభవముగాదు. వారు ధనమదాంధులగుటచే దానోపాయము వారియెడ వ్యర్థమేయగును. వా రెల్లరు రాజాజ్ఞాబద్ధులయి యొక్క త్రాటిమీద నడచుచుండుటచే భేదమున కాదరువులేదు. వారు బలోన్మదులగుటచే దండప్రయోగమున కందవకాశము గానరాదు.

ఆ పురము సురాసురులకుగూడ దురాధర్షమైనది. గూఢ ముగనుండి పట్టనమును కనుగలిగి కాపాడువారు పెక్కు రున్నారు. మహాధనుర్ధారులగు వీరు లనేకు లంతటను సంచరించుచున్నారు. వాయువుగూడ నచ్చట నజ్ఞాతము గనే సంచరించుచున్నట్లుండెను.

అది నీలములగు పచ్చిక పట్టులతో, గంధవంతములు, మధుమంతములు నగు వన సమూహములతో, కల కల లాడు వనప్రదేశములతో, తరురాజములతో నిండిన పర్వత పార్శ్వములతో, వనోపవనములతో గనులకు పండువు సేయుచుండెను.

(వనా న్యుపవనా నీహ లంకాయాః కాననాని చ)

ఆ వనములలో సరలములు, కర్ణికారములు, సుపుష్పితములగు ఖర్జూరములు, ప్రియాలములు, ముచువింద ములు, కుటజములు, కేతకములు, గంధపూర్ణములగు ప్రియంగువులు, నీపములు, ఏడాకులఅటులు, అసనములు, కోవిదారములు, పుష్పితములగు కరవీరములు సాంద్ర ములై సంశోభిల్లుచున్నవి.

దీర్ఘికలు, జలాశయములు హంస కారండవాది పక్షు లతో, పద్మోత్పలాదిపుష్పజాతముతో ప్రకాశించుచున్నవి.

లంకా పట్టనమును జూచినచో నది ప్రకృతిసంపదచే నెంత భవ్యమైయున్నదో, పరిపాలనమున నెంత పర భయంకరమై, పటిష్ఠమై యున్నదో, పౌరు లెంత సంప న్నులై యున్నారో మనకు స్పష్టముగాగలదు. వారెంత యైహిక భోగజాలముల ననుభవించుచు నత్యున్నత దశ నందియున్నారో మనకు దెలియగలదు.

ఇంతియగాక మఱియొక విషయమును గమనింపుము. రామాయణ రచనా కాలమునాటికి నౌకానిర్మాణకళ భారతీయులకు దెలియునని మనము దెలిసికొనవచ్చును. గుహుడు శ్రీరామాదులను గంగానది దాటించిన పడవను మనము తిలకించియుంటిమి. అయినను వానరులకు మాత్ర మాపరిశ్రమ, ఆ యానసాధనము తెలియునో లేదో మనము చెప్పజాలము. వారు కిష్కింధా వాసులగుటచే- జలదూరస్థితులగుటచే వారి కాసాధనములతో నట్టి యవసరమును గానరాదయ్యెను. అవి లంకా రాజ్యమున నున్నవని మనము నిరూపింపలేక పోవచ్చును. వాల్మీకి లంకలో నౌకలున్నట్లు చెప్పలేదుగాన నాపరిశ్రమ యానాటి భారతీయులకు దెలియదనుట మాత్రము మన విమర్శకులకు సులభమే.

కాని యిచ్చట వాల్మీకి సముద్రముపై నట్టిట్టు తిరుగుచున్న హనుమంతుని మహాసముద్రమున 'ప్రతికూల వాయువుచే నటునిటు తిరుగుచున్న మహా నౌక'తో నుపమించియున్నాడు.

(ప్రతిలోమేన వాతేన మహానౌ రివ సాగరే)

దీనినిబట్టి మహానౌకలు సముద్రములో దిరుగుట యా నా డెరుగుదురని మన మూహింపనగును.

రావణాంతఃపురము

అచ్చటినుండి యాతడు నిర్మల జాంబూనద చక్ర వాలములును, మహా మూల్యములును నగు ముక్తామణి భూషితాంతమును, కాలాగురు చందనాంచితమును నగు నా యంతఃపురమున హనుమంతు డల్లనల్లన ప్రవే శించెను. అప్పుడు చంద్ర డాకాశ మధ్యంగతుడై జ్యోత్స్నావితానము వెలిగ్రక్కు-చుండెను. ఆచంద్రుడు గోశాలలోనున్న మదించిన వృషభేంద్రమువలె బ్రకా శించుచు, లోక కశ్మలమును బ్రక్షాళించుచు, మహా దధి నుప్పొంగించుచు సర్వభూతలములను బ్రకాశింపజేయు చుండెను.

భూలోకమున మందరమునను, ప్రదోష సమయము లందు సాగరమునను, తోయములందు పద్మములను బ్రకాశించు లక్ష్మి యిప్పుడు సుందర చంద్రబింబమున నుండి శోభిల్లుచున్నది. గగనరంగమున కమనీయమై కాంతిల్లుచున్న యా చంద్రబింబము రాజత పంజరమున నున్న రాజహంసమువలె, మందర కందరమునన్న సింహ రాజమువలె, గర్విత కుంజరమువినాదనున్న వీరవరునివలె విభాసిల్లుచున్నది. ఆ చంద్రుడు తీక్ష్ణ శృంగములుగల వృషభరాజమువలె, నూర్ధ్వశృంగములుగల కైలాస

పర్వతరాజమువలె, జాంబూనద బద్ధ శృంగములుగల హస్తి రాజమువలె పరిపూర్ణ శృంగములతో బ్రకాశించు చుండెను. ఆ చంద్రదేవుడు వినష్టమైన శీతవారి తుషార పంకమును, మహాగ్రహసమూహముచే వినష్టమైన పంకమును, ప్రకాశలక్ష్మి కాశ్రయమైన నిర్మలాంకమును గల్గి విరాజిల్లుచుండెను. మృగేంద్రుడు శిలాతలమునుజేరియు, గజేంద్రుడు మహారణమును బ్రాపించియు, నరేంద్రుడు రాజ్యమును బొందియు బ్రకాశించునట్లూ చంద్రుడు శోభిల్లుచుండెను. ఆ సమయమున నంధకారము నశించినది. రాక్షసుల మాంసాశ దోషము ప్రబలినది. రామామణులకును, నభిరాములకును చిత్తదోషముచెలరేగినది. వర్షాకాలము గడచన్నదిగాన నప్పుడు నిర్మలాకాశమున జంద్రుడట్లు ప్రకాశించుట సహజము.

ఆ విమానములయందు దిరుగుచు దిరుగుచు రావణ గృహమును బ్రవేశించెను. దాని చుట్టును సూర్యునివలె బ్రకాశించుచున్న బంగరు ప్రాకారము శోభిల్లుచున్నది. భీమములగు సింహములచే గాపాడబడుచున్న మహావనమువలె నది భీమరాక్షసులచే రక్షింపబడుచున్నది. హేమభూషణములగు తోరణములచే, విచిత్రములగు కట్యములచే, ద్వారవారములచే నది విలసిల్లుచున్నది.

అచ్చటి ప్రమదారత్నము లెల్లరు ముదితలై యల రారుచున్నారు. ప్రముఖలగు స్త్రీ రత్నములు పరిపూర్ణ ముగ నున్నారు. ఆ మందిరము వరాభరణ సంహ్రాదము లచే సముద్రమువలె సంకులనాదితమై యున్నది. శ్రేష్ఠము లగు చందనములచే జెలగుచున్నది. భేరీ మృదంగాభి రుతము, శంఖఘోష నినాదితమునయి లంకాభరణము వలె మెఱయుచున్నది. అందు మహా వేగాభిశోభితము లగు గుఱ్ఱములు, కులీనములగు గజములు వేలకొలదిగ నున్నవి. వివిధాకారములగు పల్లకులు, మేనాలు, చిత్ర ములగు పొదరిండ్లును, చిత్రశాలా గృహములును, దారు శిలానిర్మితములగు క్రీడాగృహములు నున్నవి. వారుపయోగించు మంచములు, పీటలు, ఆసనములు, పల్లేరములు స్వర్ణమయములు. ఆ యిల్లు మధ్వాసవముచే కిన్నమైనది. మణిభాజన సంకులమైనది.

ఆ ప్రకాశ సమయమున హనుమంతుడు సీతాదేవి నన్వేషించుచు పట్టణ మెల్లెడల దిరుగుచుండెను. అప్పు డతనికి కర్ణసుఖముగై వీణానాదములు ప్రవర్తిల్లినవి. భర్తృగాఢ పరిరంభణములచే స్త్రీలు గూరుకుచున్నారు. రాత్రించరు లత్యద్భుత రౌద్ర వృత్తులై విహరించు చున్నారు. గృహములు మత్తప్రమత్త సామూహిక

ములయి, రథాశ్వ భద్రాసన సంకులములయి, వీరలచ్మ్మి సమాకులములయి రొప్పారుచున్నవి.

దంపతులు పరస్పర గాఢాలింగములును, వీనము లగు భుజబంధ పాశములును గలిగి, మత్త ప్రలాపములు విసరుకొనుచు శయనించి యుండిరి. పరిరంభణాసక్తలగు వారును, తిరిగి నిద్రామత్తులగువారును, సురూప ముఖ ములు గలవారును, పరిహాసములతో ప్రల్లదములాడు వారును, కోపవశమున ఱొప్పువారునునగు స్త్రీ లాతనికి గంటబడ నారంభించిరి.

ఆ యాంజనేయు డచ్చటి వింత వస్తువులను గాంచి యానందించెను. కాని వింతవస్తువుల నెన్నిటిని గాంచి యును సీతాసతి గాన రామిచే నాతనికి దుఃఖమే పైకొని యెను. 'మనుజేశ్వరుడగు రాముని భార్యను గానలేక హనుమంతుడు పెద్దకాలము మందునివలె దుఃఖించెను.'

(సీతా మపశ్యన్ మనుజేశ్వరస్య
రామస్య పత్నీం వదతాం వరస్య
బభూవ దుఃఖాభిహత శ్చిరస్య
ప్లవంగమో మంద ఇవాచిరస్య)

సీతాన్వేషణ తత్పరుడైయున్న యాతని కామె దర్శ నము గలుగకపోవుటచే దుఃఖ మతి వేలమగుచుండెను.

అతనికి పరిపరి విధముల భావ పరంపరలు గలుగ దొడ
గెను. తరువాత నతడు మఱియొక భవనమున బ్రవేశించెను.

సర్వభోగ సంశోభితమును, సుగంధ ఘుమ ఘుమా
యితమును నగు నా రాక్షసేంద్రుని శయ్యాగారమును
గాంచి హనుమంతు డాశ్చర్యమగ్నుడయ్యెను. ఆహా! 'ఈ
లంకానగరము తల్లివలె నుత్తమములగు పంచవిధ వస్తు
జాతముచే పంచేంద్రియములను దనుపుచున్నది.'

(ఇంద్రియా ణీంద్రియార్థైస్తు పంచ పంచభి రుత్తమైః
తర్ప యామాస మాతేవ లంకా రావణ పాలితా)

ఇంతియగాక యది దీపముల కాంతులచేతను, రావణ
తేజస్సుచేతను, భూషణార్చులచేతను దీపించుచుండెను.

(దీపానాంచ ప్రకాశేన తేజసా రావణస్యచ
అర్చిర్భి ర్భూషణానాంచ ప్రదీ ప్తేత్యభిమన్యత)

కాని యెంత ప్రయత్నించినను సీతాదేవి జాడ
మాత్రము గానరాలేదు. ఆమె గానరామిచే కరము
దుఃఖాభిహతుడై హనుమంతుడు నిర్భ్రాంతపడుచుండెను.

ఇట్లు కంట వత్తిడుకొని తిరుగుచు దిరుగుచు ప్రధాన
శంఖాయుధ ధనుశ్శాలలును, చంద్రశాలలును బరిశీలిం
చెను. కాని సీత కంటబడలేదు.

హనుమంతు డిట్లు కన్నుగలిగి సీత నన్వేషించుచు నన్వేషించుచు నుండగా నాతనికి రావణ విమాన గృహము దృష్టిగోచర మయ్యెను. అందు బహురత్నాకీర్ణమై పరమ శోభచే బ్రకాశించుచు, నానా వృక్ష పుష్పావకీర్ణమై మహీతలమునందలి స్వర్గమువలె, బహుచంద్ర చిత్రిత మైన యాకాశమువలె, బహుధాతువర్ణితమైన పర్వత శిఖరమువలె ననేక సుందర మేఘ సంపుటీకరణమువలె నున్న విమానము కన్నులు మిఱుమిట్లు గొన్నది.

అది నీలమణి స్థగితము. నీలమణులెట్టివో రత్నశాస్త్ర మిట్లు చెప్పుచున్నది. 'నీలమణిని క్షీరముల నుంచినచో నా క్షీరములన్నియు నీలవర్ణము నొందును.'

(క్షీరమధ్యే క్షిపే న్నీలం క్షీరంచే న్నీలతాం వ్రజేత్
ఇంద్రనీల మితి ఖ్యాత మితి చాగస్త్య భాషితమ్)

'ఆ విమానభూమి పర్వతసమూహ పూర్ణముగాను, ఆ పర్వతములు వృక్షవితాన పూర్ణములుగాను, ఆ వృక్షములు పుష్పసంతాన పూర్ణములుగాను, ఆ పుష్పములు కేసరపత్ర పూర్ణములుగాను జేయబడినవి'.

మహీకృతా పర్వతరాజి పూర్ణా
శైలాః కృతా వృక్ష వితాన పూర్ణాః

వృక్షాః కృతాః పుష్పవితాన పూర్ణాః
పుష్పం కృతం కేసర పత్ర పూర్ణమ్)

ఆ యింటనున్న వా రెల్లరు గాఢ నిద్రాపరవశులై యుండిరి. హనుమంతుడు సర్వము వీక్షించెను. అంతఃపురాంగన లెల్ల రన్యోన్య స్నేహభావముతో నున్న ట్లతని కవగతమయ్యెను. వా రెల్లరు రావణునియం దనురాగబద్ధులై యుండిరి.

ఎంత గాలించిన నా వాయుసూనుని కా రామపత్ని మాత్రము గానరాలేదు. రావణుని వైభవమును, ఆతని రాజ్యపరిపాలనా నిబంధమును గాంచుచున్న హనుమంతుడాశ్చర్యమగ్నుడై యిట్లు తలపోసెను.

'ఔరా! ఇట్టి పవిత్రురాలగు రాఘవ ధర్మపత్ని నిట్లీతడు గొనిరాకపోయినచో నితనికి ముప్పులేదుగదా! ఈతడు తనవలె నితరుల మేలునే గోరి యున్నచో సర్వము శుభంకరముగనే యుండెడిదే. ఈ పర స్త్రీ లోలత్వమే యితనికి వినాశము గూర్పనున్నట్లున్నది.'

హనుమంతుడు రావణుని యతిశయమును, అసామాన్య లక్షణముల నెల్ల నాతని కార్యముల వలననే గ్రహించెను. అతనికి గల్గనున్న కీడును గూర్చి పాపమాతడు విచారగ్రస్తుడయ్యెను.

ఇచ్చట నొక చిన్న ధర్మసంశయము గలుగవచ్చును. ఏమన: 'సీత పరమ పతివ్రత యని పావనికి దెలియును గదా! అట్టి యామెను రావణ శయ్యాగారమునన యన్వేషింపవలయును? ఆ పతివ్రతారత్నము తన ప్రాణ త్యాగమునకైన నెప్పుకొనునుగాని యాతని శయ్యా గృహమున నుండ నంగీకరించునా?'

'ఒకానొక కాంత నన్వేషింపవలయునన్న కాంత లుంపుచోటనే యన్వేషింపవలయునుగాని తక్కినచోట్ల గాదుగదా! కాంతను మృగములలో వెదకరాదుగదా!'

(యస్య సత్వస్య యామోని స్తస్యాం తత్పరిమార్గ్యతే
న శక్యా ప్రమదా నష్టా మృగీషు పరిమార్గితుం)

కనుకనే యాంజనేయుడు సీతాదేవి నా స్త్రీలున్న యచ్చట వెదకబూనెను. మఱియు సీతానురక్తుడగు రావణుడు తాను తన యంతఃపురమునంద యామె నుంచు నని యాతడు భావించెను. వియోగావస్థయందు గానబడు చున్న రాముని సీతానురాగ దార్ఢ్యమునుబట్టి సతీరత్న మగు సీతాకాంతయు నట్టి యవస్థనే యనుభవించు చుండునని హనుమంతుడు చక్కగ నూహించెను. ఆ యంతఃపురమునందలి యన్ని భాగములు నా రాత్రివేళ

గన్నుపొడుచుకొని గాలించెను. ఇదియే యాతని యంతఃపురాన్వేషణమున కంతిమ తలము.

యోగీశ్వరుడు భగవాను నన్వేషించు తెఱగున హనుమానుడు సీతాదేవి నన్వేషించెను. ఈ నిర్మిత ప్రపంచమునం దెంత పరిశీలించియు నా జగన్నిర్మాతృ మూర్తిని గాంచుట యసంభవము. కనుకనే యుపనిష త్తిట్లు పలుకుచున్నది.

'బ్రహ్మాన్వేషణ తత్పరుడు కర్మప్రాప్తములగు లోక ములను పరీక్షించి నిర్వేదము నొందును'

(పరీక్ష్య లోకాన్ కర్మచితాన్
బ్రాహ్మణో నిర్వేద మాయాత్).

—ముండకము.

అంత నాత డొక సమర్థ గురువు నాశ్రయించును.

(త ద్విజ్ఞానార్థం స గురు మేవాభిగచ్ఛేత్).

ఆ గురు వాతనికి బ్రహ్మపద మార్గమును బోధించును.

పెక్కు ప్రయత్నములు చేయక మహాఫల మెప్పుడును లభియింపబోదు. విఘ్నములు, వైఫల్యములు తటస్థింపక ఫలము లూరక ప్రాపింపవు. గురు ప్రేరణాశక్తి ప్రభావము లేక విజ్ఞానము వికసింపబోదు. ప్రయాసము లేక ప్రజ్ఞాన మనుభవగతముగాదు.

మన ప్రయత్నములందు, కార్యములందు 'అహం' ప్రబలముగ నుండును. అది నశించి, శరణాగతి నొంది నప్పుడే పరమాత్మ దర్శనము కాగల్గును.

ఇట్టి యన్వేష ణావసరములందు భ్రమ ప్రమాద ములు గల్గుట సహజము. వీని మూలమున బెక్కు రధో గతి పాలగుటయు విపరీతముగాదు.

ఇట్టి భ్రాంతిమూలమునే యాంజనేయుడు తక్కిన యంతఃపురాంగనల కొకింత దూరమున బన్నుండియున్న యొక సుందరాంగిని గాంచి యామె సీతాదేవియై యుండునని యూహించెను.

(తర్క-యామాస సీతేతి రూపయౌవన సంపదా).

రూపసాదృశ్యముచే నతడు మోసపోయెను. వెలవెల బోని యౌవనమును, తలతలలాడుచుండు కాంతిపుంజ మును నుత్తమ స్త్రీల గుణములుగ నాత డూహించెను. అంతఃపు రాంగనా రత్నమగు నామెను గాంచినంతనే హనుమాను డానంద పరవశుడయ్యెను. ఆపారవశ్యమున 'తన వాలమును నేలపై జఱచెను, దానిని ముద్దులాడెను, పొంగిపోయెను, గంతులు వైచెను, కూనరాగము దీసెను, అటునిటు పచారులు చేసెను, స్తంభమువైనె క్కెను,

తన వానర స్వభావము దెల్లమగున ట్లచ్చటినుండి గుబా
లున నేలమీద బడెను.'

(ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
ననంద చిక్రీడ జగౌ జగామ
స్తంభా నరోహ న్నిపపాత భూమౌ
నిదర్శయ న్స్వాం ప్రకృతిం కపీనాం).

ఎంత చక్కని వర్ణనము! వానర స్వభావ మెంత సహ
జముగ, మనోహరముగ చిత్రింపబడినది !

కాని హఠాత్సంభూతమగు నీ భ్రాంతి యతనికి చిర
కాల ముండ లేదు. సక్రమాలోచనా పూర్వము నధిరో
హింపగనే యీ భ్రాంతి యతనిని వీడిపోయినది.

అతనికి గల్గిన యాలోచన మిది. 'తన కాంతుడగు
శ్రీరామచంద్రుని వీడి పతివ్రతారత్నమగు సీతాసతి
యిట్లొండలు మఱచి నిద్రించునా? ఆమె రుచిమ త్పదార్థ
ములను భుజియింపగలదా? పానీయములను సేవించునా?
లేదు. ఈమె సీతగాక మఱియొకరై యుండవలయును.'

(అవధూయచ తాం బుద్ధిం బభూ వావస్థిత స్తదా
జగామ చాపరాం చింతాం సీతాం ప్రతి మహాకపిః).

ఈ యాలోచనా పాటవము వలన నాతని ప్రమాదము
పటాపంచలయ్యెను. ఆతనియనవస్థిత బుద్ధి యడుగంటెను.

ఇట్లతని కతని పవిత్రాత్మయే గురుత్వము వహించెను;
'తన యాత్మయే తనకు బంధువనుట సత్యమేయగునుగదా!'

(ఆత్మైవ హ్యాత్మనోబంధుః.)

తరువాత నతడు పానభూమియందు బరీక్షింపనరిగెను. అందు పలువిధములగు మాంసములు, మద్యాది పానీయములు విపరీతముగ గూర్పబడి యున్నవి. వానినిజూచి నంతనే సాధుపురుషుల కా లంకావాసుల రాక్షసత్వము ప్రస్ఫుటమగుచుండును. మద్య మాంసముల నట్లు సేవించుచుండువారు రాక్షసులు గాక మఱియేమగుదురు?

సాధువులమాట యెట్లున్నను నా కాలమున గాము కులు - స్త్రీ పురుషులు - మదంకరములగునట్టి మద్యము లను రాత్రులయందు సేవించుచుందురట.

'సుగంధులగు తమ నిశ్వాసములచే గదలుచున్న కలువపూలు గల్గినదియు, మనోహరమైనదియు, కామ రతి కుత్సాహము గల్పించునదియు, మదనీయము నగు నుత్తమ మద్యరసమును హర్షితలగు కామినులు రాత్రుల యందు దమ కాముకులతో గలసి త్రాగుచుందురు.'

(సుగంధి నిశ్వాస వికంపితోత్పలం
మనోహరం కామరతి ప్రబోధకం

నిశాసు హృష్టా స్సహ కామిభిః స్త్రియః
పిబంతి మద్యం మదనీయ ముత్తమం)

—కాళిదాసు.

ఆంజనేయుడు వానరుడయ్యు నా మధ్వాసవములను, పుష్పాసవములను గాంచియు నించుకయేని చంచల మనస్కుడు గాకుండుట యాతని మనోనిగ్రహమును నిరూపించుచుండును.

సామాన్యముగా మద్యములలోనున్న గుణమిదియే. తన్ను రుచి చూచువానికి వ్యసనము గల్పించి, వానిని దన బానిసగా నెనర్చుకొని తందనా లాడించుచుండును. కనుకనే బ్రహ్మచర్యము చతుర్వేదాధ్యయనతుల్య పుణ్యమనియు, మద్యపానము పంచమహాపాతక తుల్య పాపాశ్రయమనియు పండితులు పల్కుచుందురు.

(ఏకత శ్చతురో వేదాః బ్రహ్మచర్యం తథైకతః
ఏకత స్సర్వ పాపాని మద్య పానం తథైకతః).

ఈ సందర్భమునుబట్టి హనుమంతుని కాపాన దుర్వ్యసనము లేదని మన మూహింపవచ్చును.

ఇంతవఱకు నడచిన యీ యీ వర్ణనములనుబట్టి లంకావాసుల నాగరక తౌన్నత్యమును మనము కొంత యూహింపవచ్చును.

అచ్చటి ప్రధాన వీధులు తెల్లగ, నెత్తుగ నున్నవి.
(పాండురాభిః ప్రతోళీభి రుచ్చాభి రభిసంవృతామ్)

అనగా తెల్లని మట్టితోనో లేక మటియొక పదార్థము తోనో యెత్తుగా - రోడ్లు - నిర్మించుకొన్నారు.

పట్టన రక్షణ విషయమున వారి కున్న జాగరూకత యద్వితీయము. అందువలననే వా రనేకములగు దుర్గము లను నిర్మించుకొని యున్నారు.

వారుపయోగించు నాయుధము లనేక విధములు. ఫిరంగులు మున్నగు నాగ్నేయాయుధములును, యంత్రా గారములు నందున్నవి (యంత్రాగారస్తనీం).

ఆ పురమున నేడెనిమిది యంతస్తులతోనున్న యున్నత సౌధము లున్నవి (సప్త భౌమాష్ట భౌమైశ్చ).

ఆ రాజ్య మపరిమిత ధనవంతము. స్వర్ణాది లోహ ములకు, ముక్తాస్ఫటికాది రత్నములకు నందు లోపము లేదు. మయూర హంసాది పక్షులను వారు పోషించు చుందురు.

ఆ పుర రక్షకులు పరులనుండి బహుమానములు గ్రహించి స్వరాజ్యము నమ్మువారుగారు.

భవనములు (రాచయిండ్లు); రహస్యాగారములు, పద్మకములు (నలుగడల ద్వారములు గల పద్మాకార

గృహములు); స్వస్తికములు (దక్షిణ పశ్చిమోత్తరముల ద్వారములతో విశాల వనగతమగు చతురగృహములు); వర్ధమానములు (పూర్వోత్తర పశ్చిమములందలి ద్వార ములతో విశాల వనస్థములగు చతురాకారగృహములు); మున్నగు వివిధ గృహభేదములు నిర్మించుటయు, వానికి సున్నము పూయుటయు వారికి సుపరిచితములు.

(సితాభ్ర సదృశై శ్చిత్రైః పద్మ స్వస్తిక సంస్థితైః
వర్ధమాన గృహై శ్చాపి సర్వత స్సువిభూషితాః
వివిధాకృతి రూపాణి భవనాని తత స్తతః).

చిత్రములగు లతాగృహములు, చిత్రశాలా గృహ ములు, క్రీడాగృహములు, కామగృహములు, దివాగృహ ములు, ఱాలతో, దారువుతో గృహనిర్మాణ మొనర్చు టయు వారికి లెస్సగ దెలియును.

(లతాగృహాణి చిత్రాణి చిత్రశాలా గృహాణిచ
క్రీడా గృహాణి చాన్యాని దారు పర్వతకా న్యపి
కామస్య గృహకం రమ్యం దివాగృహక మేవచ).

రాజకుటుంబములోని వేఱువేఱు వ్యక్తులకు వేఱు వేఱు గృహములు నిర్మించుకొనురీతియు వారెఱుగుదురు.

(అథమేఘ ప్రకాశం కుంభకర్ణ నివేశనం
విభీషణస్య చ తథా పుష్పవే స మహాకపిః).

వీణలు, తంబురాలు మున్నగు తంత్రీ వాద్య విశేషము లతో (తంత్రీ స్వనాః కర్ణసుఖాః) మనోహరముగ వాయించుటయు, మంద్ర మధ్య తార స్వరములతో మధుర గీతములను గానము చేయుటయు నా దానవ మానినుల కభ్యాసము గలదు.

(శుశ్రావ మధురం గీతం త్రిస్థాన స్వరభూషితం
స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసా మివ)

స్త్రీలు చిన్నచిన్న గజ్జెలు కూర్చిన మొలనూళ్లు, కాలియందెలు మున్నగు కనకరత్నాభరణములను-పెక్కు-విధములగు వానినిధరించుచుందురు. నానావిధవేషములను దాల్చుచుందురు (నానావేష సమాయుక్తా) ; వారి మంచ ములు, పీటలు, చెంబులు, పళ్లెరములు మున్నగు పాత్ర ములు స్వర్ణ నిర్మితములు.

ఉత్తమములగు నల్లయగరును, చందన ప్రముఖము లగు సుగంధద్రవ్యములను వా రుపయోగించుచుందురు.

రాక్షసులలో యజ్ఞాది పవిత్రకార్య దీక్షాపరులును కొందఱున్నారు. యతులున్నారు, సన్న్యాసులున్నారు, చర్మవాసనులున్నారు.

(దీక్షితా జటిలా ముండా గోజినాంబర ధారిణః)

వారు దర్భల నుపయోగించువారు. హోమములు చేయువారు. వానితో నితరులను శిక్షించువారు.

(దర్భముష్టి ప్రహరణా నగ్నికుం డాయుధాం స్తదా)

వారు నిత్యార్చలను, పర్వహోమములను జేయుదురు.

(నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసై స్సదా)

వారిలోనిత్యము వేదాధ్యయనము చేయువారున్నారు; (స్వాధ్యాయ నిరతా:); మంత్రములను జపించుచుందురు (శుశ్రావ జపతాం తత్ర మంత్రా: రక్షోగృహేషు వై).

రథములు మున్నగు ననేక విధ యానసాధనములు వారికి గలవు. ఇవి యన్నియు సామాన్యములు.

ఇక నసామాన్యమగు పుష్పకవిమానము రావణుని యొద్ద నున్నది. కాని యదిమాత్రము తక్కినవానివలె లంకలో నిర్మితమైనదిగాదు.

'మీ రెన్నియైనజెప్పుడు. ఇప్పటివారు క్రొత్తగా కని పెట్టిన దేమియులేదు. ఇవి యన్నియు మన వేదముల లోనో, శాస్త్రములలోనో యుండనే యున్నవి. అంతియే గాని ప్రస్తుతము గనిపెట్టిన విజ్ఞానము లేనేలేదు.' అను సనాతనాభిమానులు కొందఱున్నారు. అట్లే మఱి కొందఱు నవనాగరకం మన్యులున్నారు. వారిట్లందురు.

'పూర్వము మన కున్న దెల్ల మూఢత్వమే. మీరు నూఱు చెప్పుడు, వేయి చెప్పుడు. పూర్వులందఱు వట్టియజ్ఞా నులు. పూర్వ మేదో విజ్ఞానమున్న దనుట కుదాహరణ ముగ కొన్ని శ్లోకములను మీరు చదువుచుందు రే. అవి యన్నియు కవుల భావ సృష్టము లేగాని విజ్ఞాన సృష్టములు గావు. పూర్వము విమానము లున్న వందురు. ఆ విమాన ములును కవుల భావరూపములే గాని వస్తురూపము లైంత మా త్రమునుగావు.' ఇది వీరి ధోరణి.

పై వారికి జెప్పుట యెంత కష్టమో, వీరికి జెప్పుట యంతకంటె కష్టము. కానిండు.

అట్టివారికొక నమస్కా-ర బాణమువైచి యావలికి సాగిపోవుట లెస్స.

ఆ విమానమంతరిక్షమున-వాయుపథమున నుండునట.

(దివం గతం వాయుపథ ప్రతిష్ఠితం)

అందు ప్రతి చిన్నభాగమును ప్రయత్నపూర్వకముగ నెనర్చినదే యట (నతత్ర కించి న్నకృతం ప్రయత్నతః); వాయువేగమున నది పరువిడుచుండునట (మారుత తుల్య గామినం); అందు చక్కని యాసనములు, చిన్న చిన్న శిఖరములును గలవట!

మనోహరమును, కామగమనమును నగు నావిమాన మున్న ప్రదేశమును జాగ్రత్తగ హనుమ పరిశీలించెను; కాని సీత మాత్రము గానరాలేదు.

ఈ సందర్భమునందలి రామాయణ వర్ణనములనుబట్టి రాక్షసుల నాగరకతౌన్నత్యము మఱికొంత మనకు గోచరింపగలదు. చూడుడు.

లంకావాసులు చిత్రకంబళములను (మహాత్యాకుథయాస్తీర్ణాం); నానావర్ణ వస్త్రములను (నానావర్ణాంబర స్రజం); ఉపయోగించుచు నానా వేషములను (నానా వేష విభూషితం) ధరియించువారు.

ఆ దానవ స్త్రీలు తమ నెన్నుదుట దిలకములను (వ్యావృత్త తిలకాః); కరముల గాజులను (పారిహార్య విభూషితాక) ధరించువారు. పయ్యెదలతోవారు (అంశుకాంతాశ్చ) వస్త్రధారణ మొనర్చువారు.

వారిలో పతివ్రతలు గలరు (పరమయోషితః); భర్తృసేవా పరాయణులు కానివారును (నానుపచారయుక్తా), దుర్బలలును (న చహీన సత్వా), భర్త కిష్టము గాని కాంతలును (న చాపి కాంతస్య నకామనీయా) సామాన్యముగ గానరారు.

వారు చెవులకమ్మలు (శుభై ర్లలిత కుండలైః); బంగరు కంఠసూత్రములు (హేమసూత్రాణి); కంఠమాలలు (అమ్లాన మాల్యాభరణాః.) భుజకీర్తులు; (హారనూపుర కేయూరైః.) కూర్చుకొన్న పూలమాలలు (అన్యోన్య మాలాగ్రథితం) మున్నగు భూషణములతో తమ దేహములు నలంకరించుకొనువారు. వారిలో చామనచాయ వారు, తెలుపు రంగుగలవారు, కృష్ణవర్ణముగలవారు, కాంచనచ్ఛాయాంగులు గలరు.

(శ్యామావదాతా స్తత్రాన్యాః కాశ్చిత్కృష్ణా వరాంగనాః
కాశ్చిత్కాంచన వర్ణాంగ్యాః ప్రమదా రాక్షసాలయే)

రాక్షస రాజునకు శ్వేతచ్ఛత్రము (దదర్శ పాండురచ్ఛత్రం); చమరీవాల కృతములగు వింజామరములు (వాలవ్యజన హస్తాభి ర్వీజ్యమానం సమంతతః).

అంగదములు (కాంచనాంగద నద్ధాచ.); కిరీటము (ముక్తా మణి విచిత్రేణ కాంచనేన విరాజితం.) గలవు. దంతనిర్మిత వస్తువులు (దాంత కాంచన చిత్రాంగైః.); రక్తచందన లేపములు (రక్తచందన దిగ్ధేన.); ధూపములు (వరధూపేన ధూపితం); ఉత్తరీయములు (పీతే నోత్తమ వాససా.); కుండలములు (చారుకుండల భూషితాః.); స్నాన సమయములు నుపయోగించు చందనములు, ధూపములు

(స్నానానాం చందనానాంచ ధూపానాం చైవ మూర్ఛితః)
మొదలగు వస్తుజాతములు దానవులు వాడుచున్నట్లు మనము నిశ్చయింపవచ్చును.

వారు పటహ పణవ డిండి మాతోద్య మురజ వేణు విపంచి మృదంగాది వాద్య విశేషములు మనోహరముగ వాయింపగలరు. ఈ నేర్పు స్త్రీలకును గల్గియుండుట విశేషము.

ఇంకను వారు నృత్తాది లలిత కళలలో కుశలులు
(నృత్తవాదిత్ర కుశలాః).

ఇక వారి పానీయ మద్యరసములు పెక్కు-విధములు. సురలు, కృత్రిమసురలు, శర్క-రాసవములు, మాధ్వీకములు (ఇప్పపూలకల్లు) పుష్పాసవములు, ఫలాసవములు,

(దివ్యాః ప్రసన్నా వివిధా స్సురాః కృతసురా అపి
శర్క-రాసవ మాధ్వీక పుష్పాసవ ఫలాసవాః)

శీధువులు (చెఱుకురసమునజేసిన కల్లు); మధురసములు (శీధో ర్మధు రసస్యచ) మున్నగునవి.

ఈ సందర్భములయం దెచ్చటను రావణునికి దశకంఠములుగానీ, దశ శిరస్సులుగానీ, వింశతి బాహువులుగానీ యున్నట్లు హనుమానుడు చూడలేదు, వాల్మీకియు వచియింపలేదు. కావున రావణుని కీ విశేషణము లాతని

స్వభావాదుల ననుసరించి తరువాత గవులు కల్పించినదే యగును.

పై విషయములను గమనించినచో లంకావాసులు రాజ్యనిర్వహణమునగానీ, సాంఘికమునగానీ, ఆర్థికమున గానీ, కళాక్షేత్రమునగానీ కడుసమర్థులనియు, నాగరకత యందును, సభ్యతయందును వారు నాణెముదెలిసిన వారనియు మనము నిశ్చయింపవచ్చును. కాగా వారు రాక్షసు లనబడుటకు బ్రధాన కారణ మొక్క యైహిక భోగలాలసతయే కానబడుచున్నది.

వా రెంత సంపన్నులయ్యు, నితర విషయముల నెంత నిపుణులయ్యు నాముష్మిక విషయమున వా రధోగతి యంద యున్నారు. ఇదియే వారి రాక్షసత్వ మని మన మూహింపవచ్చును.

ఇట్లు హనుమంతుడు రావణుని శయ్యామందిరము, పాకాలయము, పానశాల, విమాన గృహము మున్నగు వాని నెల్ల బరిశీలించెను. అయిన నందెందును జానకి గానరాలేదు గాని సభ్యదూరము లగు దృశ్యములు పెక్కులు గానవచ్చినవి.

బ్రహ్మచారియగు హనుమంతుడు ప్రమదామణులను-
అందున నేకాంతమున నందున్న వారిని గాంచినందులకు,

తనకు గల్గిన ధర్మలోపమునకు తన మానసమున నతడు చాల జింతించెను.

(ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి).

తన పవిత్ర వ్రతమునకు భంగము గల్గునని భయపడెను. కాని యెన్ని దృశ్యములను గాంచినను నాతని మాన సము మాత్రము నిర్వికారముగనే యుండెను.

(న హి మే మనసః కించిత్ వైక్లవ్య ముపపద్యతే).

వికార హేతువు లెన్ని యున్నను మనశ్చాంచల్యము గల్గని వారేగదా ధీరులు!

(వి కారహేతౌ సతి విక్రయంతే
యేషాం న చేతాంసి త ఏవ ధీరాః)

—కాళిదాసు.

'ప్రాణాంతమునందును నుత్తముల స్వభావము వికా రము నొందదు.'

(న ప్రాణాంతే ప్రకృతి వికృతిర్జాయతే నోత్తమానాం)

హనుమంతు డిట్లాత్మపరీక్ష చేసికొని తన మనస్సు నిష్కలంకముగనే యున్నదిగదా! యని సంతృప్తి నందెను. అదియే ధర్మాత్మల స్వభావము. తన్నితరులు వీక్షించినారనియో, వీక్షింపలేదనియో కాక తన మన స్సున లోప మున్నదా? లేదా? యనియే ధర్మాత్మ

లాలోచించుచుందురు. గాంధి మహాత్ముడీ ధర్మమునే ప్రబోధించెను. కాని, భారతమున నేడా మార్గము నాదరించుచున్న వా రెంతమంది గలరు?

ఆంజనేయు డచ్చటినుండి వెడలి యన్యప్రదేశములు పరికించెను. కాని యాతని ప్రయత్నమంతయు వ్యర్థమే యయ్యెను. కనుక నతని యుత్సాహ మొకింత యడగిపోయెను. అతని మానసమున ననేక విధాలోచనలు గలుగ దొడగెను.

'సీత తన ప్రాణములు వీడియుండుట నిశ్చయమై యుండును. కావుననే నాకింతవఱకు నామెగంటబడ లేదు;'

(ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే
విచిన్వతో దర్శనమేతి మైథిలీ)

లేక యీ రాక్షసాధిపతి తనకు లోబడని యీ మహా పతివ్రతను హత్యచేయునర్చి యుండును. కాదా! వికార వేషములు, భయంకరాకారములుగల యీ దానవ స్త్రీలను జూచి, భయముచే నడలి యీమె ప్రాణములు వీడియుండవచ్చును. ఐన నిప్పుడు నేనేమి చేయవలయును? సీతాదేవిగానరాలేదని యీరాక మరలిపోవుటయేనా? చీ! ఏమైననుసరే! రాముడును, సుగ్రీవుడును నాతలపైబెట్టిన కార్యమును నిర్వహింపక తప్పదు. నేను గడువుమీఱి

సుగ్రీవుని చెరితకుఁబోయిన నాతడు తప్పక నన్ను దండిం చును. అతని ప్రతిజ్ఞయు నట్టిదియేగదా!

నే నూరక మరలి వెళ్లినచో వానరు లేమందురు? 'నీవేమి చేసితి'?వని వారడిగినచో నే నేమి పలుకగలను? వెళ్లి వారందఱలో నెట్లు మొగమెత్తుకొని మెలగుదును? నన్ను బెద్దగ బ్రశంసించి యిచ్చటికిబంపిన జాంబవంతుడు నన్నేమనునో ! అంగదుడు నన్నాఁడిసేయక యూరకుం డునా? ఊరక వ్యర్థుడనై మరలివెళ్లుట బేలతనము. అంతియకాదు: నేను సీతను జూడక కిష్కింధ కేగి నచో సీతా విషయము దెలియజాలని దుఃఖావేగముతో రాముడు మరణింపవచ్చును. ఆతని ననుగమించి భ్రాతృ ప్రాణుడగు లక్ష్మణుడును మరణించును. వారి ననుస రించి సుగ్రీవుడును మరణించును. వీరియంద ప్రాణములు నిల్పుకొనియున్న మఱియొందఱో వీరి ననుసరింతురు.

మఱియు నే నాలసించినచో వానరులు ప్రాయోప వేశముచేసి ప్రాణములు విడువవచ్చును. ఇంకేమి జరు గునో తెలియదు.

చీ! ఇట్టి నిర్వేదము కార్యనాశకము. దీనిని చెంతకు జేటునీయరాదు. 'ఉత్సాహము సంపన్నాలము. ఉత్సా

హాము పరమ సుఖము. కావున నుత్సాహ పూర్వకముగ నుత్తమ ప్రయత్నము నెనర్తును.'

(అనిర్వేద శ్రీయో మూల మనిర్వేదః పరం సుఖం
తస్మా దనిర్వేద కృతం యత్నం చేష్టేహ ముత్తమం)

అని నిశ్చయించి మరల నెల్లప్రదేశము లన్వేషింప బూనెను. పర్వతములు, నదులు, పల్వలములు, తటాక ములు, వనములు, దుర్గములు పరిశీలించెను.

ఏమిది! సీతాదేవి రావణ మందిరములో నున్నదని సంపాతి వచియించి యుండెనే! ఉన్నచో నామె గానరా దేమి? ఒకవేళ రావణుడు సత్వరముగ లంకకు గొని వచ్చునప్పుడు రథమునుండి జాఱి, భూమిపై బడి యుండు నేమో! లేక యాకాశమున వచ్చునపు డడలుపాటున నంబుధిలో బడియుండునా? లేక రాక్షస కాంత లీర్ష్యా వశలై యామెను భక్షించి యుందురా? లేక రామ వియోగము సోర్వలేక యా రామామణి మరణించి యుండునా! ఏమో! ఏమి జరిగినదో!

ఈ విషయము రామునకు జెప్పుటయా? మానుటయా? చెప్పుట యెట్లు? చెప్పకపోవుట యెట్లు?

లేక సీతను రావణు డెచ్చటనేని రహస్యముగ దాచి యుండునా? ఏమైనను గానిమ్ము. నేను కిష్కింధా

పట్టనమునకు బోవను. శైలాగ్రమునుండి క్రిందికి దొరలి యేని, బగబగ మండుచున్న యగ్నిలోబడియేని, సముద్ర జలములలో మునిగియేని ప్రాణములు పరిత్యజింతునుగాక! 'జానకీదేవిని గాంచక సుగ్రీవుని గాంచబోను.'

(న చ శక్ష్యా మ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా)

చీ! నే నాత్మహత్య యొనర్చుకొన్నందువలన నయ్యెడి దేమి? 'ప్రాణత్యాగమువలన బహు దోషములుగల్గును. ప్రాణములున్నచో భద్రములు గల్గకపోవు.'

(వినాశే బహవోదోషా జీవన్ భద్రాణి పశ్యతి)

'నే నిచ్చటన యున్నచో సీతా క్షేమము ముందైన దెలియునను నాసతో ధర్మాత్మలగు దాశరథులు ప్రాణములతో బ్రదికియుందురు; వానర సమూహమునకు గూడ నపాయము దప్పును;'

(మ య్యాగచ్ఛతి చేహస్థే ధర్మాత్మానౌ మహారథా ఆశయా తౌ ధరిష్యే తే వానరాశ్చ మనస్వినః)

నే నిచ్చటనయుండి సీతమాట నటుంచి ముందు బలవంతుడగు రావణుని వధియింతును; లేదా! 'పశుపతి పశువును బట్టుకొని పోయి నట్లీతని బట్టి సముద్రముల మీదుగా రాముని చెంతకు లాగుకొని పోయెదను.'

(రామా మోపహరిష్యామి పశుం పశుపతే రివ)

'అయినను సీతకొఱకు మఱియు గవేషింతునుగాక!'

అని రాముని ధ్యానించి యశోకవన ప్రాంతమున కరిగెను.

'ఆఁ! ఇదిగో! యిది యశోకవనము. నేను దీనిని వెద
కనే లేదుగదా! కనుక నిపు డేగి దీనిని నన్వేషింతును.
ఆహా! 'ఉన్నతనాసికయు, దెల్లని పల్వరుసయు, నిర్మలహాస
మును, తమ్మిఱేకులవంటి కన్నులును గలిగిన ప్రసన్న
చంద్రునివంటి సీతావదనము నెప్పుడు గాంతునో గదా!'

(త దున్నసం పాండురదంత మవ్రణం
శుచి స్మితం పద్మపలాశ లోచనం
ద్రక్ష్యే తదార్యా వదనం కదా న్వహం
ప్రసన్న తారాధిప తుల్య దర్శనం)

'క్షుద్రుడును, పాపాత్ముడును, మహాదారుణ మండ
నుడును నగు నీ రావణుడు బలవంతముగ గొనితెచ్చిన
తపస్వినియగు నా సీత నెట్లు గాంతునోగదా!'

(క్షుద్రేణ పాపేన నృశంస కర్మణా
సు దారు ణాలంకృత వేషధారిణా
బలాభిభూతా హ్యబలా తపస్వినీ
కథం ను మే దృష్టిపథేఽద్య సా భవేత్)

ఇచ్చట వాల్మీకి ప్రయోగించిన 'కదాను, కథంను,' మున్నగు ప్రయోగములతోడి కవితారీతి యనంతర మహాకవులకు బెక్కుర కనుకరణీయమైనది. ఈ యను కృత పద్యములు 'కదా' పదాది పద్యములతో బ్రసిద్ధి కెక్కియున్నవి. చూడుడు.

'కావేరీతీరమున-శ్రీరంగ క్షేత్రమున శేషశయనుడు, ఇంద్రనీలమణి శ్యాముడు నగు శ్రీ మహావిష్ణువును ఓ మురారీ! గోవింద! యని యాక్రోశించుచు దినములనెప్పుడు గడపుదునోగదా!'

(కదాఽహం కావేరీ తట పరిసరే రంగనగరే
శయానం భోగీంద్రే శతమఖ మణి శ్యామలరుచిం
ఉపాసీనఃక్రోశ మధుమథన నారాయణ హరే
మురారే గోవిందే త్యనిశమివ నేష్యామి దివసాఽ)

:వినయసూక్తి; పరాశరభట్టరు

'త్రివిక్రమ! శంఖచక్ర కల్పకధ్వజ పద్మ వజ్రాంకుశ లాంఛితమగు నీచరణాంబుజ ద్వంద్వమును నామూర్ధమున నెప్పు డలంకరించుకొందునోగదా!'

(కదా పునఃశంఖ రథాంగ కల్పక ।
ధ్వజారవిం దాంకుశ వజ్రలాంఛనం

త్రివిక్రమ త్వచ్చరణాంబుజ ద్వయం
మదీయ మూర్ధాన మలంకరిష్యతి)
—స్తోత్రరత్నము; యామునాచార్యుడు

'మనోహర శయ్యామందిరమున పరిమళవంతమగు పూసెజ్జపై బరుండియున్న నవయువతీ రత్నమును గౌగిలించుకొని యో చంద్రానన! నన్ననుగ్రహింపు మని ప్రార్థించుచు దివసములను నిమేషములవలె నెప్పుడు పుత్తునో!'

(కదా కాంతాగారే పరిమళమిళత్పుష్ప శయనే
శయానా శ్యామాయాః స్తనతటయుగం వక్షసి వహన్
అయి అయి స్నిగ్ధే ముగ్ధే చతురనయనే చంద్రవదనే
ప్రసీ దేతి క్రోశ న్నిమిషమివ నేష్యామి దివసాన్)

ఇది కేవల కామునికుక్తి. అయినను పై కవిత్వపద్ధతి నీ పద్యము దెల్పుచునే యున్నది. నిరాశాహతుడై నిర్వేదము పాలయిన హనుమానుడునున్నట్లే తనకార్యసిద్ధి గోరి సీత నెప్పుడు చూతునా! యని తహతహ లాడెను.

హనుమదాక్యములలోని యీ సీతా వర్ణన మతడు శ్రీరాముని వలన విన్నదియే. ఆ వర్ణనమే యాతని మానసమున హత్తుకొని యాతని కన్నుల యెదుట గాన వచ్చుచున్నది. మానసిక చిత్రణము భౌతిక చిత్రమునకు మార్గము జూపుట సహజమేగదా!

హనుమంతుడు స్థితప్రజ్ఞుడగు దూత. నిజాభిమానమును దూరముగనుంచి, నిష్పాక్షికముగ విషయముల మేలుగీడుల నిర్ణయించువాడు. రావణునిగూర్చిన వాని వచనములు చూడుడు.

'ఆ రావణునిచెంతనున్న స్త్రీలలో నొక్కతనుగూడ వీర్యవంతుడగు రావణుడు బలాత్కారమున దెచ్చి యుండలేదు. వా రెల్లరు రావణగుణములకు లోభించి వచ్చినవారే. అన్యపురుషు నపేక్షించిన యంగన వారి యం దొక్కతయు లేదు. అచ్చట నొక్క జానకిదక్క నన్యని యిల్లాలుగూడ నొక్కె తెయు లేదు.'

(న తత్ర కాచిత్ ప్రమదా ప్రసహ్య
వీర్యోపపన్నేన గుణేన లబ్ధా
న చాన్య కామాపి నచాన్య పూర్వా
వినా వరార్హాం జనకాత్మజాం తాం)

'అల్పజాతి సుందరిగానీ, యనాకారగానీ, యమాయకురాలుగానీ, పతిసేవలో ప్రమత్తపడునదిగానీ, బలహీనురాలుగానీ, భర్తనాకర్షింపలేనిదిగానీ యం దొక్కతయు గానరాదు.'

(న చాకులీనా నచహీన రూపా
నా దక్షిణా నానుపచారయుక్తా

భార్యా భవ త్తస్య న హీన సత్వా
న చాపి కాంతస్య న కామనీయా)

'ఈ కాంతలును, నీరాకుసుతును సుఖించున్లే సీతయు, రాముడును సుఖము లనుభవించుట యుచిత'మని యతడు తలచి యుండెను. ఔచిత్యమును, ధర్మమును నిదియే గదా! సజ్జనుల భావము లిట్లెగదా యుండును!

'సీతను ఆమె మనోహరుడగు శ్రీరాముని చెంగట నుండనిచ్చినచో రావణుడు శిష్టాత్ముడయ్యెడువాడేగదా!'

ఆంజనేయుడు సాధుబుద్ధి. సాధువనగా దన శత్రువు లకుగూడ హితమునే వాంఛించువాడు. కనుకనే యాతడు రావణ హితము నభిలషించియే యాతని శయ్యాగార మును నీక్షించునప్పు డా రీతిగా భావించియుండెను.

రావణుడెంత మహారాజైనను, సకల సంపత్సమేతు డైనను సీతాపహరణ నీచకృత్యమునకు బాల్పడి చెప్ప రాని సిగ్గులకు లోనుగావలసి వచ్చెను. కనుకనే యాంజ నేయు డిట్లు తలపోసెను. 'గుణములలో రామునికంటె సీత మిన్న యనుట నిశ్చయము.'

(ధ్రువం విశిష్టా గుణతోఽపి సీతా)

కావుననే వాల్మీకియు 'సీతాచరిత్రము మహత్తరము'

(సీతాయా శ్చరితం మహత్) అని ఘంటాపథముగ వచియించి యుండెను.

హనుమంతుడిట్టి సుకృతాత్ముడు గావుననే 'దృష్టా సీతా' యని కంఠమెత్తి వక్కాణింపగల్గెను. ఈ వాక్యమునే వాల్మీకి 'మహార్థమగు వచనము'(వచనం మహార్థం) అని ప్రమాణీకరించెను.

అశోకవనము

నిరహంకారమును, సత్త్వ సంపన్నము నగు ప్రార్థనా బుద్ధి సకల ఫలములను సమకూర్చును. హనుమంతుడు తన నిరుత్సాహమును నెట్టివైచి, యాత్మసమర్పితభావము నాదరించి, భక్తివిశ్వాస తాత్పర్యములను పట్టుగొమ్మగా నెనర్చుకొని సంకల్పసిద్ధిని బడసిన సమర్థుడు.

ఆ హనుమాను డప్పు డశోకవన ప్రాకారముదాటి యా వనమున మెల్లగ ప్రవేశించెను.

ఆ వనమున నప్పు డప్పుడ ప్రవేశించిన వసంతలక్షణము లగపడ దొడగెను. అందశోక చందన సాల రసాలాది వృక్షము లనేకములుగలవు. వివిధములగు ననేక వర్ణ పుష్పముల వృక్షము లనేకములు దానిలో కలకలలాడు చుండెను. అది కోకిల భృంగరాజ మయూరాది ద్విజ

మృగ సమాకులము. వాయువశమున రాలిన నానావిధ పుష్పావృత దేహుడయి యా హనుమంతు డం దప్పుడు విరులచే గప్పబడిన గిరివలె మెఱయుచుండెను. 'ఆ వన మున పారిజాతాలంకృతములగు దీర్ఘికలు, అమృతోపమ తోయములగు కాలువలు నలరారుచుండెను.'

(దీర్ఘాభి ర్ద్రిమయుక్తాభి స్సరిద్భిశ్చ సమంతతః
అమృతోపమ తోయాభి శ్నివాభి రుపసంస్కృతాః)

మఱియు నా వనమున దీర్ఘశిఖరమును, విచిత్ర కూటములును, శిలాగృహములును గల యొక పర్వతము గలదు.'ఆపర్వత ప్రదేశమునుండి ప్రియు నంక తలమునుండి కోపవశయై పరువెత్తి పోవుచున్న కుపితయగు ప్రేయసి వలె నొకా నొక నదీ ప్రవాహము జాలువాఱుచుండెను.'

(దదర్శచ నగా త్తస్మా న్నదీం నిపతితాం కపిః
అంకా దివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియాం)

'తీర ప్రాంతముల నున్న పాదపములొఱిగి, వాని కొన లా ప్రవాహమునబడగా, నా కుపితను బ్రతిమాలి యడ్డ గించుచున్న బంధువులవలె నవి ప్రకాశించుచున్నవి.'

(జలే నిపతితాగ్రైశ్చ పాదపై రుపశోభితాం
వార్యమాణా మివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబంధుభిః)

'అంతట ప్రసన్నురాలై భర్త నాదరించుచున్న యా ప్రియురాలివలె పైనుండి వచ్చుచున్న యా నది ప్రవాహ జలముతో నప్పుడు ముచ్చట గొల్పుచుండెను.'

(పునరావృత్తతోయాంచ దదర్శ స మహాకపిః
ప్రసన్నా మివ కాంతస్య కాంతాం పున రుపస్థితాం)

ఆ వన సౌందర్యమునుగాంచి యాత డాశ్చర్యపడి యిట్లు తలచెను. 'ప్రకృతి ప్రియురాలగు జానకీదేవి నివసించుట కిది యెంతయు యోగ్యమైనది. లంకలో నున్నచో నామె యిండే యుండును. అంతియకాదు; ఈ నదీతీరమునకు సంధ్యావందన మొనర్చుకొనుటకు నామె రాక యుండదు.'

(సంధ్యాకాల మనా శ్యామా ధ్రువ మేష్యతి జానకీ
నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ)

'పూర్ణచంద్రనిభానన యగు సీత జీవించియే యున్నచో శుభోదకములు గల యీ నది కవశ్యము వచ్చును.'

(యది జీవతి సా దేవీ తారాధిప నిభాననా
ఆగమిష్యతి సాఽవశ్య మిమాం శివజలాం నదీమ్)

ఇట్లు తలపోయుచు దలపోయుచు జెంతనున్న యొక మహోన్నత శింశుపా వృక్షమునెక్కి, పరిసరముల బరికించి యచ్చట నొక మనోహర వనభూమిని జూచెను.

'అది కల్పక లతా వృక్ష సముదాయముచే పొల్పు మీఱుచున్నది, దివ్యగంధ రసోపేతమై తేజరిల్లుచున్నది;'

(సంతానక లతాభిశ్చ పాదపై రుపశోభితాం)

(దివ్యగంధ రసోపేతాం సర్వత స్సమలంకృతాం)

'అది నందన వన సంకాశము, మృగ పక్షి సమావృతము, హర్మ్యప్రాసాద సంబంధము, కోకిలాకుల నిస్స్వనము;

(తాం సనందన సంకాశాం మృగ పక్షిభి రావృతాం

హర్మ్య ప్రాసాద సంబంధాం కోకిలాకుల నిస్స్వనాం)

'మఱియు కాంచనోత్పల పద్మములు గల వాపీ సమూహోపశోభితము;

(కాంచనోత్పల పద్మాభి ర్వాపీభి రుపశోభితాం)

'అది సర్వర్తు కుసుమములచే రమ్యమైనది; ఫలవంతములగు పాదపములచే బ్రకాశించుచున్నది; మఱియు నది పుష్పి తాశోక లక్ష్మిచే సూర్యోదయ ప్రభావంత మైనది;

(సర్వర్తు కుసుమై రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః

పుష్పితానా మశోకానాం శ్రియా సూర్యోదయప్రభాం)

'పక్షులు నివసించుటచే నా యశోక వృక్షముల పత్రములు వ్రాలి యూ పుష్పర క్తిమచే నా వనము మండుచున్నట్లు గాననగుచున్నది;'

(ప్రదీప్తా మివ తత్రస్థో మారుతి స్సముదైక్షత
నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణా మి వాసకృత్)

'అది యనేకములుగ రాలుచున్న చిత్రములగు పుష్పా
వతంసములు గల్గినట్టిది, మూలము లంటబూచిన శోక
నాశకములగు పుష్పభారములచే నేల నంటునట్టి యశోక
వృక్షములచే నలంకృతమైనది;'

(వినిష్పతద్భి శ్శతశ శ్చిత్రైః పుష్పావతంసకైః
ఆమూల పుష్పనిచితై రశోకై శ్శోకనాశనైః
పుష్పభారాతి భారైశ్చ స్పృశద్భి రివ మేదినీం)

'కుసుమిత కర్ణికారములు, సుపుష్పిత కింశుకములు,
పున్నాగములు, చంపకములచే నది ప్రకాశించుచున్నది;

'మిక్కిలి లావైన మొదళ్లు గలిగిన సుపుష్పితములగు
నశోక వృక్షములు పెక్కు లందు శోభించుచున్నవి;'

(వివృద్ధ మూలా బహవ శ్శోభంతేస్మ సుపుష్పితాః)

బంగరు రంగుగలవి, అగ్నిశిఖలవంటివి, నల్లనికాటుక
వంటివియు నగు వేలకొలది యశోకవృక్షము లందున్నవి;

(శాత కుంభ నిభాః కేచిత్ కేచి దగ్నిశిఖోపమాః
నీలాంజన నిభాః కేచిత్ తత్రాశోకా స్సహస్రశః)

అశోక వృక్షముల ప్రవాళము లా వృక్షమూలముల నుండియు నుందునట ! చూడుడు.

'మూలము మొదలుకొని ప్రవాళరాగము గల్గిన పుష్పచయమును జూచుచున్న పల్లవోపేతములగు నశోక వృక్షములు నవయౌవనుల హృదయములందు శోకము రేకెత్తించుచున్నవి.'

(ఆమూలతో విద్రుమ రాగ తామ్రం
సపల్లవాః పుష్పచయం దధానాః
కుర్వం త్యశోకా హృదయం స శోకం
నిరీక్ష్యమాణా నవయౌవనానాం)

—కాళిదాసు

వసంతకాలము తొంగిచూచు నా కాలమున కర్ణికార (కొండగోగులు) కింశుక (మోదుగు) పుష్పములుగూడ యువజన హృదయ విదారణ మొనర్చుచుండునట.

'రమణీయ ముఖముల యందుంచిన యువజన మాన సమును చిలుక ముక్కువంటి కింశుకములు చీల్పలేవనియా? కర్ణికార కుసుమములు కాల్పలేవనియా యేమి ? యా కోకిల మధుర వచనములతో బాధించుచున్నది.'

(కిం కింశుకైః శుకముఖచ్ఛవిభి ర్న భిన్నం
కిం కర్ణికార కుసుమై ర్న కృతం ను దగ్ధం

యత్రోత్కకిలాః పునరయం మధుశ్రై ర్వచోభిః
యూనాం మనాః సువదనా నిహితం నిహన్తి)

—కాళిదాసు

'ఆ వనము వివిధోద్యానవంతమగు నందనమువలె, చిత్ర మగు కుబేర చైత్రరథమువలె, నచింత్యము, దివ్యము, రమ్యము, శ్రీమంతము నైనది; పుష్పము లనెడు జ్యోతిర్గణముతో నిండిన రెండవ యాకాశమువలె, పుష్పములను రత్నశతములచే జిత్రమయిన యైదవ సాగరమువలె నున్నది; సర్వర్తువులయందు పుష్పభరితములయి మధు గంధిలములగు పాదప ప్రకరములతో, మృగద్విజగణ ముల నానా నినాదములతో రమ్యమైనది; మనోరమ మగు పుణ్య గంధముగల రెండవ గంధమాదనపర్వతము వలె నలరారుచున్నది;

(నందనం వివిధోద్యానం చిత్రం చైత్రరథం యథా
అతివృత్త మివాచింత్యం దివ్యం రమ్యం శ్రియావృతం
ద్వితీయ మివ చాకాశం పుష్పజ్యోతిర్గణాయుతం
పుష్పరత్న శతైశ్చిత్రం పంచమం సాగరం యథా
సర్వర్తు పుష్పై ర్నిచితం పాదపై ర్మధుగంధిభిః
నానానినాదై రుద్యానం రమ్యం మృగగణైః ద్విజైః

అనేక గంధ ప్రదహం పుణ్యగంధం మనోరమం
కైలేంద్ర మివ గంధాఢ్యం ద్వితీయం గంధమాదనం)

అట్టి యావన మధ్యమున - తన కనతి దూరమున - సహస్రస్తంభములుగల్గి, కైలాస పాండురమయి, ప్రవాళ సోపానములును, కాంచన వేదికలును గల్గి యాకసము నెఱయుచు, తన కాంతిచే నేత్రముల నపహరించుచున్న యొక యున్నత చైత్య ప్రాసాదమున్నది;

(అశోకవనికాయాంతు తస్యాం వానర పుంగవః
స దద ర్శావిదూరస్థం చైత్య ప్రాసాద ముచ్ఛ్రితం
మధ్యేస్తంభ సహస్రేణ స్థితం కైలాస పాండురం
ప్రవాళ కృతసోపానం తప్త కాంచన వేదికం
ముష్ణంత మివ చక్షూంషి ద్యోతమానమివ శ్రియా
విమలం ప్రాంశుభావత్వా దుల్లిఖంత మివాంబరం)

అచ్చట నొకానొక స్త్రీ యాతని కంటబడెను. ఆమె మాసిన చీర గట్టియున్నది; చుట్టును రాకాసు లామెను జుట్టుకొని యున్నారు;

(తతో మలిన సంవీతాం రాక్షసీభి స్సమావృతాం)

ఆమె యుపవాసములచే కృశించియున్నది; మటియు నామె దీనురాలు, మాటిమాటికి నిశ్శ్వసించుచున్నది; ఆమె శుక్ల ప్రతిప చ్చంద్ర రేఖవలె నిర్మలమైనది.

(ఉపవాస కృశాం దీనాం నిశ్శ్వాసంతీం పునఃపునః
దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖా మి వామలాం)

ఆమె నిదానముగ జూచి పోల్పదగిన రూపముతో రుచిర కాంతిగలది; దట్టమగు ధూమముచే గప్పబడిన యగ్ని శిఖవలె నున్నది;

(మంద ప్రఖ్యాయ మానేన రూపేణ రుచిర ప్రభాం
పినద్ధాం ధూమజాలేన.శిఖా మివ విభావసోః)

పసుపువన్నె యొంటి స్రాజీర కక్ష్యర్తిచే ధరించి యున్నది; అలంకారహీనమై, పంకాన్విత పద్మాకరమువలెనున్నది;

(పీతే నైకేన సంవీతాం క్లిష్టేనోత్తమ వాససా
సపంకా మనలంకారాం విపద్మా మివ పద్మినీం)

ఆమె లజ్జావతి, దుఃఖసంతప్తురాలు, పరిమ్లాన, తపస్విని, అంగారక గ్రహముచే పీడింపబడిన రోహిణివలె నామె యున్నది;

(వ్రీళితాం దుఃఖ సంతప్తాం పరిమ్లానాం తపస్వినీం
గ్రహే ణాంగారకేణేవ పీడితామివ రోహిణీం)

ఆమె కన్నులవెంట నీరుగాఱుచున్నది; ఆహార స్వీకారము లేమిచే జిక్కి శల్యమైనది; శోక ధ్యానపరయై నిరంతర దుఃఖపరాయణయై యున్నది;

అశ్రుపూర్ణ ముఖీం దీనాం కృశాం మనశనేనచ
శోకధ్యాన పరాం దీనాం నిత్యం దుఃఖపరాయణాం)

తన ప్రియజనమును గాంచక రాక్షసీ బృందమును గాంచుచు నామె తన సంఘముతో జేరక వేటకుక్కలచే గ్రమ్మబడిన హరిణమువలె నలమటించుచున్నది.

(ప్రియం జన మపశ్యంతీం పశ్యంతీం రాక్షసీ గణం
స్వగణేన మృగీం హీనాం శ్వగణాభి వృతా మివ)

జఘనతలమున ప్రేలుచున్న కృష్ణసర్పమువంటి యేక వేణితో, సుఖానుభవ యోగ్యయయ్యు, వ్యసనముల నెఱుగనిదయ్యు దుఃఖసంతప్తయై యున్నదామె;

(నీల నా గాభయా వేణ్యా జఘనం గత యైకయా
సుఖార్హాం దుఃఖ సంతప్తాం వ్యసనానా మకోవిదాం)

విశాల నేత్రములు, మిక్కిలి మలినమై కృశించిన దేహమును గల యామెను జూచి యామె సీతయై యుండునని హనుమాను డూహించెను.

(తాం సమీక్ష్య విశాలాక్షీ మధికం మలినాం కృశాం
తర్కయామాస సీ తేతి కారణై రుపపాదిభిః)

మఱియు నామె సందిగ్ధమైన స్మృతివలె, నడగిపోయిన సమృద్ధివలె, మొక్కవోయిన శ్రద్ధవలె, ప్రతిహతమగు నాశవలె నున్నది;

(తాం స్మృతీమివ సందిగ్ధా మృద్ధిం నిపతితామివ
విహతా మివచ శ్రద్ధా మాశాం ప్రతిహతామివ)

ఇంకను విఘ్నములు గల్గిన సిద్ధివలె, కలుషమైన బుద్ధి వలె నున్నది.

(సోప వర్గాం యథాసిద్ధిం బుద్ధిం సకలుషా మివ
అభూతే నాపవాదేన కీర్తిం నిపతి తామివ)

తమకు లభించిన వస్త్ర ఖండాభరణములతో నీమె దాల్చిన వస్త్రాభరణాదుల కున్న సంబంధము సూహించియు, రామలక్ష్మణుల వలన నాలకించిన సీతా సౌందర్యము నీమె సౌందర్యముతో బోల్చియు, నీమె సీతాదేవియే యని హనుమ భావించెను.

(వైదేహ్యా యానిచాంగేషు తదా రామో న్యకీర్తయత్
తాన్యాభరణ జాలాని శాఖా శోభీ న్యలక్షయత్)

ఏ కాంతనుగూర్చి రాముడు కారుణ్యము చేతను, ఆనృశంస్యముచేతను, శోకముచేతను, మదనుని చేతను పరితపించుచున్నాడో యా కాంత యీమయ.

(అయం సా యత్కృతే రామ శ్చతుర్భిః పరితప్యతే
కారుణ్యే నానృశంస్యేన శోకేన మదనేనచ)

స్త్రీ యపహృతయైనదే! యను కారుణ్యము చేతను, ఆశ్రితురాలిని రక్షింపజాలక పోయితినే! యను నానృశంస్యము చేతను, భార్యా నష్టము గల్గినదే! యను శోకము చేతను, ప్రియా వియోగము సంఘటిల్లినదే! యను మదనుచేతను నతడు దుఃఖించుచుండెను.

(స్త్రీ ప్రణష్టేతి కారుణ్యా దాశ్రితే త్వానృశంస్యతః
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేనచ)

అని హనుమ యొకవిధముగ నిర్ణయించుకో గల్గెను.

ప్రార్థనా బుద్ధిమత్త సకల సంపదలను జేకూర్చును. ప్రయత్న మొనరించియు ఫలమందమిచే గల్గిన నిరుత్సాహము నావల నెట్టివైచి, యుత్సాహశక్తి నుపాసించి, నిరహంకార భావముతో నిశ్చలస్థితిని జేరి, ప్రార్థనా పూర్వక ముగ ప్రయత్న మొనరించి సంసిద్ధి బడసిన సమర్థుడు హనుమంతుడు. సీతయో! మహాసాధ్వి. ఇట్లనుటకు గారణమిది. ఆమెకు అన్నము లేదు; వస్త్రము లేదు; స్నానము లేదు; సంధ్య లేదు. ఎంత విరుద్ధ విపరీత పరిస్థితులలో నుండియు తన భర్తృధ్యానము మాన లేదు; ఆమెకు తన భర్తకంటె మఱియొక దైవమే లేదు.

భారతదేశ మిట్టి పాతివ్రత్య ధర్మమునకు ప్రఖ్యాతి నొందినది. సీత కేవల మా ధర్మానుగత మాత్రమేకాదు

ఆకృతి వహించిన పాతివ్రత్యమై యాదర్శ స్థానము నందినది.

అట్టి యామె పొందుచున్న దురవస్థను గాంచి కరుణా భరితుడు, సద్గుణారాధకుడు నగు హనుమంతునివంటి వాడు హృదయము జాలువాఱగా విలపించుట సహజము.

కనుకనే హనుమాను డిట్లు భావించెను.

'సీతా వియోగమునందును శ్రీరాముడు తన దేహమును ధరించుచున్నాడు. ఇట్టి శోకముచేతను నాతడు ప్రాణములు ధరించుట దుష్కర కార్యమే యగును.'

(దుష్కరం కృతవాన్ రామో హీనోయదనయా ప్రభుః
ధార యత్యాత్మనో దేహం నశోకే నావసీదతి)

ఆ యవసరమున హనుమానుడు తన యంతరంగమున ననుభవించిన దుఃఖ మనంతమైనది. వాల్మీకి యంతటి మహాకవికి నా దుఃఖము వర్ణింప వశముగాని దయ్యెను. కనుకనే యత డాతని మానస స్థితిని జిత్రింపకయే యిట్లు పలికెను.

'ఒక్క ముహూర్త కాలముపాటు ధ్యానముచేసి (తలపోసి) బాష్పాకుల దృష్టితో తేజస్వియగు నా హనుమానుడు సీతను దలంచి విలపించెను.'

(సముహూర్త మివ ధ్యాత్వా బాష్ప పర్యాకులేక్షణాః
సీతా మాశ్రిత్య తేజస్వీ హనుమా న్విలలాపహ)

హనుమాను డెంత తేజశ్శాలియైనను పాపము! జానకీ దేవి దుర్దశను గాంచి యతనికి కన్నులవెంట నీరుగార్పక తప్పలేదు. వావిడిచి వాపోవకయు దప్పలేదు.

హనుమంతు డాత్మకర్మ ఖ్యాతుడు; పౌరుషశాలి; సుఖ దుఃఖముల కతీతుడు; అట్టియాతని కన్నీటి ధార లమూల్యములు. అట్టివి వ్యర్థములయిపోవునా? అతడు తలచెను:—

'సీతవంటి మాన్యురాలుగూడ దుఃఖార్తయైనదే!
ఆహా! కాలము దురతిక్రమముగదా!'

(యది సీతాపి దుఃఖార్తా కాలోహి దురతిక్రమః)

దురతిక్రమమగు నీ కాలశక్తిని గూర్చి యభిమన్యు వధ సందర్భమునను భారతమున బ్రస్తావింపబడినది.

'శ్రీకృష్ణుని మేనల్లుడు, పార్థుని ప్రియ పుత్రుడు నయిన యభిమన్యునంతటి వీరాగ్రగణ్యుడు వధింపబడి నాడే; ఔరా! కాలమెట్టి దురతిక్రమణీయము.'

(మాతులో యస్య గోవిందః పితా యస్య ధనంజయః
అభిమన్యు ర్వధం ప్రాప్తః కాలోహి దురతిక్రమః)

—మహాభారతము

విధి నెవరు తప్పింపగలరు? ఎంతటివారేని యనుభవింపక తీఱదుగదా!

సీతా రాముల దాంపత్య మత్యంతానుకూలము.

ఇరువురును సమాన శీలురు, సమాన వయస్కులు, సమాన వర్తనులు, సమా నాభిజనులు, సమాన లక్షణులు. కనుకనే యా రాఘవునికి నీ జానకియు, నీ జానకికా రాఘవుడును నర్హులగుదురు.

(తుల్య శీల వయో వృత్తాం తుల్యాభిజన లక్షణాం
రాఘ వోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా)

వీ రిరువుర సహవాసము సతీ పతుల దాంపత్య ధర్మము నెట్లు బ్రకాశింపజేయుచుండునో, వియోగమును నట్లే యా ధర్మమును బ్రబోధించుచుండును. వారి పవిత్ర ప్రేమ సంపదయు వారి వియోగమునందే లోకమునకు లెస్సగ వెల్లడియయినది.

సీత యెన్ని యిక్కట్టుల కాటపట్టయినను, ఎంత వంతల గుందుచున్నను ఎవ్వరినిగాని పల్లెత్తి యొక్క మాటయేని పలుక లేదు. రాముడును నట్లే సంచరించెను. సీత పాతివ్రత్య మహత్త్వ మెట్టిదియో, రాముని నీతి మహత్త్వమును, వీర్య పటుత్వమును నట్టివి.

సీత సౌందర్య వైభవమునుగాంచి హనుమంతు డిట్లు తలపోసెను.

'విశాలాక్షి యగు సీత యిట్టిది యగుటచేతనే మహా బలుడగు వాలికి రామునిచే చావు మూడినది.'

(అస్యా హేతో ర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః)

'ఈమె నిమిత్తమువలననే సుగ్రీవుడు లోకపూజ్యమైన సంపద నొందగల్గినాడు.'

(అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతం)

'ఈమె నుద్దేశించియే నే నీ పట్టనమును నిరీక్షించితిని.'

(అస్యా హేతోర్విశాలాక్ష్యాః పురీచేయం నిరీక్షితా)

'రాము డీ సీతానిమిత్తము సముద్రాంతమగు సర్వం సహా మండలమునెల్ల నట్టిట్టుచేసినను నది న్యాయమే యగును.'

(యది రామ సముద్రాంతాం మేదినీం పరివర్తయేత్ అస్యాః కృతే జగచ్చాపి యుక్త మిత్యేవ మే మతిః)

'ముల్లోకముల రాజ్యలక్ష్మిని, జనకాత్మజయగు నీ సీతను బోల్చి చూచినచో సంపూర్ణ త్రైలోక్య రాజ్య ముగూడ నీ సీతతో వీసమేని బోలదు.'

(రాజ్యం వా త్రిలోకేషు సీతా వా జనకాత్మజా త్రైలోక్యరాజ్యం సకలం సీతాయాన్నాపు న్నయాతక-లాం)

ఈ సీత ధర్మశీలుడు, మిథిలాధిపతి, మహాత్ముడు నగు జనకరాజు కుమార్తె. దృఢమగు భర్తృవ్రతముగలది. ఈమె నాగేటి ముఖముచే ప్రీలిన క్షేత్రమునందు భూమిని బెకలించుకొని పద్మరేణు నిభములవంటి శుభము లగు కేదార పాంసువులచే కీర్ణమగుదేహముతో నుత్థితయైనది.

(ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా
ఉత్థితా మేదినీం భిత్వా క్షేత్రే హలముఖక్షతే
పద్మరేణు నిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః)

'ఇట్టి మహాసాధ్వి క్రూరరాక్షస పరివృతయై దారుణ బాధల పాలయినదిగదా!' యని హనుమంతు డావేదన పడెను.'

'రాజభవనముల సర్వభోగములను పరిత్యజించి, భర్తృ స్నేహబలము వలన దుఃఖములను లెక్కింపక నిర్జనారణ్యమును బ్రవేశించిన దీమె;'

(సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృస్నేహా బలాత్కృతా
అచింతయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనం)

'భర్తృ శుశ్రూషా పరాయణయై, కందమూల ఫలము లకు పరితృప్తినొంది, వనములకువచ్చి, భవనముల నున్నట్లు పరాప్రీతితో భర్తను సేవించుచున్నది;

(సంతుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణేరతా
యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా)

'ఇట్టి పతివ్రత పరాయణ మరల తనకు లభించినచో రాజ్యభ్రష్టుడగు రాజు తన భూమిని దాను మరల బొందినట్లు రాముడు సంతోషింపగలడు.'

(అస్యా నూనం పునర్లాభా ద్రాఘువః ప్రీతి మేష్యతి
రాజా రాజ్య పరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీం)

ఇన్ని శ్రమలు పడియు నీమె బ్రదుక గోరనేల ? ఈమె యిట్లు జీవించి సాధింపగల ఘనకార్యమేమి యందురా ! తాను భర్తతోజేరు నభిలాషయే యీమెకు గాఢము. ఆ యాశతోడనే యీమె జీవించుచున్నది.

'కామభోగములను వీడియు, బంధుజనులకు దూర మయ్యు నీమె తన దేహమును ధరించుటకు గారణ మొక్కటి.'

(కామభోగైః పరిత్యక్తా హీనా బంధుజనేన చ
ధారయ త్యాత్మనో దేహం తత్సమాగమ కాంక్షిణీ)

స్త్రీల యాశాబంధ మంత దృఢమైనది. అట్టి యాస తోడనే వా రెంత లేసి కష్టములనైన నలవోకగ భరి యింతురు.

'ప్రణయ మయమగుటచే కుసుమ సదృశమై, సద్యఃపాతియగు నంగనల హృదయమును వియోగమునం దాశాబంధమే యాపుచున్నది.'

(ఆశాబంధః కుసుమ సదృశం ప్రాయశో హ్యంగనానాం సద్యఃపాతి ప్రణయి హృదయం విప్రయోగే రుణద్ధి)

—కాళిదాసు.

అట్లే సీతయు నీ కష్టములలో నెక్కడానినిగానీ, వాని సమూహమునుగానీ గణియింపలేదు.

మానవ హృదయమొక విచిత్రమైనది. సామాన్యముగా స్వయముగా దానెంత కష్టములనైన ననుభవింప గలదు. కాని పరుల కష్టములను జూచి యోర్వజాలదు.

కనుకనే యాంజనేయు డిప్పుడు దా ననుకొనెను.

'సుఖాహ్లాయయ్యు దుఃఖముల ననుభవించుచున్న యీమెను గాంచిన దృఢమగు నా మానసముగూడ వ్యథితమగుచున్నది.'

(సుఖాహ్లాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః)

'నా మానసముగూడ వ్యథితమగుచున్నది' అనుటలో శిలాసదృశమగు నాంజనేయుని మనస్సే చెదఱుచుండగా నిక సరసమగు రాముని మనస్సు కఱగిపోవుటలో వింత

యే ముండును ? అని భావము. ఇట నాంజనేయుడు తన మనఃపాకమును, దృఢచిత్తమును మనోహరముగ - వినయ విధేయతలతో వెల్లడించుకొనెను. ఈ నిరంతర మనోదార్ఢ్యమునకు గారణ మాతని నిత్యానుసంధానము.

అశోకవనమున జానకి చుట్టును జేరి క్రూర దానవ స్త్రీలు చేయుచున్న రక్షణములును, ఉపచారములును గూడ శోకదాయకములుగ, హృదయ విదారకములు గనే యుండెను.

ఇట్టి స్థితిలోనున్న యా కాంతారత్నమును గాంచి యామె సీతయే యై యుండునని హనుమానుడు నిశ్చ యించుకొనెను.

ఆమె తన చుట్టునున్న రాక్షస స్త్రీలను చూచుట లేదు; వివిధములగు పుష్పఫల ద్రుమములను వీక్షించుట లేదు; ఏకాగ్రమగు మనస్సుతో తన భర్తయగు రామునే స్మరించుచున్నది.'

(నైషా పశ్యతి రాక్షసీ నేమాన్ పుష్పఫల ద్రుమాన్
ఏకస్థ హృదయా నూనం రామమే వానుపశ్యతి)

స్త్రీలకు భర్తయేగదా యుత్తమమగు భూషణము ! తన భర్త సమీపమున లేకుండుటచే నీమె యిప్పుడు శోభా హీనయై యున్నది.

(భర్తానామ పరం నార్యా భూషణం భూషణా దపి
ఏషాతు రహితా తేన భూషణార్హా న శోభతే)

ఇది భారతీయుల సంప్రదాయము. ఇట్లన్నంత మాత్ర ముననే స్త్రీ స్వాతంత్ర్య వాదుల మనుకొనువారు, మహిళోద్యమ ప్రోత్సాహకుల మనుకొనువారు మన్మన్య థా భావింపరాదు. దాంపత్య ధర్మమున స్త్రీలు పురుషుల నెట్లు గౌరవింపవలయునో, పురుషులు స్త్రీలనుగూడ నట్లే గౌరవింపవలయును. ఇది మన సనాతన ధర్మము. వారివారి కార్యక్షేత్రములు వేఱుగుగాక! వారి బాధ్యతలు భిన్నములగునుగాక! గౌరవా గౌరవ భావములు వానిని బట్టి కాదుగదా యుండునది!

తన్నే లోకమని నమ్మినొని, తానే ప్రాణములుగా జీవించు జానకిని వీడి రాము డెట్లు జీవించుచున్నాడా! యని యాంజనేయు ననుమానము.

(దుష్కరం కురుతే రామః హీనో య దనయా ప్రభుః
థారయ త్యాత్మనో దేహం న దుఃఖే నావసీదతి)

ఆంజనేయు డిట్లనుకొనుచు నున్నంతలో దెల్లగలువల మొత్తమువంటి నిర్మల చంద్రబింబము నీలజలమ్మున్పై దేలియాడు హంసమువలె నాకాశమున దోచెను.

(తతః కుముద షండాభో నిర్మలో నిర్మలం స్వయం
ప్రజగామ నభ శ్చంద్రో హంసో నీల మివోదకం)

శుభ్రమగు ప్రకాశము గల్గిన యా చంద్రుడు తన శీతకరములచే సాచివ్యము నెఱపుచున్నట్లు హనుమానుని జల్లబఱిచెను. ఆ నిర్మల కౌముదీ ప్రకాశమున నాతడు 'నీటిలో మునుగుచున్న నిండు పడవవలె' శోకభారముచే మునుగుచున్న సీతా ముఖచంద్రుని జూడగల్గెను.

(స దదర్శ తత స్సీతాం పూర్ణచంద్రనిభాననాం
శోకభారై రివ న్యస్తాం భారై ర్నావ మివాంభసి)

ఆమెను వికారరూపలగు రక్కసులు పెక్కురు చుట్టు ముట్టి యుండిరి. వా రెల్ల రనాకారలుగాను, భీకరాకారలుగా నున్నట్లు వాల్మీకి వర్ణించెను.

గుణములకు దగినట్లు లాకారమును వర్ణించుట మన కవుల సంప్రదాయము. కనుకనే వికృత స్వభావులను భీకరాకారులుగను, సౌమ్య స్వభావులను సరసాకారులుగను వారు వర్ణించుచుందురు. కాబట్టియే ప్రహ్లాద విభీషణాది సాధు పురుషులు సౌమ్యాకారులుగను, హిరణ్య కశిపు రావణాదులు ఘోరాకారులుగను మన వాఙ్మయమున జిత్రింపబడి యుండిరి. సాధువుల యెడల ననురాగ సానుభూతులను, క్రూరుల యెడల వైముఖ్య ద్వేషము

లను పాఠక జనులయు, శ్రోతృ జనులయు మనఃపటముల యందు జిత్రించుటయేగదా వారి కావ్యరచనోద్దేశము!

ఇట్టి క్రూర రాక్షసీ మండల మధ్యభాగమున నిర్మల చారిత్ర ప్రశస్తయు, భర్తృదర్శన దుర్గతయు, నుత్త మా భూషణ విహీనయు, భర్తృ ప్రేమ భూషణయు నగు సీతా కాంతను హనుమంతు చూడగల్గెను.

(చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శన దుర్గతాం
భూషణై రుత్తమై ర్హీనాం భర్తృ వాత్సల్య భూషణాం)

ఆమె వర్షా కాలాంతమున శరన్మేఘ జాలముచే సంవృత యగు చంద్ర రేఖవలెను, సంస్కారముగానీ, తంత్రీ యోగముగానీ లేక రూపుచెడ్డ వీణియవలెను నున్నది;

(చంద్ర రేఖాం పయోదాంతే శారదా భ్రై రివావృతాం
క్లిష్టరూపా మసంస్కార్యా దయుక్తా మివ వల్లకీం)

మఱియు నామె శోకసాగర నిమగ్నయై పుష్పవిహీన మైన లతాకృతిని

(దదర్శ హనుమా న్దేవీం లతా మకుసుమామివ)

బురద గొట్టుకొనియున్న తామర తీగవలె ప్రకా శించుచును, ప్రకాశింపకయు నున్నది.

(మృణాలీ పంకదిగ్ధేవ విభాతి న విభాతిచ)

తొగరు జిగురుల మొత్తముచే దగదగలాడుచున్న యా వనవృక్షము లామె నిశ్శ్వాసానలమునకు బగబగలాడుచున్నట్లు కన్పట్టుచున్నవి.

(దహంతీ మివ నిశ్శ్వాసైః వృక్షా న్పల్లవ ధారిణః)

ఆమె శోకసంఘాతమువలె, పై కెగిరిన దుఃఖతరంగము వలె విచారగ్రస్తయై యున్నది.

(సంఘాతమివ శోకానాం దుఃఖ స్యోర్మి మివోత్థితాం)

ఆమెను జూచునప్పటికి హనుమానున కపరిమితమగు హర్షము గల్గినది.

(ప్రహర్ష మతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీం)

ఆ సంతోషాతిశయము వలన గన్నుల వెంట హర్షాశ్రువులు గాటినవి. ఆ యానందమున నాతడు 'రామ! లక్ష్మణ! మీరు ధన్యులు; మీ జానకి జీవించియే యున్నది. దాశరథులార! నేను ధన్యుడనైతిని. సేవా కార్యమున కిచ్చటికి వచ్చి, మీ యనుగ్రహాతిశయమున సీతను గాంచి నేను కృతార్థుడనైతిని. నా జన్మము సఫలమైనది.' అను భావముతో రామలక్ష్మణుల కొక్కమాఱు ప్రణామ మొనరించెను.

(హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణాం
ముమోచ హనుమాన్ తత్ర నమ శ్చక్రేచ రాఘవం)

ఇంతలో వేగుజామైనది. అప్పుడు షడంగములు నేర్చిన వేద వేత్తలు, క్రతు ప్రవర యాజకులునగు వారి వేదఘోష చెవులబడెను.

శ్రోత్ర మనోహరములగు మంగళ వాద్యధ్వనులకు రావణుడు నిద్ర మేల్గాంచి, జాతీన మాల్యములను, సడలిన వస్త్రములను సవరించుకొని, సీతను సంస్మరించి యశోక వనమునకు బయనించెను. ఆతని భార్యలును, పరిచారికలును నాతని వెంట నంటిరి. ఆతడు వచ్చి చుండగా హనుమానుడు దట్టములగు వృక్షపత్రములలో దాగుకొని కూరుచుండెను.

ఇట్టి పవిత్రమగు బ్రాహ్మ ముహూర్తమున సీతను సంస్మరించుచు రావణు డామె కడ కేతెంచెను. బ్రాహ్మ ముహూర్తము బ్రహ్మకాలము. బ్రహ్మ సృష్టికర్త గావున నా కాలము నందలి భావములును నట్లే యుండుటలో వింతలేదు.

రావణుడు వైదేహీ చింతనము గావించుట మేలే; కాని యాచింతనము సద్భావమునగాదు; కామియై కామ దృష్టితోడ గావించెను. కావున నాతని రాక్షసత్వమునే ప్రకటించుకొనుచున్నాడు. సదవకాశమును, సత్కాల మును దుర్వినియోగ మొనర్చుకొనుచున్నాడు.

'కామ పరాధీనుడై, మహా బలుడగు రావణుడు సీతా సక్త మనస్కుడై, మందుడై మదగతితో బయలుదేరి నాడు.

(స చకామ పరాధీనః పతి స్తాసాం మహాబలః
సీతాసక్త మనా మందో మదాంచిత గతి ర్బభౌ)

ఇట్లెండమావులవంటి యల్ప సుఖముల కాసపడి వానిని వెన్నాడు వా డెప్పటికేని వానివలన సంతృప్తి నందగల్గునా! అసంభవము.

కామ మనుభవము వలన నెప్పుడును శాంతినొందదు. హవిస్సుచేత నగ్ని నార్ప వలయునని ప్రయత్నించిన వా డగ్ని నెన్నడేని నార్పగల్గునా?

(న జాతు కామః కామా నా ముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే)

—భగవద్గీత

భారతమున యయాతి చరిత్రమును మన మెఱుగమా?

ఇంతకాలము నెట్టులో యాశామయుడై జీవించు చున్న యామె యిప్పు డా రావణుని గాంచి హతాశయై పోయినది. (ఆశాం ప్రతిహతామివ)

కాని యాశాలత యొక వింతరీతిది. ఆశాక్రమమును సుభాషిత త్రిశతి యిట్లభివర్ణించుచున్నది.

'ఈ రాత్రి గడచును; ప్రభాతమగును; సూర్యు డుదయించును; పద్మము వికసించును; అనుకొనుచు పద్మముకుళమున బంధింపబడిన తుమ్మెద యాసించుచు నాసించుచు నుండగానే పాప! మొక మదపుటేనుగు వచ్చి యా పద్మమును బెఱికివైచినది.'

(రాత్రి ర్గమిష్యతి భవిష్యతి సుప్రభాతం
భాస్వా నుదేష్యతి హసిష్యతి పంకజశ్రీ:
ఇత్థం విచింతయతి కోశగతే ద్విరేఫే
హా! హంత! హంత! నళినీం గజ ఉజ్జహార)

—భర్తృహరి

అట్లు వచ్చుచున్న యారావణునిగాంచి సీత మహావాత ముచే గదలుచున్న కదళీతరు కాండమువలె గడగడ లాడుచు, నేడ్చుచు, నూరుయుగముచే నుదరమును, బాహుద్వంద్వముచే బయోధరములను గప్పుకొని కూరు చుండెను.

(ఆచ్ఛాద్యోదర మూరుభ్యాం బాహుభ్యాంచపయోధరౌ
ఉపవిష్టా విశాలాక్షీ రుదంతీ వర వర్ణినీ)

పతివ్రతయు, దీనయు, నిరానందయు, తపస్వినియు నగు సీతనుజూచి రావణుడు భావములకు రూపము గల్పించుచున్న మధుర వాక్యములతో బలికెను.

(సీతాం పతివ్రతాం దీనాం నిరానందాం తపస్వినీం
సాకాై ర్మధురైః వాక్యైః న్యదర్శయత రావణః)
సీతను లోబఱచుకొనుటకు రావణుడు ప్రకటించిన
మార్గములు, ఉపాయములు నసాహాన్యములు.

పరస్త్రీ గమనమును, పరస్త్రీలను బలాత్కారమున
హరియించి తెచ్చుటయ దమ కులమునకు స్వధర్మములని

(గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్యవా)
తన కులాచార పరాయణతను జాటుకొన్నాడు.

తన్ను గామింపని జానకిని తాకనని తన న్యాయ
బుద్ధిని వెల్లడించినాడు.

(ఏవం చైత దకామాంతు నత్వాం స్ప్రక్ష్యామి మైథిలి)

స్త్రీ పురుషుల కిరువురకు సమాన కామభావమున్ననే
సుఖము గల్గునుగాని విషమ కామము సుఖదాయకము
గా దనియు, కావుననే తన శరీరమున నున్నటులే సీతా
శరీరమునగూడ గామము గలుగవలయు ననియు నత
డభ్యర్థించినాడు;

(కామం కామ శ్శరీరే మే యథా కామం ప్రవర్తతే)

భయము కామమునకు విరోధి యనియు, సీతకు
భయంపడదగు కారణము లున్నవనియు నాత డెఱుగును.

కావుననే భయమును వీడుటకును, దన్ను విశ్వసించి ప్రేమించుటకును నామెను వేడుకొన్నాడు;

(దేవి నేహ భయం కార్యం మయి విశ్వసి హి ప్రియే
ప్రణయస్వాచ తత్త్వేన మైవం భూశ్శోక లాలసా)

స్త్రీలు సామాన్యముగ నభిలషించు విచిత్రములగు మాల్యములు, చందనములు, అగరులు, రకరకముల చీరలు, దివ్యములగు నాభరణములు, శ్రేష్ఠములగు పానీయములు, మెత్తలు, పీఠములు, గీత నృత్త వాద్య సౌకర్యములు తనవలన గ్రహింపుమని యాశ జూపినాడు.

(విచిత్రాణి చ మాల్యాని చందనా న్యగరూణిచ
వివిధానిచ వాసాంసి దివ్యా న్యాభరణానిచ
మహార్హాణిచ పానాని శయనా న్యాసనానిచ
గీతం వృత్తంచ వాద్యంచ లభ మాం ప్రాప్య మైథిలి)

'స్త్రీ రత్నమవగు నీవు నిరలంకృతవై యుండుట మేలు గాదు; కాన నీ దేహము నలంకరించుకో'మ్మని యనున యించినాడు;

(స్త్రీ రత్న మసి మైవం భూః కురు గాత్రేషు భూషణం)

'మనోహరమగు నీ యౌవనము వ్యర్థముగ గడచి పోవుచున్నది. ఇది మరల లభించునది గాదు; ఏటి ప్రవాహమువలె నతివేగముగ బ్రవహించి పోవునది కాన నీ

వయస్సును సఫలము చేసికొ'మ్మని హితోపదేశ మొన రించినాడు;

(ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే
య ది తీతం పునర్నైతి స్రోత శ్శీఘ్ర మపామివ)

ఆమె గాత్రసౌందర్యమును బ్రశంసించినాడు; అదృష్ట ము నభినందించినాడు; తనకు పట్టమహిషిగా గమ్మని బ్రతిమాలినాడు; అఖిల భూమండలము నిత్తునని యాశలువెట్టినాడు; తన గొప్పతనమును బ్రకటించు కొన్నాడు;

(న రామ స్తపసా దేవి నబలేన నవిక్రమైః
న ధనేన మయా తుల్య స్తేజసా యశసాపివా)

ఆమె కోరుచున్న శ్రీరాము డసమర్థుడనియు, దరి ద్రు డనియు నిరాదరణ చూపినాడు.

(ప్రతీ క్ష్యండిల శాయీచ శంకే జీవతి వా నవా)

ఇట్లు నానా భావములతో, ననేకోపాయములతో ధన్నొప్పింప జూచుచున్న రావణునిగాంచి 'దుఃఖార్తయు, దపస్వినియు, రోదనముతో గడగడలాడుచున్నదియు, వరారోహాయునయి భర్తనే తలంచుచున్న యా సీత తన చేత నొక తృణము నాతని కంతరమున బట్టుకొని,

యంతటి దుఃఖములోగూడ. నాతని యవివేకమున కొకింత నవ్వు వొడమగా నాతనితో నిట్లు పల్కెను.

(దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ
చింతయంతీ వరారోహా పతిమేవ పతివ్రతా
తృణ మంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా)

ఇందు 'సీత దుఃఖార్తగదా! ఆమె రుదతి' యని చెప్పుచు 'శుచిస్మిత' యయ్యెనని చెప్పుట యుచితమా?' యని యొక చిన్న సందియము గల్గుట సహజము.

హాసము వేఱు; సంతోషము వేఱు అనుట క్రొత్తవిష యముగాదు.

హాసము వికృత వస్తుదర్శన, వికృత భాషణ శ్రవణా దుల వలనను,

(వికృతి దర్శనాది జన్యో మనో వికారో హాసః)
వాక్య చమత్కారాదులవలనను గలుగుచుండునది.

ఈ హాసము ఉత్తమ మధ్యమాధమ పాత్రములను బట్టి - ఒక్కొక్క తెగకు రెండువిధముల వంతున - ఆఱు విధములగు నని లక్షణ శాస్త్రము వివరించుచున్నది. ఉత్తముల హాసము స్మితము, హసితము. స్మిత మనగా నయన వికాసము. (స్మిత మిహ వికస న్నయనం) హసిత

మనగా దంతము లొకింత వెలివడునవ్వు. (కించిల్లక్ష్య ద్విజం హసితం).

ఇప్పుడు సీతా హాసము స్మితమని చెప్పుటచే నామె నేత్ర పద్మములలో గొంత వికాసము గానబడియె ననియే తత్త్వము. రావణు విపరీత భాషణములను వినుచున్న సీతకు స్మితము గల్గుటలో వింత యుండదుగదా!

ఇక సీత తనచేత దృణమునుంచుకొని మాటలాడ నేల? యని యొకింత చూతము.

పతివ్రతలు పరపురుషునితో బ్రత్యక్షముగ మాట లాడుట ధర్మముగాదు గాన దన కాసమయమున జిక్కిన తృణముచే దనకు బరోక్షభావమును సీత గల్పించుకొన్నది;

రావణుడు తన్ను వరింపుమని తన వైభవమును జాటు కొనుచుండగా సీత యాసంపద యంతయును దృణప్రాయ మని యాతనికి బ్రకటించుటకై తనచేత నీపోచను బట్టు కొన్నదనియు భావింపవచ్చును; మఱియు రావణా! నీవు రాముని కంటె సర్వోత్తముడవని భావించుకొనుచున్నావు గాని నిజముగా నాతని యెదుట నీవొక గడ్డిపోచవు సుమా! యని హెచ్చరించుచున్నది; ఇంకను దన్ను నానావస్థలు పెట్టుచు తన గౌరవమునకు భంగము గల్గింప నెంచుచున్న యాతని యెడల దన కోపము ప్రసరించినచో

నాత డప్పుడ దగ్ధమగుననియు, నాతనిని దన భర్తయగు శ్రీరామునిచే జంపించి యా కీర్తిని రామునకు దక్కించ వలయు ననుభావముతో దనకరమున నీ పరకను బట్టు కొన్నదనియు నూహింపవచ్చును.

సతులు తమ భర్తృ పరోక్షమున బరపురుషులతో నెంటరిగ సంభాషింపరా దను సనాతన పద్ధతి నాదరించి తనచేత నీ తృణమును ధరించినదనియు ననుకొనవచ్చును.

రావణుని జూచి సీత యిట్లు పలికెను :

'రావణా! నీమనస్సును నావలన మరలించి నీ వధూజ నముపై నిలుపుకొనుము.

(నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః)

'పతివ్రతలచే నిందింపదగిన కార్యమును నుత్తమ కుల మునబుట్టి, యట్టి కులమున మెట్టిన నేను జేయుదునా?

(అకార్యం న మయా కార్య మేకపత్న్యా విగర్హితం
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా)

'నిశాచరా! నీభార్యలను నీ వెట్లు కాపాడుకొను చున్నావో యితరుల భార్యలనుగూడ నీవట్లు రక్షింప వలయును. ఈ విషయమున నిన్ను నీవే యుదాహరణ ముగా నుంచుకొని నీ దారలతో సుఖింపుము.

(యథా తవ తథాఽన్యేషాం దారా రక్ష్యా నిశాచర
ఆత్మానమువమాం కృత్వాస్వేషు దారేషు రమ్యతాం)

'తన భార్యలతో సంతృప్తినొందనిచపలుడు, నింద్రియ నిగ్రహము లేనివాడు, ప్రజ్ఞాహీనుడు నగు పురుషునికి పరదారలపలన బరాభవమే గలుగుచుండును.

(అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేంద్రియం
నయంతి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవం)

'రాజు నీతి దూరుడు, నసమర్థుమనయిన-చో సంపన్న ములగు రాష్ట్రములు, నగరములు గూడ నశించును సుమా!

(అకృతాత్మాన మాసాద్య రాజాన మనయేరతం
సమృద్ధాని వినశ్యంతి రాష్ట్రాణి నగరాణిచ)

'రావణ! ఐశ్వర్యముచేతగానీ, ధనముచేతగానీ నన్ను లోభపెట్టజాలవు. సూర్యునితో ప్రకాశమున కున్నట్లు శ్రీరాముని తో నాకు నిరంతర సంబంధమున్నది.'

(శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధనేనవా
అనన్యా రాఘవే ణాహం భాస్కరేణ ప్రభాయథా)

సీత యిట్లు పెక్కు-దెఱగుల ధర్మమును, రాజ ధర్మ మునుజూపి బోధించినది.

'నీవు శుభము నిచ్చగించినచో శ్రీరాముని శరణు గోరి నన్నతని కర్పింపు'మని పశ్చాత్తాపబుద్ధిని బ్రేరేచ బ్రయత్నించినది;

(మాం చాప్యేష ప్రయతో భూత్వా నిర్యాతయితుమర్హసి
ఏవంతు తే భవేత్ స్వస్తి సంప్రదాయ రఘూత్తమే)

లేదా 'యింద్రుని వజ్రాయుధ ముపేక్షించిన నుపేక్షించుగాక! యముడు విడిచిపెట్టిన విడిచిపెట్టుగాక! శ్రీరాముడు క్రుద్ధుడైనచో నీవంటి నీచుడు బ్రతికిపోలే'డని భయపెట్టినది.

(వర్జయే ద్వజ్రముత్సృష్టం వర్జయే దంతకశ్చిరం
త్వద్విధంతు న సంక్రుద్ధో లోకనాథ స్సరాఘవః)

'నీచుడా! ఇచ్చట బుద్ధిమంతులు లేరా? ఉన్నను వారి హితముల నీ వాలింపవా? ఆచారవర్జితమగు నీ విపరీతబుద్ధినిజూడ నీవు వారి నాలింపనట్లేయున్నది.

(ఇహ సంతో నవా సంతి సతో వా నాను వర్తసే
తథాహి విపరీతా తే బుద్ధి రాచార వర్జితా)

అని మందలించినది;

రాముని పరాక్రమ కార్యములను స్మరణపథమునకు దెచ్చినది. ఎన్నియైననేమి! ఎంతయైననేమి! పుట్టిను

బుట్టినబుద్ధి పుచుకలతోగాని పోదుగదా ! దానవులకు ధర్మములు రుచించునా !

సీతాచిత్తానుకూల్యమునుగోరి రెండుమాసము లవధి యేర్పఱచెను. (ద్వౌ మాసౌ రక్షితవ్యౌమే) అప్పటికి నామె యొప్పుకొనకున్నచో నా మఱునాటి ప్రాతఃకాల భోజనమునకు బచనీయముగా నామెను ఖండించిసిద్ధపఱుప నేర్పాటుచేసెను.

(మమ త్వాం ప్రాతరాశార్థ మారభంతే మహానసే)

ఇట్లు పలుకుచున్న రావణునిజూచి సీత కోపాతిరేక మున నిట్లు దూషించినది.

రాక్షసాధమ ! రాముని చెంగటలేని సమయమున పిఱికిపందవై దొంగవలె నీవు నన్ను గొనివచ్చితివి. నీ వొక నీచుడవు; శశమాత్రుడవు. కాని రాముడో ! భద్రగజరాజము.

'అనార్య ! క్రూరముగ నన్నీక్షించుచున్న నీ గ్రుడ్లు నేల నేల రాలవో !'

(క్షితౌ నపతితే కస్మా న్మా మనార్య నిరీక్షతః)

'నావంటి పతివ్రత నిట్లు మాటలాడుచున్న నీ నాలుక చీలి, వ్రీలి యేల పడిపోవదో !

(కథం వ్యాహరతో మాం తే నజిహ్వా వ్యవశీర్యతే)

నీచుడా ! నీ కంత కాలము సమీపించుట వలననే-
విధిమూలమునసే-పతివ్రత నిట్లు గైకొని వచ్చితివిసుమా!'
అని భయంకరముగ నెడలు జలదరింప బలికెను.

అప్పుడు రావణుడును గోప మాపుకొనలేక 'నీ భర్త యగు రాముడును విధి మూలమునసే యరణ్యములలో నానావస్థలు పడుచున్నాడుసుమా!' యని వెక్కిరించెను.

ఇచ్చట సామాన్య పాఠకుల కొక్క సందియము గలుగవచ్చును. ఏమన: 'సీత మహాపతివ్రత యంటిరే, తన్నిన్ని తెన్నుల దుర్భాషలాడు రావణుని శపించి తన మహిమమును గాన్పింపలేకపోయినదా !' అని.

ఇట్టి వారి సందేహ నివారణార్థమా ! యన్నట్లు సీతయే తా నిట్లు వచియించినది.

'రావణ ! రామాజ్ఞలేనందువలనను, నా నియమాను ష్ఠాన నిరతిచేతను నిన్ను భస్మముచేయకవిడుచుచున్నాను.'

(అసందేశాత్తు రామస్య తపస శ్చానుపాలనాత్
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా)

అప్పుడు రావణు డామెను దన కనుకూలముగా నెనర్పుమని యచ్చటి కావలి వారి కానతిచ్చి యల్లన నిజభవనమున కేగెను.

అంతట సీతను గ్రమ్మ్మకొనియున్న సిగ్గిడి రాకాసు లెల్లరు రావణునెడల నార్ద్ర భావముగల్గించుటకై సీత కెన్నియో విధముల జెప్ప నారంభించిరి. అప్పు డామెకు దుఃఖ మతిసహ మయ్యెను. అట్టి పరిస్థితిలో నామెకు దా నాత్మహత్య యొనర్చుకొనుటయే మేలనియు నూహ లుదయింపసాగెను.

క్రూర రాక్షసు లెందఱుగూడి యామెకు బుద్ధులు మప్ప బ్రయత్నించుచున్నను సీత యిసుమంతయేని సంకో చింపక తన యుద్దేశములను తాయి గ్రుద్ది స్పష్టపఱచు చునే యుండెను.

'దనుజ కాంతలారా! దానవునికి మనుష్య కాంత దారగా నుండదగదు. మీరు నన్ను లెస్సగ భక్షింపుడు; అయినను నేను మాత్రము మీరు చెప్పినట్లు చేయను;

(న మానుషీ రాక్షసస్య భార్యా భవితు మర్హతి
కామం ఖాదత మాం సర్వా నకరిష్యామి వో వచః)

'దీనుడుగానిండు, రాజ్యహీనుడు గానిండు; నాకు భర్తయే గురువు. సువర్చలకు సూర్యుని యం దనురక్తి యున్నట్లు నాకు నా భర్త యెడలనే యనురాగము.

(దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః
తం నిత్య మనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా)

అంతటితో నాగక యామె మఱియు నిట్లా వేగముతో బల్క–నది.

'సౌభాగ్యవతియగు శచీదేవి యింద్రుని, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర యగస్త్యుని, సుకన్య చ్యవనుని, సావిత్రి సత్యవంతుని, శ్రీమతి కపిలుని, మదయంతి సౌదాసుని, కేశిని సగరుని, దమయంతి నలుని ననుకరించునట్లు నేను రాముని కనువ్రతను.'

(యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి
అరుంధతీ వసిష్ఠంచ రోహిణీ శశినం యథా
లోపాముద్రా యథాగస్త్యం సుకన్యా చ్యవనం యథా
సావిత్రీ సత్యవంతంచ కపిలం శ్రీమతీ యథా
సౌదాసం మదయంతీవ కేశినీ సగరం యథా
నైషధం దమయంతీవ భైమీ పతి మనువ్రతా
తథాహ మిక్ష్వాకు వరం రామం పతి మనువ్రతా)

పైన బేర్కొ–న్న పతివ్రతా చరిత్రలసామాన్యములు. వా రెల్లరు పాతివ్రత్యమున బ్రసిద్ధికెక్కి–యుండిరి.

ఇందు సీత శచీదేవితో నారంభించి దమయంతితో ముగించెను. ఈ దమయంతియో తానై కోరివచ్చిన త్రిదివాధీశుడగు దేవేంద్రుని నిరాకరించి మానవుడగు నలుని స్వీకరించినది. అట్లే సీతయు రాక్షసరాజగు

రావణు నిరాదరించి రాముని యంద మనస్సు నిల్పి తన ధర్మమును గాపాడుకొనెను.

రాక్షస స్త్రీలును తమ రాజగు రావణునివలెనే సీతను సామ దాన భేదములతో బోధింపబూనిరి.

'సీత! స్త్రీలకు యౌవనము నిత్యము గా దనుట నీకు దెలియును. అట్టి యౌవన మతిక్రమింపకముందే సుఖముల ననుభవింప జూడుము.'

(జానాసి హి యథా భీరు స్త్రీణాం యౌవన మధ్రువం
యావ న్నతే వ్యతిక్రామే త్తావ త్సుఖ మవాప్నుహి)

యౌవనము చంచలమను నిట్టి భావమే రఘువంశ మునను నెక్కటౌవున గాననగుచున్నది.

'అభిమానములు వీడుము; కలహాములను గట్టి పెట్టుము; కడచిన యౌవనము మరలరాదు; అని కోకిలలు నివేదింపగా వధూజనము క్రీడానుకూలమైనది.'

(త్యజత మాన మలం బత విగ్రహైః
న పున రేతి గతం చతురం వయః
పరభృతాభి రి తీవ నివేదితే
స్మర మతే రమతే స్మ వధూజనః)

—కాళిదాసు.

ఈ భావమునే కామిని యొక ర్తుక గ్రామ్యభాషలో బల్కిన పల్కులు మనము వినుచుందుము.

(.....నిత్యం యదిశక్తి రస్తిచే
ద్దినే దినే గచ్ఛతినాథ! యీవనం)

రాక్షసజాతియు బ్రధానముగ నీ తెగవారేగదా! వారి లక్ష్యము లైహిక భోగములేగదా! కనుకనేగాదా! వారు రాక్షసులైనది!

ఇట్లు కొందఱు రాక్షస స్త్రీలు సుఖాశలు చూపుచు సామదానోపాయములను బచరించు చుండగా నొక కొందఱు క్రూర లొకొక్కక రొకొక్కరీతిగ భయంకరముగ నిట్లు గర్జిల్లసాగిరి.

':-మే మెల్లరము నిన్నిప్పుడే భక్షించివైతుము.
(అస్మిన్ముహూర్తే సర్వాస్త్వాంభక్షయిష్యామహేవయం)

:-నీ హృదయమునుజీల్చి నిన్ను నేను భక్షింతును;
(ఉత్పాట్యవా తే హృదయం భక్షయిష్యామి మైథిలి)

:-నీ యకృత్తును, ప్లీహమును, ఉత్పీడమును, బంధనముతోడి హృదయమును, ఆంత్రములను, మేదస్సును నారగింపవలయునని నా తలంపు.
(యకృత్ ప్లీహ మథోత్పీడం హృదయంచ స బంధనం
ఆంత్రా ణ్యపి తథాశీర్షం ఖాదేయ మితి మే మతిః)

:—ఈ నృశంస కుత్తుక నులిపి యిది చచ్చినదని రావ
ణుతో బలుక—దము; ఊరక చూడనేల ?

(కంఠ మస్యా నృశంసాయాః పీడయామ కిమాస్యతే
నివేద్యతాం తతోరాజ్ఞే మానుషీ సా మృతేతి హ)

:— దీనికొఱకై మీరు వివాదపడుట నా కిష్టము లేదు. దీనిని జీల్చి, ముక్క—లుచేసి మనము పంచుకొని తిందము; మద్యములను, పచ్చళ్లను దెందము.

(విశ స్యేమాం తత స్సర్వా స్సమాన్ కురుత పీలుకాఖ
విభజామ తత స్సర్వా వివాదో మే నరోచతే)

ఈ ప్రకార మపకార వాక్యములను బలుకుచున్న వారినిజూచి సీత ధైర్యముచెదటి, దేహము కంపింప నశోకవృక్షశాఖను బట్టుకొని యేడ్చుచు నేడ్చుచు భగ్న మానసయై తన భర్తను దలపోయుచుండెను. కన్నీరు చనుగట్టుపై స్రవియించుచుండెను. ఇట్లామె వణకుచు వణకుచు మహావాతమునకు బడిపోవు నరటి మొక్క—వలె నేలమీద బడిపోయెను.

అప్పు డట్లు కంపించుచున్న సీతాకాంత మొక్క— దీర్ఘ మును, విపులమునైన వేణి నేలమీద బొరలుచు కృష్ణ సర్పమువలె గాననయ్యెను.

(తస్యా స్సా దీర్ఘ విపులా వేపంత్యా స్సీతయా తదా
దదృశే కంపినీ వేణీ వ్యాళీ వ పరిసర్పతీ)

కృష్ణసర్పమువంటి యామె యీ వేణి దుశ్శాసనునిచే లాగబడిన ద్రౌపదీవేణిని స్మరియింపజేయుచున్నది గాదా! ఆ వేణీ సంహారమే కౌరవాటవికి కాఱుచిచ్చయినట్లు లీ సీతావేణియే యీ లంకారాజ్యమునకు ధూమకేతువు గానున్నది గాబోలు!

ఆమె 'ఓ రామ! లక్ష్మణ! అత్తా కౌసల్యా! సుమిత్రా!' అని పేరుపేరున నెల్లర దలచుచు విలపించుచుండెను.

'స్త్రీకిగానీ, పురుషునికిగానీ యకాలమున మృత్యువు దుర్లభమనుట సత్యము సుమా!'

(అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా)

'కొఱనోములు నోచిన నేను 'వాయువేగముచే సముద్రమధ్యమున నశించు నోడవలె' నీలంకలో దిక్కు-లేనిదానినై నశించుచున్నాను.

(ఏ పాల్పపుణ్యా కృపణా వినశిష్యా మ్యనాథవత్
సముద్ర మధ్యే నౌ ఃపూర్ణా వాయువేగై రివాహతా)

'పూర్వజన్మమున నెట్టి పాపము చేసితినో! అమిత దారుణమగు నీ ఘోర దుఃఖము నిప్పు డనుభవించు చున్నాను.

(కీదృశంతు మయాపాపం పురా జన్మాంతరే కృతం
యే నేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణం)

'ఈ రాక్షస స్త్రీలు చుట్టుకొని యున్న నాకిక శ్రీరా
ముని జూచు యోగ్యత లేదు' కాన నీ మహాదుఃఖముచే
ప్రాణములు విడుచుట మేలుగా దోచుచున్నది.

(జీవితం త్యక్తు మిచ్ఛామి శోకేన మహతా వృతా
రాక్షసీభిశ్చ రక్ష్యంత్యా రామో నాసాద్యతే మయా)

'చీ! యీ మనుష్యజన్మ మేలయెత్తితిని? అందునను
పరవశమగు నీ జీవిత మేల దాపురించినది? స్వేచ్ఛగా
ప్రాణములు విడుచుటకును వీలుగాదే!

(ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతాం
నశక్తుం య త్పరిత్యక్తు మాత్మ చ్ఛందేన జీవితం)

'ఈ నా హృదయము శిలాసారమువలె నున్నది. ఇది
యజరామరముగ నగపడుచున్నది. ఇంత దుఃఖము నను
భవించుచుండియు నిది బ్రద్దలగుట లేదేమి!

(అశ్మసార మిదం నూన మథవా ప్యజరామరం
హృదయం మమ యే నేదం న దుఃఖే నావశీర్యతే)

'వీరు నన్ను జీల్చిన జీల్పనీ; తిన్న దిననీ; అయినను
రాముని వీడి చిరకాల మీ దుఃఖమును సయింపజాలను.

'చీ! భర్తకు దూరమై యసతివోలె బరునియింట-
నెక్కటుణమే కానిమ్ము-జీవించు నా జీవితమేల?
(ధిజ్మా మనార్యా మసతీం యాఽహం తేన వినాకృతా
ముహూర్త మపి రక్షామి జీవితం పాప జీవితా)
'ఈ రాక్షసుని నా యెడమ కాలితోనేని దాకను.
నే నిట్టి నీచుని గోరుదునా?
(చరణే నాపి సవ్యేన నస్పృశేయం నిశాచరం
రావణం కింపున రహం కామయేయం విగర్హితం)
'రాకాసులారా! మీరు నన్ను జీల్చినను సరియే,
ముక్కలుగా నఱికినను సరియే; బగ బగ మండుచున్న
యగ్నిలో గాల్చినను సరియే; కాని నేను మాత్రము
రావణు గోరను. మీ రింత దూరము పలుక నేల?
(ఛిన్నా భిన్నా విభక్తావా దీప్తే వాగ్ని ప్రదీపితా
రావణం నోపతిష్టేయం కిం ప్రలాపేన వశ్చిరం)
ఇట్లు వావిడిచి, యేడ్చియేడ్చి, యంతులేనిదుఃఖముచే
దలవాల్చి, సీత కుమిలికుమిలి విలపింప దొడగెను.
(ప్రసక్తా శ్రుముఖీత్యేవం బ్రువంతీ జనకాత్మజా
అధోముఖముఖీ బాలా విలప్తు ముపచక్రమే)
ఈ విలాపమున నున్మత్తురాలివలె - భ్రాంతచిత్తవలె
ధరణీతలమున బడి దొరలసాగెను.

'నా కీ జీవితమేల ? ధనము లేల ? భూషణము లేల ?
మహారథుడగు రాముడు చెంత లేక యీ రాకాసుల
నడుమనున్న నాకు వీనితో బ్రయోజనమేమి ?
(నహిమే జీవితై రర్థో నైవార్థై ర్నచ భూషణైః
వసంత్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథం)
'ఇట్టి యవస్థలోనున్న నన్ను రక్షింప రాముడేలరాడు?
అతనికి నే లంకలోనున్నట్లు దెలియునో! లేదో! తెలిసియే
యున్నచో నతడిచ్చటికివచ్చి యీ రాక్షసుని జంపి నన్ను
రక్షింపకుండడు. లేక నావియోగమును సహింపజాలక
యీతడు మరణించి యుండడుగదా ! లేక రావణాధ
ముడు కపటోపాయములతో దాశరథుల కేమేని యెగ్గు
చేసి యుండునా ? లేక ధర్మపరాయణుడగు రాముడు
ధర్మమునంద దన దృష్టినిలిపి నాయెడ నుపేక్షాభావము
వహించియుండునా ? లేక వనముల గందమూలాశన
మొనర్చుచు వారస్త్రీసన్న్యాసముచేసి తిరుగుచుండిరా ?
ఏమైనను నాకిచ్చిన యీ గడువు దీతినంతనే నన్ను వీరు
చంపుట నిశ్చయము. ఈ దుష్ట రక్షస్సుల చేతిలోజిక్కి
యసువులు విడుచుటకంటె నురివేసికొనియో, గరళము
దినియో మరణించుటమేలు' అని తన్నుగూర్చియు,
రాముని గూర్చియు దలపోయుచుండెను.

ఇంక లంకావాసుల దౌర్జన్యములు తలపున దగిలి నంతనే యిట్లు తలంపసాగెను.

'ఇందు దుశ్శకునములు పెక్కులగపడుచున్నవి. తత్ఫలముగ నిది యచిరకాలమున నశించుట నిశ్చయము.

(యాదృశా నీహ దృశ్యంతే లంకాయా మశుభాని వై
అచిరేణతుకాలేన భవిష్యతి హతప్రభా)

'పుణ్యకార్యదూరమైన యీ లంక తనరాజు మరణింపగా మగడుపోయిన మగువవలె నగుటదప్పదు.

(భవిష్యతి పురీలంకా నష్ట భర్తృ యథాంగనా)

'మరియు నీలంక రామబాణాగ్నిచే నిర్దగ్ధముగాక తప్పదు.

(భవిష్యతి పురీలంకా నిర్దగ్ధా రామసాయకైః)

'దీని కంత కాలము సమీపించినది;

(సమయో యస్తు నిర్దిష్ట స్తస్య కాలోఽయ మాగతః)'

ఈరీతిని వివిధ భావతరంగ పరంపరలలో- నిస్పృహ, నిరాశ, కోపము, దుఃఖము - మున్నగు వానిలో-మునిగి తేలుచుండెను.

ఈమె యిటులుండగా సీతా రక్షకులగు రాక్షసీ సమూహము రావణ సమీపమున కరిగి సీతా భక్షణ మునకు దమకు సెలవిమ్మని యభ్యర్థించిరి.

అంతట త్రిజటానామక రైతేయి వారల వారించుచు తనకు గల్గిన స్వప్నము నిట్లు వివరించినది.

'గజదంతమయమగు నొక పల్లకి యున్నది. వేల కొలది హంసలు దానిని జుట్టుకొని యున్నవి. అందు శుక్లమాల్యాంబర ధరుడై తన తమ్ముడగు లక్ష్మణునితో గూడి రాముడు సుఖాసీనుడై యున్నాడు. ఈ సీత క్షీర సముద్ర మధ్యమునందలి శ్వేత పర్వత శిఖరమున నున్న ట్లాతని చెంత - భాస్కరునితో జేరి ప్రభ యుండునట్లు - గూరుచున్నది. శైలోపమమగు చతుర్దంత మహా గజ ముపై రాముడు లక్ష్మణునితో నధిరోహించి యున్నాడు. అప్పుడు సీతయు నాగజముపై రాముని చెంగట జేరి కూర్చున్నది.'

'ఇక నీ రావణుడో! దేహమునకు రైలమలదికొని, రక్తవసనములుగట్టి, నూనె ద్రావుచు, నెడలు దెలియక, వలువలు నల్లబడగా బోడితలలతో నొక కాంతచే నీడ్వ బడి, విమానమునుండి నేలబడి, ఖర రథముపై దక్షిణ దిక్కునకు బయనించెను.'

'లంకావినాశమున కిది లక్షణమగును. కావున మీరు సీతను రక్షింపుడు; చంపదలచుకొన్నచో నన్ను జంపుడు.'

అని త్రిజట తన స్వప్నవృత్తాంతమును, దత్ఫలమును, దానిమీద వారి కర్తవ్యమును బోధించెను.

స్వప్నములుగూడ నెకొక్కప్పుడు సత్యములే యగుచుండును. సృష్టి వికాస విధానమే యొక స్వప్న మనియు వేదాంతు లనుచుందురు. సత్య మీ స్వప్న సృష్టియే యనియు గొందఱు చెప్పుచుందురు. మన యాత్మ జాగ్రదవస్థలో కొన్ని సుఖదుఃఖములకు వశమగునట్టులే స్వప్నావస్థయందును గొన్ని సుఖ దుఃఖములకు వశమగు చుండును. కనుక జాగ్రదవస్థలోనివి సత్యములగునట్టులే స్వప్నావస్థయందలివియు సత్యములు గావచ్చును' అని వారు నుడువుచుందురు.

వ్యాధి పీడితులకును, నిరంతర చింతాపరతంత్రులకును వచ్చు కలలు నితాంత మసత్యములు. ఆరోగ్యవంతులు, శాంతమనస్కులు నగువారికి-అందును వేకువజామున-వచ్చు కలలు పైవానివలె కేవలాసత్యములనుటకు వీలు లేదందురు.

త్రిజట యిప్పుడు గన్నది వేగుజాము కల. దానికి జింతయు, వంతయులేదు; రోగమును, ఓప్పును లేదు. కనుక నీకల సత్యము గావచ్చునని మనము విశ్వసింప వచ్చును.

స్వప్నములు సూచకములు. ఈ సూచన భూతమునకు గానీ, భావికిగానీ కావచ్చును. అయోధ్యాకాండములోని భరతుని స్వప్నమును బరిశీలింపుము. ఈ నాటి త్రిజటా స్వప్నము భవిష్యత్సూచకము. ఈ కల సీత గాంచుట కంటె రక్కసియగు త్రిజట గాంచుటయే సముచితము గదా! పై స్వప్నమున రాముడు దాల్చిన శ్వేతాంబ రాదులు శుభసూచకములు. అందును నెక్క వస్తువు మాత్రముగాదు; క్షీరసముద్రము, అందు శ్వేత పర్వతము, దానిపై శ్వేతచతుర్దంతదంతి, శ్వేతమాల్యాంబ రాదులతో దానిపై రామలక్ష్మణుల యధిరోహణము, సీత రామాంకగత యగుట, సూర్యచంద్రులను దాకుట యిత్యాది సర్వమును కల్యాణసూచకమే యగును. ఇట్టి వేషాలంకారములతో డనే విభీషణుడు వారిననుకరించెను. ఇక రావణవిషయమున సంఘటిల్లిన యెల్ల విషయములు నశుభసూచకములే. వానితోబాటు కుంభకర్ణ డొంటె మీదను, నింద్రజిత్తు మొసలిమీదను నెక్క దక్షిణ దిశాభి ముఖులై తరలిరట!'

త్రిజట రాక్షసస్త్రీలను మందలించి నిరాశాగ్రస్తయై యున్న సీత నభినందించెను.

ఆ విషయములన్నియు సత్యమేయని యప్పు డా జానకీ వామ చక్షువు, వామ బాహువు, వామోరువు నదరుచు ధ్రువపఱిచెను.

ఈవామభాగకంపనము స్త్రీలకు శుభసూచకములనుట సాముద్రిక శాస్త్రప్రసిద్ధమేగదా!

తనకు గాననగుచున్న శుభ శకునములకు జానకి కెంత సంతసము గల్గుచున్నను నెడ నెడ నిరాశయు గల్గుచునే యుండెను. అట్టి యవసరములలో 'రాముడు తన్ను గైకొనిపోవడేమో!' యనియు, 'నాత డన్యస్త్రీల నేమైన నాదరించుచున్నాడేమో!' యనియు దలంపులు గలుగ నామె యా భావమున కడలి, యాత్మహత్య నెనర్చు కొన నుద్దేశించి, చెంతనున్న శింశుపా వృక్షమునుజేరి తన వేణీబంధముతో నురివేసికొన జూచుచుండెను.

(ఉద్బధ్యవే ణ్యుద్గ్రథనేన శీఘ్ర
మహం గమిష్యామి యమస్య మూలం)

చూచుచు దన మనస్సున రామ లక్ష్మణుల దలంచుకొనెను.

(తస్యాస్తు రామం ప్రవిచింతయంత్యా
రామానుజం స్వంచ కులం శుభాంగ్యాః)

'తా నట్టి యుత్తమ కులమున బుట్టియు, నట్టి యుత్తమ కులమున మెట్టియు, రామునంతటి వానికి

భార్య యయ్యు దుదకిట్టి గతికి బాలుగావలసి వచ్చినది గదా!' యనియు నాసమయమున రామలక్ష్మణులను, దన కులమును స్మరియించి యుండనగును. తన యాత్మ హత్య వారి కెల్లరకు నపకీర్తి దాయక మగునేమో! యనియు నామె దలంచుచుండును. ఎడ నెడ దనకు దోచిన శుభశకునముల వలని యాశయు మనస్సున నామెకు మెదలుచునే యుండెను.

ఇట్టిశుభశకునసూచిత సత్ఫలము నామెయొకమాఱు-తన వివాహ కాలమున - అనుభవించియే యుండెను.

జనకుడు సీతా వివాహమునకు శివధనుర్భంగమును బణముగా నేర్పఱచి యుండెను. ఆస్వయంవర మహోత్సవమునకు రాజపుత్ర లెల్లరును సమావేశమైరి. పెక్కురు రాకుమారులు ధనుస్సమీపమునకు వచ్చి, యత్నించి, యది తమ తరముగామిచే దలలువంచుకొని తలగుచుండిరి.

ఇంతలో రాము డరుదెంచెను. అతడు నూనూగు మీసములవాడు; మధురమూర్తి. ఆతనిని జూచుచున్నంత సేపును దన తండ్రి యింత కఠిన పణము నేల యేర్పఱి చెనా! యని సీత తన చిత్తమున జింతింపదొడగినది.

(కమఠ పృష్ఠ కఠోర మిదం ధనుః
మధుర మూర్తి రసౌ రఘునందనః

కథ మధిజ్య మనేన విధీయతాం
అహహా ! తాత ! పణస్తవ దారుణః)

—హనుమన్నాటకము

అయినను దన శకునములు దెలిపినట్లా మె యుద్దేశము ఫలియించినది. రాము డా విల్లు విఱిచి యా మె పాణి గ్రహణ మొనర్చెను.

ఇంతదాక జరుగుచున్న విషయములనెల్ల హనుమం తుడు గమనించుచునే యుండెను.

అట్టి డోలాయమానాందోలనా స్థితియం దున్న యా బిడ నవలోకించి యాతడి ట్లనుకొనెను.

'ఆహా ! వేలకొలది వానర వీరులు వెదకుచున్న సతీ రత్నమగు సీతాదేవిని నేను గాంచగల్గితిని. ఆ మహా పతి వ్రత నిట్టి సమయమున నూఱడించుట యుచితము.

(అహ మాశ్వాసయా మ్యేనాం పూర్ణచంద్రనిభాననాం)

లేకున్న ననర్థములు పెక్కు-లు గల్గవచ్చును.

(అనాశ్వాస్య గమిష్యామి దోష వద్గమనం భవేత్)

'నేను సంభాషించిన సౌందర్య సంపదయు, దాన గుణమును సంరక్షితములగును. మఱియు నే నిప్పుడు మాటలాడకున్నచో పరిత్రాణ మెఱుగక సీతాదేవి తన ప్రాణములు పరిత్యజింపవచ్చును.

(పరిత్రాణ మవిందంతీ జానకీ జీవితం త్యజేత్)

'మటియు సీతా దర్శన లాలసుడగు శ్రీరాముని నాశ్వా సించుట న్యాయ్యముగదా!

(మయాచ సమహాబాహుః పూర్ణచంద్ర నిభాననః
సమాశ్వాసయితుం న్యాయ్యా స్సీతా దర్శన లాలసః)

ఈ రాత్రి ముగియుసరి కీమె ప్రాణములు విడుచుట నిశ్చంశయము. ఈమెతో మాటలాడక శ్రీరామునితో నే నేమి చెప్పుదును? లేక నే నేగి సుగ్రీవ సైన్యమును గైకొని వత్తు ననుకొన్నచో నీ నడుమన యీమె ప్రాణములు వీడవచ్చును. కనుక నీమెతో నిప్పుడ సంభాషించుట లెస్స. కాని యీ సంభాషణ మీ దానవాంగనల యెదుట దగదు.

'నేను వానరుడను; ఈ రూపమున నీమెతో మాటలాడుట మంచిదిగాదు. మటియు సంస్కృతమున సంభాషించినచో నీమె భయపడి నన్ను మాయారూప రావణునిగా భావింపవచ్చును. కనుక మనుష్య భాషతోడనే మాటలాడ దగును.

'అట్లయిన నీమె నా రూప భాషలను సంశయించి కేకలు వెట్టినచో రాక్షసు లెల్లరు గుమిగూడుదురు. నన్ను రావణు నెదుటికి గొంపోదురు. దానిమీద నెంతటి

యనర్థకములైన గలుగవచ్చును. ఇతనితో నా కిప్పుడ
సమరము సంభవించినచో ఫలితమేమగునో తెలియదు.
'యుద్ధములో జయాపజయములు చంచలములు. సంశ
యార్థమునకు సన్నద్ధపడుట సముచితముకాదు. నిస్సంశ
యమగు కార్యమునే ప్రాజ్ఞుడొనరించును.'
(అసత్యాని చ యుద్ధాని సంశయో మే నరోచతే
కశ్చ నిస్సంశయం కార్యం కుర్యాత్ ప్రాజ్ఞః ససంశయం)
అని యూహించి 'పుణ్య చరిత్రుడును, సీతాబంధు
డును నగు రాముని స్మరించుచు, రామ గత మానస
యగు నీమెను జంకువొందకుండ నెనర్తును.'
(రామ మక్లిష్టకర్మాణం స్వబంధు మను కీర్తయ
నైనా ముద్వేజయిష్యామి తద్బంధు గత మానసాం)
అని నిశ్చయించి శింశుపా వృక్షశాఖాంతర స్థితు
డయిన యా హనుమంతుడు సుగంధిల పుష్పములను
జల్లినట్లు సత్యమగు వాక్యములతో మధురముగ శ్రీరామ
చరిత్రమును సంగ్రహముగ గీర్తించెను.
రామగాథ మహత్త్వ పూరితము. భక్తిదాయక
మును, నిధానమును. భక్తియే శ్రద్ధను, మాధుర్యమును
సమకూర్చును. ఈ భక్తిని, మాధుర్యమును ప్రసాదింప
గల్గునది రామ మంత్రము.

తలవని తలంపుగ - రామ మహాత్వ్యము చెవినిబడ్డ -
ఆ రామామణి కప్పు డానందముప్పొంగెను. వాడ
బాటిన తీగ కమృతము పోసినట్లయి యామె యత్యా
శ్చర్యముతో దనమొగము పైకెత్తి వికసన్నేత్రములతో
నా వృక్షశాఖలవంక చేతి పరికించెను. పరికించి యందు
సుగ్రీవామాత్యుని-వాతాత్మజుని - ఉదయగిరియందున్న
సూర్యునివలె దిలకించెను.

(దదర్శ పింగాధిపతే రమాత్యం
వాతాత్మజం సూర్య మివోదయస్థం)

ఇంతకాలముదాక సీత -గాఢాంధకార వశమున కన్ను
గానకున్న మానిసివోలె - ఆశాలేశమయిన లేక యలమ
టించుచున్నది. అట్టి యా సీత కిప్పు డరుణోదయమైన
ట్లయినది. సీతాపహరణము జరిగిననాటినుండియు సత్య
మును, పరాక్రమును, ధర్మమును రూపుమాసిపోయినవి.
హనుమానుడు కీర్తించిన యీరామగాథ సుప్రభాతమును
సూచించు కుక్కుటారావమువలెనే దీర్ఘమగు నామె
దుఃఖరాత్రి కవసాన గీతిక నాలాపించుచున్నది. హను
మద్దర్శనమను నరుణోదయ మయినది గదా! ఇక
సూర్యోదయము కాక యుండునా యేమి!

హనుమంతు నాకార మొక యపురూప మయినది. "దేహమున దెల్లనివస్త్రములు ధరించియున్నాడు; విద్యు త్సమూహమువంటి పచ్చని రంగు; వినయభావము తొణ కుచున్న ముఖము; ప్రియములగు మాటలు; వికసించిన యశోక పుష్పముల మొత్తము వంటి కాంతి; మేలిమి బంగరువలె మిల మిల మెఱయుచున్న కన్నులు.

(తత శ్శాఖాంతరే లీనం దృష్ట్వా చలితమానసా
వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాత పింగళం
సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినం
ఫుల్లాశోకోత్కరాభాసం తప్త చామీకరేక్షణం)

ఆ యాకారమును గాంచినంతన యామె మానసము జలదరించినది; ఆశ్చర్యము మున్మరమయినది. ఆభీమ రూపము నవలోకింప నామెకు బెదరు జనించినది. ఇట్టి రూపము జూడదగదే! యని కలతపాటు చెందినది.

రామలక్ష్మణులను దలచుకొని మందస్వరమున మిగుల రోదనము చేసెను. చేసిచేసి 'యీసంఘటనము సత్య మేయై యుండునా? లేక స్వప్న మేమైన గాంచితినా?

(మైథిలీ చింతయామాస స్వప్నో ఽయ మితి భామినీ)

'స్వప్న మే యైనచో జాగ్రదవస్థలో నెట్లు కలుగును? కనుక నిది స్వప్నమై యుండదు. 'రామ! రామ!' యని

నిరంతరము తదేక ధ్యానముతో రాముని దలచుచు

(రామేతి రామేతి సదైవ బుద్ధ్యా
విచింత్య వాచాబ్రువతీ తమేవ)

'జివికిపోవుచున్న నాకు నిద్రయే లేదే! కన్ను మూయనిది కలయెట్లువచ్చును? సర్వభావములు నాతనియంద లగ్నమై పరపీడిత నగుచున్న నాకు నిద్ర యెక్కడినుండివచ్చినది?'

(సంపీడితా తద్గత సర్వభావా)

అని పలుదెఱగుల నామె చింతింపసాగెను.

పతివ్రతా తపోదీక్షనీ లక్షణములు లెస్సగ బ్రకటించు చున్నవి. ఇది మనోవాక్కాయముల యేకీకరణ ఫలితమే. ఇదియే 'శశ్వ'త్తపస్సనబడుచుండును. చూడుడు.

'మనోవాక్కా-యములచే - ముద్విధములుగ - దేవేం
ద్రునంతటి వానిని గడగడలాడ జేయు నా మహర్షి తప
స్సున కంతరాయ మెట్లును లేదు.'

(కాయేన వాచా మనసాపి శశ్వత్
య త్సంభృతం వాసవ ధైర్యలోపి
ఆపాద్యతే న వ్యయ మంతరాయైః
కశ్చి న్మహాన్హేః త్రివిధం తపస్తత్;

—కాళిదాసు.

ఇట్టి తీవ్ర తపఃఫలితమే సిద్ధి. అట్టి తపస్సిద్ధి యింత లం తలగలుగనున్నదని యీలక్షణములు సూచించుచున్నవి.

'ఇది కలయుగాదు, వైష్ణవమాయయుగాదు; యథా ర్థమే. ఈ కానబడుచున్నది కపిరూపమే' యని సీత తన మనస్సును గుదురుపఱచుకొని హనుమంతుడు చెప్పినదెల్ల సత్యముగావలయునని దేవతలకు నమస్కరించుకొనెను. అప్పుడు హనుమాను డల్లన యా వృక్షమునుండి దిగివచ్చి యామె యెదుట గేలోగ్గిన నిల్చి యామె విషయము నామె చేతనే చెప్పింపదలచి యాతడడిగెను.

'అమ్మా! నీ వెవ్వరవో స్పష్టముగ దెలియజాల కున్నాను. సురాసుర నాగగంధర్వ రక్షో యక్షకిన్నరాం గనలలో నొక్కతెవా? నా దృష్టి కొకమానవ కన్యవుగా గానబడుచున్నావు. అందునను నీ వొక రాచకన్నెవయి యుందు వనుకొనుచున్నాను.

'సౌభాగ్యవతీ! లేదమ్మ్మ! తేకులవంటి నీ కన్నుదోయి నుండి శోకజలము స్రవియించుచున్నదేమి?

(కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజం
పుండరీక పలాశాభ్యాం విప్రకీర్ణ మివోదకం)

'నీ దైన్యమును, అతి మానుషరూపమును, తపోవేష మును జూచి రామమహిషివగు సీత వనుకొనుచున్నాను.

(యథా హి తవవై దైన్యం రూపం చా ప్యతిమానుషం
తపసా చాన్వితో వేషః త్వం రామమహిషీ ధ్రువం)

'నీకు శుభమగునుగాక!' (సీతా త్వ మసి భద్రంతే!) హనుమంతున కామె సీతయని తెలియును. దీర్ఘ కాలము నుండి యామెను గమనించుచునే యున్నాడు. అయి నను రావణుమును, రాక్షసస్త్రీలును నెనర్చిన యవినీతి ప్రసంగమును దా నాలకించినట్లు తెలిసినచో సతీరత్న మగు సీత సంతపింపవచ్చును. కావున నాతడావిషయము దా నెరిగినట్లు మాటలాడక నూతనాగతునివలె నామెతో 'నీ వెవ్వర'వని పలుకరించుట సముచితమే యగును.

శ్రీరామకీర్తన మెనర్చుచున్న యాతనిజూచి తమ విషయములను సంగ్రహముగ - తనతల్లిదండ్రులు, అత్త మామలు, తనకల్యాణము, కైకవరము, తమ యటవీ ప్రయాణము మున్న గునంశములెల్ల దెల్పి జానకియిట్లనెను.

'రాముడు సత్యపరాక్రముడు; తాను దానమిచ్చును గాని ప్రతిగ్రహింపడు. తన ప్రాణముమీదికి వచ్చినను నప్రియము నావంతయేని బలుకడు.

(దద్యాన్న ప్రతిగృహ్ణీయాన్న బ్రూయా త్కించి దప్రియం
అపి జీవిత హేతో ర్వా రామ స్సత్యపరాక్రమః)

'అతనిని వీడిన స్వర్గమైనను నాకు రుచింపదు; కనుక నతనికంటె ముందుగనే నేను నరణ్యమునకు బైలుదేరితిని.

(సాహం తస్యాగ్రత స్తూర్ణం ప్రస్థితా వనచారిణీ
నహి తే తేన హీనాయా వాసః స్వర్గేఽపి రోచతే)

'అటనుండగా నన్నీ రాక్షసు డపహరించుకొనివచ్చి, యిచ్చటనుంచి యిక నాకు రెండునెలలు గడువిచ్చినాడు. అప్పుడు నేనీ లోకము వీడక తప్పదు.'

(ద్వామాసా తేన మే కాలో జీవితానుగ్రహః కృతః
ఊర్ధ్వందాభ్యాంతుమాసాభ్యాంతతః త్యక్ష్యామిజీవితం)

:—'వైదేహి! రామునియొద్దనుండి సందేశమును గైకొని నేను నీచెంత కరుదెంచితిని. ఆతనికి కుశలము. ఆ శుభవార్త నాతడు నీకు జెప్పుమనియెను. నీక్షేమము నాతడు దెలియ దహతహలాడుచున్నాడు.

(అహం రామస్య సందేశా ద్దేవి దూతస్త్వాగతః
వైదేహి కుశలీ రామః త్వాంచ కౌశల మబ్రవీత్
స త్వాం దాశరథీరామో దేవి కౌశలమబ్రవీత్)

'యాదృచ్ఛికముగ నాపదపాలయిన ప్రాణులకు మున్మందు దెల్పదగినది కుశలవార్తయే గదా!

పూర్వాభాష్యం సులభ విపదాం ప్రాణినా మేతదేవ)

—కాళిదాసు.

'మహాతేజస్కుడును, నీభర్తకనుచరుడును, ప్రియుడును శోకసంతప్తుడునైన లక్ష్మణుడో జానకీ నీకు దలతో మ్రొక్కినాడు.

(లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽనుచరః ప్రియః
కృతవాఞ్ఛోకసంతప్త శ్శిరసా తేఽభివాదనం)

'బ్రదికియున్న వాడు - నూఱేండ్లకైన సరియే యానందము ననుభవింపగలడనుట సత్యము.'

(కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే
ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి)

శ్రీరామ లక్ష్మణుల క్షేమవార్త నాలించి సీతాదేవి హర్షపులకితయైనది. అయ్యను 'నీతడు రావణుడగునో! యేమో!' యని యనుమానించినది.

ఈ యనుమానము నాంజనేయుడు దెలిసికొని రామ లక్ష్మణులను బ్రశంసించెను. రావణవధ మత్యంత సమీప మునసే యున్నదని యాతడు పూర్వసంఘటన ప్రశంసా పూర్వకముగ నామెకు నమ్మబలికెను.

:— 'ఆహా! స్వప్నమైనను నీ సంఘటన మెంత సుఖ దాయకముగా నున్నది! రాఘవుడు పంపిన యీ వాన రుని నేడుగదా నేను జూడగల్గితిని!'

(అహోస్వప్నస్యసుఖతా యాఽహమేవం చిరాహృతా
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసం)

'స్వప్నముననేని రాఘవుని, లక్ష్మణుని నేను జూడగల్గు
దునా! చూడగల్గినచో నాకింత దుఃఖముండదుగదా!
ఈకలయు నిట్లు చిరముగానుండక నాయెడ మచ్చరమున
నున్న ట్లున్నది.'

(స్వప్నేపి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణం
పశ్యేయం నావసీదేయం స్వప్నోఽపి మమ మత్సరీ)

అప్పుడు సీత యాతని బరీక్షింప నెంచి యిట్లు పల్కెను.

:— 'వానరా! నీకు రామలక్ష్మణుల స్నేహ మెట్ల యినది? నీవు వారి నెఱిగినచో నా రామ లక్ష్మణుల లక్షణములను దెల్పి నాకు సంతుష్టిని గల్పింపుము.

(కథం తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణం
యాని రామస్య లింగాని లక్ష్మణస్యచ వానర!)

ఆంజనేయుడల్లన నీ రీతిని బలికెను.

'వైదేహి! రాముడు కమల పత్రాక్షుడు; సర్వజీవ మనోహరుడు; సౌందర్య దాక్షిణ్య సంపన్నుడు.

(రామః కమలపత్రాక్షః సర్వ సత్త్వ మనోహరః
రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే)

'తన నిర్మల ప్రవర్తనమును, పవిత్ర ధర్మమును గాపాడుకొనువాడు; శత్రు సంతాపకుడు.'

(రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః)

ఇత్యాదిగా పెక్కు విధముల నతని దేహ గుణ స్వభావాదులను వర్ణించి లక్ష్మణునిగూర్చి యిట్లు ప్రశంసించెను.

'అతని మాఱుదమ్ముడగు లక్ష్మణుడు - సుమిత్రా నందను డపరాజితుడు; అనురాగమునను, రూపమునను, గుణములన్ను రాముని యట్టివాడు.

(భ్రాతాచ తస్య ద్వైమాత్ర స్సౌమిత్రి రపరాజితః
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః)

'వారిద్దఱు నీకొఱకు వసుంధరనెల్ల గాలించుచున్నారు. అట్లు గాలించుచు గాలించుచు వచ్చి కిష్కింధా పట్టణములో వానర రాజగు సుగ్రీవుని గాంచినారు. వారలకు నా మూలమున బరిచయమైనది.

'జనక నందినీ! నిన్ను రావణు డపహరించుకొని వచ్చునప్పుడు నీమేన నున్న యాభరణములను దీసి క్రింద బడవైచితివిగదా! సుగ్రీవుడు వానిని దెచ్చి దుఃఖించుచున్న శ్రీరామునికి జూపినాడు. కాని మేము నీగమన వివరమును దెలిసికొనజాలకపోయితిమి.

(తతః త్వద్ధాత్ర శోభీని రక్షసా హ్రియమాణయా
యా న్యాభరణ జాలాని పాతితాని మహీతలే
తాని సర్వాణి రామాయ ఆనీయ హరి యూథపాః
సంహృష్టా దర్శయామాసు ర్గతిం తు నవిదు స్తవ)

'వానినిజూచి రాముడు బహుభంగుల దుఃఖించినాడు.
నిన్ను బాసిన నాటినుండియు నాతడు మహాగ్నిచే
నగ్ని పర్వతము తపించినట్లు తపించుచున్నాడు.

(మహతా జ్వలతా నిత్య మగ్నినే వాగ్ని పర్వతః)

'మహాభూకంపము వలన బర్వతము చలియించునట్లు
ఆతడు చలించుచున్నాడు.

(మహతా భూమి కంపేన మహానివ శిలోచ్చయః)

'జానకీ! నీ వియోగచింతచే వేగుచున్న యాతడు
కమనీయకాననములను జూచిగానీ, మనోహర ప్రవా
హములను గాంచిగానీ సంతోషము నెందుటలేదు.

(కాననాని సురమ్యాణి నదీః ప్రస్రవణానిచ
చర న్నరతి మాప్నోతి త్వా మపశ్య న్నృపాత్మజే)

'మనుజశార్దూలుడగు రాముడు వచ్చి బంధు మిత్ర
లతో రావణువధియించి యచిరకాలమున నిన్నుగైకొనును.

(స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః
సమిత్ర బాంధవం హత్వా రావణం జనకాత్మజే)

'ఇట్టి రామునికి, సుగ్రీవునికి నే నపుడు మైత్రి సంఘ టిల్ల జేసితిని. నా పేరు హనుమంతుడు. వారికి దూతనై నే డిచ్చటికి వచ్చితిని.

(రామసుగ్రీవయో రైక్యం దే వ్యేవం సమజాయత
హనుమంతంచ మాం విద్ధి తయో ర్దూత మిహాగతం)

'నేను వాయుపుత్రుడను. కనుక నాకును నాతండ్రి యంతటి శక్తిసామర్థ్యము లున్నవి. నా యొనర్చిన కృత్య ముల మూలమునసే నాకీహనుమన్నామము వచ్చినది.

(హనుమానితి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా)

'అమ్మా! వీరశ్రేష్ఠుడగు నీ భర్త - రాముడు-కుశల ముగానున్నాడు. సోదర సేవాపరాయణుడు - సులక్షణ యుతుడు నగు లక్ష్మణునకును గుశలమే.

(కుశలీ తవ కాకుత్థ స్సర్వశస్త్రభృతాం వరః
గురో రారాధనే యుక్తో లక్ష్మణశ్చ సులక్షణః)

'మహావీర్యుడగు రాముడు రాక్షసాధిపతియగు నీరావ ణుని శీఘ్రకాలమునసే చంపి నిన్ను జేపట్టును.'

(రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వా మభిపత్స్యతే
సమిత్ర బాంధవం హత్వా రావణం రాక్షసాధిపం)

సీత హనుమంతుని విశ్వసించినది. ఆమె కానందము గల్గినది. వంగిన కన్ను బొమ్మలుగల యామె కన్నుదమ్ముల

నుండి యానందాతిశయముచే జలజల నశ్రువులు రాలినవి.

(నేత్రాభ్యాం వక్రపద్మాభ్యాం ముమోచానందజం జలం)

కొనలయం దెఱుపుగల్గిన తెల్లని విశాల నేత్రములు గల యామె వదనబింబ మప్పుడు రాహుగ్రహమునుండి బయటబడిన చంద్రబింబమువలె బ్రకాశించినది.

(చారు తద్వదనం తస్యా స్తామ్రశుక్లాయతేక్షణం
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్)

'దేవి! రామనామాంకితమగు నీయంగుళీయముజూడుము.

(రామనామాంకితం చేదం పశ్య దే వ్యంగుళీయకం)

'నీ విశ్వాసముకొఱ కామహాత్ముడు నాకు దీనినిచ్చినాడు.'

(ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా)

అని వినయ వాక్యములతో సీతా ప్రత్యయము నభిలషించి యా యంగుళీయకము నర్పించెను.

అప్పుడు జానకి నిజభర్తృ హస్త విభూషణమును గాంచుచు దాని గొని భర్తనుజూచినట్లు మోదమందెను.

(గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కర విభూషణం
భర్తార మివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్)

ఈ యుంగరమునుగూర్చి యొక సంఘటనము జెప్పుదురు. అది యిది. 'ఒకానొకప్పుడు సీతాదేవి ప్రణయకలహమువలన రామునితోడ మాటలాడక యున్నదట!

శ్రీరాము డీ విరహ వేదన నూర్వజాలక సీతతో మాట లాడ వాంఛించుచుండెనట! కొంతసేపటి కాతడు తన ప్రేలనున్న యీ యుంగరమును మెల్లమెల్లగ నేలవీడ జార్చెనట! సీత దానింగని యెత్తి యాతని కొసగినదట!

సీత యీ యుంగరము నిప్పుడు దృష్టించి, యీనాటి రాముని విషయము, నాతని హస్తపల్లవమును, భుజార్గళ మును, దివ్య సుందర విగ్రహమును సంస్మరించి నేడు తన కాతడే ప్రత్యక్షమైన ట్లుంగరమును జూచి సమ్మో దము నందినదట!'

ప్రపంచసారస్వతమున - భారత సారస్వతమున నంగు ళీయమునకు బవిత్ర స్థానముగలదు. అభిజ్ఞాన శాకుంతల మున శకుంతలకు దుష్యంతుడంగుళీయకము నిచ్చి వెళ్లు టయు, నది ప్రమాదమునజాఱుటయు, దరువాత నామె కష్టముల పాలగుటయు మనము చదువుచునే యుందుము.

అట్లే యిప్పు డీ నామముద్రికయే సీతకు హనుమ ద్విశ్వాసము గల్గించినది.

ఆ కాలమున లిపి లేదనువారు దీనిని గమనించిరా?

నామమునను గొప్ప మహత్త్వమున్నది. ఒక వ్యక్తి యాదరణ పాత్రమగునట్లే తన్నామము నాదరయోగ్య మగుననుట కిది యొక ప్రబలోదాహరణము. కొన్ని

యెడల వ్యక్తి కంటె నతని నామమే మిన్న యగుననియు ననదగును. వ్యక్తి నశింపవచ్చును గాని నామ మనశ్వరము. వాచ్యము - పదార్థము - తన్ను గాంచువారికి గొందఱకు సంతృప్తి గల్గింపగల్గును గాని నామమో - సుదూర దేశగతులకుగూడ నానందమునుగూర్పగల్గును. వ్యక్తిపార్థివ ప్రధానము; నామము నాద ప్రధానముగదా!

సీత యాతని బ్రశంసించినది.

:—'హనుమ! నీవు శూరుడవు; సమర్థుడవు; ప్రాజ్ఞుడవు. నీ వొంటరిగనే వచ్చి యీ రాక్షస స్థానమును లెక్కగొనక నన్ను గనిపట్టితివి.

'శతయోజన విస్తీర్ణమగు నీ మకరాలయమును శ్లాఘనీయమగు విక్రమముచే గోష్పదముగా నెనర్చితివి.'

(శతయోజన విస్తీర్ణ స్సాగరో మకరాలయః
విక్రమ శ్లాఘనీయేన క్రమతా గోష్పదీ కృతః)

అని మరియు సీతయిట్లు పలికెను.

:— 'హనుమా ! రామ లక్ష్మణులు సురానీకమును నిగ్రహించువారయ్యు నా దుఃఖమున కంతము లేకుండుట విపరీతము. రాముడు వ్యధనొందుట లేదుగదా! తన కార్య ములయందజాగరితుడు కాడుగదా ! ఆతడు తన మిత్రుల యెడ సామదానములను రెండుపాయములను, శత్రువు

లెడల భేదదండములను రెండు పాయములను జక్కగ
బ్రయోగించుచున్నాడుగదా !

(ద్వివిధం త్రివిధోపాయ ముపాయ మపిసేవతే
విజిగీషు సుహృత్కచ్చి న్మిత్రేషు చ పరంతపః)

'అతడు మిత్రుల నేమైన జేర్చుకొను చున్నాడా? వారిచే నాదరింపబడుచున్నాడా? దేవతల యనుగ్రహము నారాధించుచున్నాడా? అతనికి దైవబలమును, పురుష కారమును నున్నవిగదా ! దూరముగ నున్న నా యెడల రామునకు స్నేహభావము తఱుగుటలేదుగదా ! ఆంజ నేయా! ఆతడున న్నీ కష్టమునుండి విడిపించునా! హనుమ! నా నిమిత్తము దుఃఖించి దుఃఖించి రాముడు చిక్కి-పో లేదుగదా ! ఇదిగో వానర! భ్రాతృవత్సలుడగు భర తుడు భయంకరమగు తన యక్షౌహిణీ సైన్యమును నా నిమిత్తము బంపునా? హనుమంత ! శ్రీరామునికి నా మీద నున్నంత ప్రేమ తన తల్లిమీదగానీ, తండ్రిమీద గానీ, యితరుల మీదగానీ లేదునుమా ! దానిని దలచు కొనియు, నాతని కుశలము దెలియ దలచియునే నేనింత దాక జీవించుచున్నాను.'

(న చాస్య మాతా నపితాచ నాన్యత్
స్నేహా ద్విశిష్టోఽస్తి మయా సమో వా

తావ త్త్వాహం దూత ! జిజీవిషేయం
యావత్ ప్రవృత్తిం శ్రుణుయాం ప్రియస్య)

ప్రేమమయములు, మధురములు, మనోహరములు నగు నీ జానకీ వచనముల నాలించి యాంజనేయుడు తల మీది కైమోడ్పుతో నిట్లు పలికెను.

:— 'సీత! రాము డిచ్చటికి వచ్చి యీ లంకను నిర్దానవ మొనర్చును సుమా!

(కరిష్యతి పురీం లంకాం కాకుత్థ్సః శాంతరాక్షసాం)

'ఈ ప్రయత్నమున మృత్యుదేవత యడ్డమువచ్చినను, దేవాసురులడ్డమువచ్చినను సరియే వారిని వధించి నిన్ను గైకొనిపోవుట నిశ్చయము సుమా!'

(తత్ర యద్యంతరామృత్యుః యది దేవా స్సహాఽసురాః స్థాస్యంతి పథి రామస్య స తానపి వధిష్యతి)

పైన బలికిన సీతా వచనము లర్థప్రధానములు. అవి రాజనీతి సంయుక్తములు. చతురుపాయముల నాదరింపని రాజు శత్రువుల జయించుననుటకల్ల. ఆవేశమో, యావేదనమో యున్నమాత్రమున నయ్యెడిదేమి యుండును? కనుకనే యీమె యీ విషయములనెల్ల బరామర్శించినది. అట్టి రాజకీయవిషయముల నెఱుగుట క్షత్రియకులమున

బుట్టి, వీరాధివీరుని కిల్లాలయిన సీత కది సహజము. చేప పిల్లల కీత నేర్పవలయునా ?

హనుమదాక్యములలో నర్థగాంభీర్యము తక్కువ. కావున నవి శబ్దప్రధానములు.

సీత తన కన్నుదమ్మ్ముల నశ్రుజలములు గ్రమ్మగా 'నాంజనేయ ! నాకున్న గడువు మటి రెండుమాసములే గదా!' అని దైన్యముగ బలెక్-ను.

ఆంజ:— 'వైదేహి ! నీవు చింతిల్లకుము. రాముడు మహాసైన్య సమేతుడై యిచ్చటికి తప్పక వచ్చును. నీ వనుమానింపకుము. లేదా నిన్నిప్పుడే యీ దుఃఖము నుండి తప్పింతును; నా వీపుమీద గూరుచుండుము.

(అథవా మోచయిష్యామి త్వా మద్యైవ వరాననే
అస్మా ద్దుఃఖా దుపారోహ మమపృష్ఠ మనిందితే)

'నిన్ను దీసికొనియేగి రామున కిప్పుడ యొప్పగింతును. ఈ రావణునితోగూడ నీ లంకనుగూడ నే నెత్తుకొని పోవ గల్గుదును జుమా !

(శక్తిరస్తిహి మే వోఢుం లంకా మపి స రావణం)

'చంద్రుతో రోహిణివలె రాముతో నీవు సంతసింపవచ్చు.'

(యోగ మన్విచ్ఛ రామేణ శశాంకే నేవ రోహిణీ!)

ఆ మాటల కానందము నొందియు జనక నందిని సంకో
చమున నాతనితో బల్కెను.

'హనుమ! ఇంతదూరము నన్నెట్లు మోయగలవు?
ఈ వచనము నీ వానరత్వమును జూపుచున్నది.

(హనుమ న్దూర మధ్వానం కథం మాం వోఢు మిచ్ఛసి
తదేవ ఖలు తే మన్యే కపిత్వమ్ హరి యూథప)

'ఇంత యల్పశరీరుడవగు నీ విచ్చటినుండి నన్నెట్లు
గైకొనిపోవ గల్గుదువు?'

(కథం వాఽల్పశరీరః త్వం మా మితో నేతు మిచ్ఛసి)

ఈ మాట హనుమంతున కొక యవమానకరమైనది.
ఆ యవమానము బాపుకొనుటకై ఆతడు తన దేహమును
బెంచిపెంచి, మేరు పర్వతమువలెనయి, తన మహత్త్వ
మున కహంకరించుచు నామె యెదుటనిల్చి, యామెను
దన వీపుపై నధిష్ఠింప నభ్యర్థించెను.

ఇది మహారూప ప్రదర్శనము. శ్రీకృష్ణుడు తా నర్జు
నునకు, దుర్యోధనునకు విశ్వరూపము బ్రదర్శించుట
మహాభారతమునందును, యశోదాదేవికి బ్రదర్శించుట
భాగవతమునందును మనము చూచుచుందుము. ఇది
విశ్వరూప ప్రదర్శనము గాకున్నను మహారూప ప్రద

ర్శన మగును. ఆ మహారూపమున కాశ్చర్యభావ మలము కొనగా నామె యిట్లు పలికెను.

: 'వానరోత్తమ! నీ వంత శక్తిశాలి వగుట నిస్సంశయము. కాని నీ వాకసమున నెగిరిపోవు నప్పుడు భయార్తనై నేను క్రిందబడి పోవచ్చును గదా!

(ప్రపతేయం హి తే పృష్ఠా దభయార్తా కపిసత్తమ!)

'లేక సముద్రముదాటి పోవుచున్న నిన్ను వెన్నాడి నీతో నీప్రుక్కడి రక్కసులు పోరాడునప్పుడేని నేను బడిపోవచ్చును. వారు నన్ను గొనివచ్చి మరల రావణున కొప్పగింపవచ్చును. అప్పుడెంతఘోరమేని జరుగవచ్చును. అంతియకాదు; మఱియొక్క రహస్యమున్నది. పతిభక్తిని బురస్కరించుకొని రాముని గాక మఱియొక పురుషుని దేహమును నేను దాకజాలను.

(భర్తృ భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర!
న స్పృశామి శరీరంతు పుంసో వానర పుంగవ!)

'నన్ను గొనివచ్చునప్పుడు రావణుడు నన్ను దాకినాడు. కాని నేనప్పుడుస్మృతిలేక వివశనై యున్నాను. అప్పుడు నే నేమి చేయగలను?

(యదహం గాత్ర సంస్పర్శం రావణస్య బలార్దితా
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ)

'అదియునుగాక, రాముడు తానై యిటకువచ్చి సబాం
ధవముగ నీ రావణు జంపి నన్ను గొనిపోవుట యాతని సత్య
పరాక్రమమునకు దగునుగాని నన్ను నీవు గైకొనిపోవుట
యాతని కవమానదాయకముగాదా!

(యది రామో దశగ్రీవ మిహ హత్వా సబాంధవం
మా మితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్)

'కనుక నో హరిశ్రేష్ఠ! నీవేగి రాముని ససైన్యముగ
గొనివచ్చి నాకు సంతోషము గల్గింపుము.'

హను:—దేవి! నీ పల్కులు స్త్రీ స్వభావమునకును,
సాధ్వీలక్షణములకును, వినయ గుణమునకును నెంతయు
సదృశములుగా నున్నవి.

(యుక్తరూపం త్వయాదేవి భాషితం శుభదర్శనే
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్యచ)

'వైదేహి! రాముని దక్క మఱియొక పురుషునంటనని
పల్కుట నీక చెల్లినది గాని నీవు వినా మఱి యెవ్వరిట్టి
మాటలు పల్కగలరు?

(ఏత త్తే దేవి సదృశం పత్న్యా స్తస్య మహాత్మనః
కాహ్యన్యా త్వాంబుతే దేవి బ్రూయాదేవచనమీదృశం)

'సతీ తిలకమా! నీ విప్పుడు నావెంట రా నిచ్చగింప
నిచో రాముడు దెలియదగిన యొక చిహ్నము నాకిమ్ము.'

(యది నోత్సహసే యాతుం మయా సార్ధ మనిందితే!
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయా ద్రాఘువో హి తత్)

సీత యీ మాటలనువినుచు గద్గద కంఠముతో కాకాసురగాథదెల్పి, రామలక్ష్మణులను ప్రశంసించి, తన చీర కొంగున ముడిచి యుంచిన దివ్యమును, శుభమును నగు చూడామణిని రాముని కిమ్మని యీతని కొసగెను.

(తతోవస్త్రాగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభం
ప్రదేయో రాఘువాయేతి సీతా హనుమతే దదా)

అప్పుడామె తెలియబఱచిన కాకాసురకథ వీరరసప్రేరకము. ఆ కాకాసురుడు మదోన్మత్తుడు. మదము లష్ట విధములుగా బండితులు చెప్పుచుందురు. అవి అన్నజము, అర్థజము, కామజము, విద్యాజాతము, కులజము, రూపజము, ఉద్యోగ జాతము, యౌవనజాతము ననునవి. ఇందు స్త్రీకుల విద్యాజాతములు మూడును ముఖ్యములు.

ఇప్పుడా కాకాసురుని శ్రీమదమే కామ మదముగ బరిణమించినది. కనుకనే యతడు సీతా వక్షోభాగమును దన ముక్కుతో బొడిచి గాయపఱచెను. ఆతడు న్యాయ దృష్టిగానీ, ధర్మదృష్టిగానీ లేక వక్రదృష్టితో మాంస పిండములుగా దలచి యామెను నెప్పించినాడు.

తత్క్షణమున నతడు రామబాణమునకు గురియై, దిక్కులెల్లదిరిగియు దిక్కులేకతుదకురామునే శరణమర్థించి, తన కన్నెటి యిచ్చి ప్రాణములు గాపాడు కొన్నాడు.

అట్టి శరణాగత రక్షకుడు తన్ను రక్షింపక యుపేక్షించి యెట్లుండ గలడు? అని యూజానకి విశ్వాస పూర్వకముగ బల్క-నది.

కాకాసురఘట్టము సీతారాములరణ్యమున నున్నప్పుడు జరిగినది. ఆ విషయ మితరులకు దెలియబఱచుట సీతకు గానీ, రామునికి గానీ యుచితము గాదు. కనుకనే యది యింతకాలము దాక నెవ్వరికి నెఱుక పడలేదు. అయిన నిప్పుడు తెలుపక సీతకు దప్పలేదు. సతీపతు లేకాంతమున నున్నయెడ జరిగిన సంఘటనముకంటె పరస్పరము దెలియ బఱచుకొనగల యభిజ్ఞాన మేమి యుండగలదు?

:—'లక్ష్మణుడో! రాముని దనతండ్రివలె, నన్ను దన తల్లివలె గొలుచువాడు.

(పిత్ర వదవ్యర్తతే రామే మాత్రవన్ మాం సమాచరన్)

'అతని క్షేమము నడిగితినని చెప్పుము.'

(స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనాన్మమ)

ఈ సందర్భమున నరణ్యావాస ప్రయాణ సమయమున లక్ష్మణునకు ఆతని తల్లి సుమిత్రాదేవి చేసిన హితోపదేశము స్మరణకు రాకతప్పదు.

'కుమార! లక్ష్మణ! అరణ్యమున రాముని దశరథుని గను, సీతను నన్నుగను భావించి కొలుచుచుండుము సుమా!'

(రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం)

సుమిత్ర చేసిన హిత మపురశఃసత్యమైన ట్లెఱుగ గలము. రాముడంపిన యంగుళీయకము హస్తమున ధరింపబడునది గావున నది పరాక్రమమును సూచించును. ఆత డిప్పుడు ప్రదర్శింపవలయు గుణము పరాక్రమమే గదా! ఇంక సీత పంపిన రత్నమో! శిరోధార్యము. శిరస్సు ప్రణతిని బ్రదర్శించును గావున నది సీతా శరణాగత భావమును వెల్లడించును.

ఆ చూడారత్నము నందికొని దాని నాతడు తనవ్రేల దాల్పగనే యాతని యందొక నూత నోత్సాహము, ఒకనూతనశక్తి, ఒకనూతనతేజస్సు ప్రకటితములయ్యెను.

రామాయణమునందు మణి మంత్రౌషధములు శక్తి దాయకములుగ-ప్రభావ నిధానములుగ బ్రకటింపబడినవి.

మణులు శక్తి నెసగుట మనమిప్పుడు చూచితిమి. రాము నకు శక్తినిచ్చిన మంత్రము 'నాదిత్య హృదయము'న గాంచగలము. ఇకనౌషధ శక్తియో ! సంగర రంగమున ననువులు వీడిన లక్ష్మణాదుల నాంజనేయుడు రక్షించు పట్టున గాననగును.

పాతివ్రత్యమహిమవలన బ్రభావము జనించును. సిద్ధులు జన్మౌషధి మంత్ర తపస్సమాధి సిద్ధులని యైదు విధము లుగా నుండును. మణి యిందుపలక్షితము.

(జన్మౌషధిమంత్ర తపస్సమాధి సిద్ధయః)

ఈసిద్ధి ప్రభావ ఫలమునసే వాయుపుత్రుడు దన మాన సమున సుఖశాంతుల బడయగలిగెను.

అంతట నా వానర పుంగవు డా చూడామణి గ్రహి యించి, ప్రదక్షిణపూర్వకముగ నామె కభివాదన మొన రించి, సీతాదర్శనమువలని మహా సంతోషముతో బునఃప్రయాణమున కుంకించెను.

పవమాన సూనుడు పైనమగుచుండగా సీత మఱియు నిట్లు పల్కెను.

'వానరోత్తమ ! నీ మాటల మీదనే నా జీవితమెల్ల యాధారపడి యున్నది.

'హనుమ ! నేను జీవించి యుండునట్లు కీర్తిశాలియగు రాముడెట్లు చేయునో అట్టివాక్యము లాతనికి జెప్పి పుణ్యము గట్టుకొనుము.

(జీవంతీం మాం యథారామః సంభావయతి కీర్తిమాన్
తత్తథా హనుమ న్వాచ్యం వాచాధర్మ మవాప్నుహి)

'అయినను నీవు నేటికి విశ్రమించి రేపు వెడలరాదా? నీ వున్నందువలన నా దుఃఖము కొంత శమించుచున్నది. ఆంజనేయ ! మటియొక్క మాట ! ఈ మహాసముద్ర మును దాటుటకు నీకును, నీతండ్రియగు వాయువునకును, గరుత్మంతునకు మాత్రమే శక్తిగలదుగదా ! మఱి రామలక్ష్మణులు దీని నెట్లు దాటగల్లుదురు ? ఈ రాక్షస సమూహమును జంపి నన్ను రక్షింప నీవొక్కడవే సమర్థుడవు. మఱి యీ దుష్టులనుజంపి నన్ను గైకొని పోయిన కీర్తి రామునికి దక్కింపుము. అదియే నాకును గీర్తి దాయకము.'

(శతైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః
మాం నయే ద్యది కాకుత్స్థః తత్తస్య సదృశం భవేత్)

ఆంజనేయు డామె యుద్దేశము నాకళింపు చేసికొని యామె నిట్లూశ్వాసించెను.

'తల్లీ! నీవు చింతవీడుము. రామలక్ష్మణులను నా వీపు మీద నెక్కించుకొనియేని నిక్కడకుగొని తెత్తును. వారికి సహాయ మొనర్ప సుగ్రీవుని వానరబల మపరిమితముగ నున్నది. అందు నాకు దుల్యులును, నన్ను మీఱినవారే గాని నాకంటె దక్కువ వాడొక్కడును లేడు.

(మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః
మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తి సుగ్రీవ సన్నిధౌ)

'నా వంటివాడే యీ సముద్రమును దాటిరాగా నా కంటె బలశాలులమాట జెప్పనేల? రాజు లిట్టి యెడల సామాన్యులను ముందు బంపుదురుగాని ప్రకృష్టులను బంపరుగదా!

(అహం తావదిహ ప్రాప్తః కింపున స్తే మహాబలాః
నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరేజనాః)

'కనుక తల్లీ నీవు దుఃఖమును మానుము.'

ఈ మాటలెల్ల మారుతి వినయమునకు మచ్చుతున కలు. ఇవి యసత్యములని యనరాదు; అడకువనే ప్రదర్శించును. సంశయగ్రస్త యయిన జానకీదేవికి ధైర్యోత్సాహములను బురికొల్ప బలికిన పల్కులు. హనుమంతుని ప్రయాణ సమయమున సీత మఱియొక గుర్తు చెప్పెను. 'ఒకప్పుడు నా తిలకము చెదఱిపోగా మణిశిలను

తాచి యా గంధముతో నాకపోలతలమున రాముడు తిల
కము దిద్దినాడు. ఈ విషయముగూడ నీ వాతనితో
బల్కు–ము.

(మనశ్శిలాయాస్తిలకో గండ పార్శ్వే నివేశితః
త్వయా ప్రణష్టేతిలకే తం కిల స్మర్తు మర్హసి)

రామునిగూర్చి జానకి మఱియు నిట్లు పలెకు–ను.

'రామ! నే నెక్క–నెలనాళ్లు ప్రాణములు చిక్క–బట్టు
కొందును. నీవు లేనిచో నీ నెలదాటి నేనుజీవింపను.

(ధారయిష్యామి మాసంతు జీవితం శత్రుసూదన!
మాసాదూర్ధ్వం న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ!)

'వానరోత్తమ! ఈ క్రూర రాక్షసులు నన్ను బెట్టు
హింసలును, నేను పడుచున్న పాట్లును రామునికి విపుల
ముగ జెప్పవలయునుజుమా! పోయిరమ్ము. నీకు మార్గ
మధ్యమున భద్రమగునుగాక!

(శివశ్చతేఽధ్వాస్తు హరిప్రవీర!)

అని మఱిమఱిల బలికి యాతని బంపలేక పంపలేక
సెలవిచ్చి పంపెను.

జానకీ విశేషము

జానకి మానవీ గర్భమున జనియింపలేదు. నికృష్ట
మగు గర్భవాస దుఃఖ మామెయెఱుగదు. ఆమెజన్మించి

నది పవిత్రమగు యజ్ఞక్షేత్రమున. ఆమె జన్మకాలము గూడ యజ్ఞనిర్వహణ ప్రయత్నసమయము. ఇట్టి పవిత్ర మగు క్షేత్రమురొక్కయు, సమయము రొక్కయు ఫలితముగనే యామె పవిత్రమగు యజ్ఞమువలె బ్రభ వించినది. యజ్ఞక్షేత్రమును, యజ్ఞప్రయత్నమును పరిప క్వమై ఫలియింపగా యజ్ఞ ముత్పన్నమగునుగాని యన్య మెట్లుత్పన్న మగును? కనుక సీత రొక యజ్ఞమూర్తి.

యజ్ఞమనగా మేకలను, గొట్టెలను జంపునది గాదు; గుట్టముతోడనో, మతి దేనితోడనో గూడునదియు గాదు; రంభతోడనో, యూర్వశి తోడనో భోగించు నదియుగాదు; అది రొక పవిత్రతా స్వరూపము.

ఇట్టిది యజ్ఞతత్త్వము. గౌతమ బుద్ధుని కాలము నందున్నవియు, కొన్ని కావ్య పురాణాదులలో వర్ణితము లైనవియు నగు యజ్ఞములు సనాతనములుగానీ, తత్వ సిద్ధములుగానీ కావు. కాక వికార రూపము లందినవి. వీనినిజూచి సనాతన యజ్ఞస్వరూపముల నూహించుట ప్రమాదమగును.

ఇట్టివానిలో గొన్నింటి నొకొక్కప్పుడు కొందఱు సత్పురుషు లొక్కతావున సమావేశమై చేయుచుందు వారు. ఫలాపేక్షతోడను నొక కొన్నిటిని జేయుచుందు

వారు. అందుల కర్హమగు నట్లనుకూల ప్రదేశమును బాగుచేయు చుండువారు. జనకు డొనర్చిన యట్టి ప్రయత్నమే సీతాలాభమునకు హేతువైనది.

ఇక సీత పితృదేవుడు జనకుడు. అతడొక యుత్తమ శ్రేణికి జెందిన రాజర్షి; ఉత్తమ పురుషుడు.

ఒక కాలమున మన భారతమునందలి బ్రాహ్మణులు పరమాత్మ ప్రాప్తికి కర్మ సన్న్యాసయోగమును బ్రధాన ముగ జెప్పుచు, దాము దానినే యవలంబించుచువచ్చినారు.

కాని రాజ్యపాలకులగు రాజుల కీ మార్గము రుచింప లేదు. ఆముష్మి కాశతో నైహికమును ద్యజించుట అనగా నాత్మ ప్రాప్తి నాసించి తమ కర్తవ్యములన్ గట్టి పెట్టుట దేశ నాశమునకు గారణమగునని వారు విశ్వసించినారు. కనుకనే వారు కర్మసన్న్యాసము నెప్పుకొనక ఫలసన్యాస రూపమగు యోగము నవలంబించి, -తా మొనరింపవలయు కార్యములను ఫలము నాసింపక-నిష్కామ బుద్ధితో నెనర్చుచుండువారు. దీని మూలమున నుభయ లోకములను శుభములు పడయవచ్చునని వారి నిర్ణయము. భగవద్గీత యిట్టి యోగమునే బోధించుచున్నదని సాంప్రదాయికాభిమానములను వీడి నిష్పాక్షికముగ జదివినవారికెల్ల దెల్లము గాగలదు. ఇదియే

రాజయోగము. ఇది యోగములలో రాజత్వము బడయుటయేగాక ప్రధానముగ రాజు లాదరించిన యోగమగుటచే రాజయోగమై యున్నదని యూహించుటకు బలవంతములగు కారణములు గాననగుచున్నవి.

ఇట్టి విజ్ఞానశాలియగు జనకుని యంకతలమున బెరిగిన సీత నిష్క-లంక చరిత్ర యగుటలో ననుమాన మేమి యుండును? ఆ కాలమునందలి తాత్త్విక విజ్ఞానమున కాతని రాజధానీ, దేశాదుల మిథిలా విదేహాది నామములే ప్రబల సాక్ష్యములు. విదేహ యన దేహములేనిది; మిథిలయన నశాశ్వతమైనది.

ఈమె పూర్వజన్మమున కృశధ్వజునికొమార్త. ఈమె పేరప్పుడు వేదవతి. తండ్రియగు కృశధ్వజుడు వేదము పఠించుచుండగ - సూతికా గృహమున వేదనాదములు వీనుల బడుచుండగా - జన్మించుటచే నీమె వేదవతి యయ్యెనట!

కావున నీమె వేదవిజ్ఞాన ఫలమని మన మూహింప వచ్చును. కనుకనే యీయమ వేదసారములగు నియమ వ్రతాదుల మూర్తియై పతివ్రతా లోకమున ప్రఖ్యాతి గన్నది.

వేదమునకు పరమ పురుషునితో నిరంతర సంబంధ ముండుట స్పష్టమే యగును. కావున సీతకు బురుపోత్త మునితోడి పొత్తు విధిప్రేరితము.

వేదవతి తన్ను గోరి తాకవచ్చిన రావణు నిరాకరించి, విష్ణువును బెండ్లాడ నిశ్చయించి, యోగాగ్నియందు దగ్ధమై యిప్పు డయోనిజగా నుద్భవించినది.

ఈమె పాతివ్రత్య పాటవము చేవమీఱి, జిగిదేఱి యున్నది. వేదవిజ్ఞానమువలననే భగవంతుని చెంత జేర గల్గునట్లు సీతామూలమునసే శ్రీరాముని జేరగల్గుదుమని వైష్ణవులందురు.

రాహుగ్రస్తయగు చంద్రబింబమువలె సీత రావణాప హృతయై, రాముని చెంతలేక కొంతకాలము గడపినను నామె మానసము మాత్రము రామదూరముగా లేదు. కనుకనే సూర్యునికి వేఱుగాని కాంతివలె తాను రాము నికి వేఱుగానని యామె చెప్పికొనియున్నది.

(అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభాయథా)

ఈ విషయమును శ్రీరాముడు నిదే యుపమాన ముతో జెప్పుట గమనార్హము.

(అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభాయథా)

ఈ యనన్యత్వమునే పరాశర మహర్షియు నిట్లు వర్ణించి యున్నాడు. 'శ్రీదేవి రామావతారమున సీత యైనది. కృష్ణజన్మమున రుక్మిణి యైనది. ఇతరావతార ములయందును నీమె విష్ణువున కనపాయినియై యున్నది.'

(రాఘవత్వే భవేత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని
ఇతరేషు చావతారేషు విష్ణో రేషానపాయినీ)

—విష్ణు పురాణము

సూర్యునివీడి సహజ ప్రభ మఱియొక వస్తువు నెట్లా శ్రయింపగలదు? కనుకనే సీత నీరమునుండి వెలువడిన మీనమువలె రామునికి దూరమై తపతపలాడి తపించి పోయినది. సీతామహత్త్వమున కిదియొక గీటురాయి.

'జానకి యెచ్చట నున్నదో చూచిర'మ్మనియే రాము సుగ్రీవులు హనుమంతున కానతిచ్చిరి. కాని యాతడు 'చూచిరమ్మన్న గాల్చివచ్చెను'గదా! అందుల కతని ప్రభువుల యాజ్ఞ లేదు. కావున నాతడట్టి స్వాతంత్ర్యము గైకొన నర్హమా? యని కొందఱనవచ్చును.

ఆతని కాపని యొనర్ప నాజ్ఞలేదు నిజమేగాని 'యా కార్య మొనర్పరా'దను నిషేధమును లేదుగదా! విధి నిషేధములు లేని కార్యములు యథాభిమతముగ నెనర్చు

టకు బ్రతివానికిని స్వాతంత్ర్యమున్నది. హనుమ ద్వేష యమున మన మిప్పు డాలోచించుచున్న విధి నిషేధ ములు రాజకీయములుగాని నైతికములు కావు సుడీ !

అశోకవన భంగము

హనుమంతుడు శమదమాది సుగుణసంపత్తిగల బ్రహ్మ చారియందుమే! అట్టివానికీ యశోకవన భంగ కార్య మర్హ మగునా ? యని యొక ధర్మసందేహము గలుగవచ్చును. హనుమంతుడొనర్చినయశోకవనభంగముసమర్థనీయమా? యనుట రాజనైతికముగ విచారింపదగినది. సామాన్య నీతికిని, రాజనీతికిని గొంత భేదము గలదనుట వింతగాదు.

బ్రహ్మయనగా వేదము. వేదాధ్యయనరతుడు గాన నతడు బ్రహ్మచారి యయ్యెను. (బ్రహ్మణి చరతీతి) బ్రహ్మ యనగా నింద్రియ నిగ్రహమనిగూడ నర్థము. కావుననే విజితేంద్రియుడును బ్రహ్మచారియే యగును.

ఈ బ్రహ్మచర్యమునకు ఫలము వీర్యలాభము.

(బ్రహ్మ చర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః)

అని పతంజలి మహర్షి వచియించి యున్నాడు.

వీర్యము ద్వివిధము. తన కామమును లోబఱచు కొనుట యొకటి; ఇది యాధ్యాత్మికము. తన శత్రువుల

నడచి వారిని వశమొనర్చుకొనుట మఱియొకటి; ఇది యాధిభౌతికము.

ఆంజనేయుని యం దీ యిరుదెఱగుల వీర్య సంపదయు సమృద్ధముగ గలదు. రావణ శయ్యాగారమున మైమఱచి నిద్రించుచున్న సుందరీ బృందమును గాంచియు గలత నొందకుండుట యితని నిర్జితేంద్రియత్వమును నిరూపింప జాలును. ఇక భౌతిక వీర్యప్రాభవమును, స్వీయ పరాక్రమసంపత్తిని నీ యశోకవన భంగము, రాక్షస సంహారము ప్రకటించెను. ఈ ప్రకటనములోని ముఖ్యోద్దేశము తన పక్షువారి బలమును, రాక్షసుల దౌర్బల్యమును బ్రకటించుటయు, నట్టి భయముచేతనేని రావణుడు పశ్చాత్తాపతప్తుడై సీతను రామునకొసగి, తన చేసిన దోషమునెఱిగి, తన్ను మన్నింప రాముని శరణుగోరునట్లు చేయవలయుననియే కాని వేఱొక యుద్దేశముగానరాదు.

సీతను జూచుట (దృష్టేఽయ మసి తేక్షణా) యాత నికి బ్రధాన - అంగి - విషయము. హనుమానుడు దీని నిప్పటికే సాధించి యుండెను. ఇక నప్రధాన - అంగ-విషయములు కొన్ని సాధింప నాత డుత్సుకు డాయెను. కనుకనే యాతడు సామదాన భేదములను వీడి యంతట బలప్రయోగమునకు బ్రయత్నించెను.

(త్రీ నుపాయా నతిక్రమ్య చతుర్థీ ఇహ విద్యతే)

ఆతడు రామలక్ష్మణుల మాటలను బట్టియే కాక సీత దన్ను చుట్టుముట్టి పలు దెఱగుల బీడించుచున్న దానవకృత బాధల ననుభవించుచుండియు దన వ్రతపాటవము జాటు చుండుట గాంచి కూడ నామె పాతివ్రత్య మహిమము నవగతము చేసికొనెను. కనుకనే తర్వాత నాతడు దను జుల బలదర్పముల నెకింత దెలిసికొన దలపోసెను.

'దుష్టరక్షస్సులయెడల సామోపాయము సముచితము గాదు; ధనాదులచే మత్తిల్లియున్న వారియెడల దానము ప్రయోజనకారి గాదు; బలదర్పితులగు జనులయెడల భేదము కార్యసాధకముగాదు; పరాక్రమ ప్రదర్శనమే నాకు నచ్చుచున్నది.'

(న సామ రక్షస్సు గుణాయ కల్పతే
నదాన మర్థోపచితేషు యుజ్యతే
న భేద సాధ్యా బలదర్పితా జనాః
పరాక్రమస్త్వేవ మమేహ రోచతే)

'చేయవలసిన కార్యము పూర్తియైన పిమ్మట బెక్కు కార్యముల నెనర్పవలయును. ఐనను పూర్వకార్యమున కవిరోధముగ నుండు వానినే యొనర్పదగును.'

(కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్
పూర్వకార్యాఽ విరోధేన సకార్యం కర్తు మర్హతి)

'ఏదేనికార్యము సాధించుటకు సాధకములగు హేతువు లనేకములుండును. ఆ యర్థమును బహుభంగుల దెలియు వాడే యా ప్రయోజనమును సానుకూలముచేయ సమర్థు డగును.'

(న హ్యేకస్సాధకో హేతుః స్వల్పస్యా పీఽహ కర్మణః
యోహ్యర్థం బహుధావేద స సమర్థోఽర్థ సాధనే)

దూతయే కానిండు; సామాన్య మానవుడే కానిండు. తన ప్రధాన కార్యములకు భంగము గల్గని రీతిగా నితర కార్యములను సాధింపపలయును. అట్లు సాధించువాడే సమర్థుడు. అతడే సంపూర్ణ కార్యసాధకుడు.

రాక్షసులలో సామ ప్రేమకంటె సంహార ప్రేమ యెక్కువ. వారికి క్రౌర్యమే తెలియునుగాని కారుణ్యము తెలియదు. వారి కర్థమగునట్లుగా - వారిని రెచ్చగొట్టు టకే వాయుసూనుడు తలపోసెను. కనుకనే యాత డశోకవన భంగమునకు గడంగెను. - 'మాయావుల యెడల మాయనేప్రయోగింపవలయును. కాని వారియెడ నమాయికులుగ నున్నవారు పరాభవము నందుదురు.'

(ప్రజంతి తే మూఢధియః పరాభవం
భవంతి మాయావిషు యే నమాయినః)

—కిరాతార్జునీయము

ఆంజనేయు డొనరించిన యశోకవన భంగము రావ
ణున కావేశముగల్గించి యాతని గోపమూర్తిగ జేయు
టలో నాశ్చర్య ముండబోదు. సీతవంటి మహాపతివ్రతా
శోకమునకుగారకమైన యశోకవనమును భంగముచేయుట
నైతికముగ సమంజసమే యగును. బంగరుపాత్రమేని
సజ్జన మారణ కారణమైన విషపూరితమగుచో బ్రద్దలు
గొట్టదగినదే కదా! అట్టిదే యశోకవనము.

కనుకనే సీతా సమ్ముఖమున ప్రశాంత మలయమారు
తమువలె మెలగిన మారుతి యిప్పుడు భీమ విక్రముడై,
ప్రచండ మారుతమువలె దీప్రతముడై మహత్తరమగు
తన యూరు వేగముచే నచ్చటనున్న చెట్లను బెటికివేయ
నారంభించెను. వృక్షభంగము వలని పెళపెళలు, పక్షి
సంతతుల కోలాహలము, రాక్షసుల హాహా కారములు
చేరి లంకా రాజ్యలక్ష్మి చేయుచున్న యార్తనాదమువలె
దోచదొడగినది. నిగృహీతేంద్రియు లంతియేకదా!
సాధుత్వ మవసరమైన తావుల సాధుత్వమును, ఉగ్రత్వ
మవసరమైన తావుల నుగ్రత్వమును జూపుచుందురు.

మేఘములను జూడమా ! యవి యొక్కడ ప్రాణాధార మగు చల్లనియుదకము నిచ్చును; మఱి యొక్కడ ప్రాణ హారక మగు బెడిదపు బిడుగులను బడవేయును.

(అశనే రమృతస్య చోభయో
ర్వశిన శ్చాంబుధరాశ్చయోనయః)

యతులు,నియమవ్రతులు నిగ్రహానుగ్రహ సమర్థులగుదు రనుటలో వింత యేమియుండును !

'అశోక లతాప్రధానమయిన యా వనభూమి యాంజ నేయుని యాధ్వత్యమునకు బాల్పడి శోక లతాప్రధాన మైనది. దశాస్యుని యా ప్రమదావనమున కిప్పుడు ప్రమ దాదశ గల్గినది.'

ఇది విచారకర దృశ్యము. కళకళలాడు మనో మోహనమగు నశోకవన మొకింత కాలములో భగ్నమై రావణ చిత్తమునకు శోకము గూర్చినది.

సుందరమగు నా వనభంగముతో నందలి లతాగృహ ములు నష్టప్రాయములైనవి. చిత్రాగారములు చెదఱి ఛిన్నభిన్నములయినవి. రావణుడు భోగి; సుకుమా రుడు; కళాప్రియుడు. ఎంతకాలమునుండియో యతని కళాపరిపాకమున కనుకూలముగ తీర్చిదిద్దిన యా వనము

తన శోభారూపమునుగోల్పోయినది. పసుపుమాటి పూల మొత్తముతో మిసమిసలాడు తంగెడు పొదరువంటి పండుమువత్తెదువ ఋణకాలములో నలంకార దూరయై, వితంతువై వికృతరూపము దాల్చినట్లుగా నది యాతని మనోవేదనా హేతువైనది.

హనుమంతు డా వనభంగముతో దన విక్రాంతికి విశ్రాంతి గల్పింపక తోరణ కవాటముపై కొక్కదుముకు దుమికెను. పురబహిః ద్వారమును తోరణ మందురు.

(తోరణోఽస్త్రీ బహిర్ద్వారం)

వానర విక్రమమును గాంచుచున్న రాక్షసులు తత్తఱి పాటుతో నీమహా ప్రళయమునకు గుండెలు బాదుకొనుచు కింకర్తవ్యతా మూఢులై సీతచెంతకు తొప్పుచు రోజుచు బరువెత్తి

'జానకీ! యెవ డీ వానరుడు ? వీడెవనివాడు? ఎచ్చటి నుండి వచ్చినాడు ? ఎందులకు ? ఇతడు నీతో మాట లాడు చున్నదేమి ?' అనిపెక్కు విధముల బ్రశ్నించిరి.

సీతయప్పుడు వారితో నిట్లనెను. 'భీమ రూపులగు రాక్షసుల విషయము నాకేమి తెలియును? పాముకాళ్లు పామునకే గాదా తెలియునది ! ఇతనిని జూచిన నాకును

జంకు గల్గుచున్నది. ఎవడో కామ రూపియగు రాక్షసుడై యుండును.'

(రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః
యూాయమేవాభిజానీత యోఽయం యద్వాకరిష్యతి
అహి రేవ హ్యా హేః పాదాన్విజానాతి న సంశయః
అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయం
వేదిరాక్షస మేవైనం కామరూపిణ మాగతం)

ఈ విషయమునే కావలిగత్తెలు రావణున కిట్లు దెలిపిరి.

'రాజ! భీమరూపుడగు వానరు డొక్క డశోకవన మధ్యమున కరుదెంచి, సీతతో మాటలాడి యచ్చట నున్నాడు. ఆతని విషయము నెంత యడిగినను నామె మాకు దెలుప నిచ్చగించుటలేదు.

(న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా
అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితు మిచ్ఛతి)

ఆతడెవ్వరి దూతయో తెలియదు. ఆతడుమీ ప్రమదా వనమునెల్ల పాడు చేసినాడు. కాని సీతయున్న ప్రదేశము నే మాత్రమును జెనకలేదు. ఆత డిట్లు జానకీ సంరక్షణా ర్థమే యొనరించెనో! లేక యంతటితో శ్రమచెందియే యట్లుంచెనో! అయిన నతనికి శ్రమ యెక్కడిది? సీతను రక్షింపనే యట్లుచేసి యుండును.'

(జానకీ రక్షణార్థం వా శ్రమాద్వా నోపలభ్యతే
అథవా కశ్రమ స్తస్య సైవ తే నాభిరక్షితా)

సీతాదేవి యున్న శింశుపా వృక్షమును, నశోకవృక్షమును నాశము చేయకుండుటలో నా మారుతి యుద్దేశమేదో మనకు స్పష్టముగ దెలియుచునే యున్నది. అవి యింత వఱకును సీతకు గొంత యారామము నెసగి కొంతధన్యత గూర్చుకొన్నవి; ఇంకను గొంతసేవ యొనర్ప వలసి యున్నవి. కనుక వానిని బాడు చేసినచో వైదేహి విశ్రమించుట కిక నాదరువే యుండదుగదా!

సీత యసత్య మాడినదా?

ఇచ్చట సీత యసత్యము పల్కినదని నైతికవాదులు, చరిత్రకారులు కొందఱు వాక్రుచ్చుచుందురు. ఈయాక్షేపణమున కాధారముగలదా? యని మన మొకింత వివరముగ నాలోచింతము.

అసత్యముచెప్పి యసురులను మోసము చేయవలయునని సీత కుద్దేశము లేదు. ఆమెకిది విషమసమస్యయైనది. ఈ సమస్య మీదనే యామె సౌహృద మాధారపడియున్నది. కనుకనే యామె యీ సందర్భమును వివరింప నిచ్చగింప లేదు. అట్టియెడ నాంజనేయుని విషయమునెల్ల వెలువరించుట వెడగుదన మగునుగాని వివేక మనిపించుకోదు.

కనుకనే సీత యాతనిగూర్చి ప్రకటింపలేదు. అందులకు గారణము ధర్మానుకూలమగు తన శీల రక్షణమే కాని పరవంచనముగాదు.

'ఇతడు కామరూపి యగు రాక్షసుడే యయియుండు నేమో!' యని సీత పల్కుట యా స్త్రీలను మోస పుచ్చుటకా? లేక వారిమూలమున రావణు మోసగించు టకా? తన పలికినపల్కులను వేదవాక్కులుగ రక్కసులు విశ్వసింతురను నమ్మకము సీతకుగలదా? వారిమాట వీడుడు. పోనీ! మనమైన నావిషయమువిశ్వసింపగలమా?

గతరాత్రి త్రిజట యొక కలగాంచెనుగదా! ఆమె తన స్వప్నగత దృశ్యములన్నెల్ల నా రక్కసులకు స్పష్ట పఱచినది గదా! చూడుడామె పల్కులు.

'రాత్రి నాకు గలలో రావణపాలితమగు లంక గన బడ్డది. దానిని రామదూత యగు వానరుడొకడు దగ్ధము చేసినాడు.'

(లంకా దృష్టామయా స్వప్నే రావణే నాభిరక్షితా
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా)

అట్లామె వివరించియుండగా నిష్ఫూడారక్కసులు మరల సీతను ప్రశ్నింపనేల? ప్రశ్నించిరేపో! ఆ విషయమును సమగ్రముగ సీతతో వారేల తర్కింపక పోయిరి?

'లంకా ప్రవేశనవనాటక సూత్రధారు'డగు హనుమంతుడు తాను లంకాపురమును జొచ్చినప్పుడు తన వృత్తాంతము నడిగిన లంకిణికి నాతడు విశదముగ బ్రత్యుత్తర మొసంగియుండెనా ? లేదు.

'నా వంక దేఁజిచూడకుము. నేనొక నిరపాయుడనగు ప్రేక్షకుడను. లంకను గాంచ నేతెంచితిని.'

చారవృత్తి నరుడెంచి తన విషయము వివరింపకుండుట హనుమంతునకు ధర్మమే. అట్లే బందిగనుండి పలు కష్టముల పాలగుచున్న సీతకును దన్ను నిరంతరము గని పట్టి కావలిగాయుచున్న రాక్షసులకు దన విషయము వివరింపవలసినయవసరముగలదా? అట్టిదిన్యాయమగునా? ఆమె యీ విషయము జూటకుండుట యసత్యమగునా ?

సీత యేదేని స్వార్థము నభిలషించి యట్లు పల్క లేదు. లేక 'అస్తి సూత్మ్రతరం కించి దత్ర' యని యనుమానించి యేదేని రహస్యకారణము నన్వేషింపగడంగినచో మనము సఫలులము కాగలమా ?

అసత్యమునకు మూలము భయము. సీత రాక్షసుల వలన జంకియున్నదా? లేక రావణువలన జంకియున్నదా? మతియు నామె దా నాత్మప్రాణరక్షణము నాసించి

యసత్యము లాడినదందుమా? అందుల కాధార మేమియు గానరాదు. ఆమెరావణుతో బల్క-నపల్కులు, చూపుము.

'రావణ! నాక్రోధాగ్నిలో నిన్ను భస్మము చేయ గలనుగాని రామునియాజ్ఞ లేకుండుట చేతను, తపోనిష్ఠా నుపాలనము చేతను నిన్ను నేదహించుట లేదు.'

(అసందేశాత్తు రామస్య తపస శ్చానుపాలనాత్
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా)

కనుకనామె యెవ్వరికిగానీ భయపడుట లేదని మన మనుకొనవచ్చును. లేక హనుమంతుని వారేమేని బాధిం తురని యామె చింతించె నందుమా! యదియు గాన రాదు. హనుమంతునితోడి యామె మాటల నాలింపుము.

'వానరరాజా! నీవు సామాన్య వానరుడవని నే నను కోను. రావణు వలనగూడ నీకు భయముగానీ, సంభ్ర మముగానీ లేదు.'

(న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ
యస్య తే నాస్తి సంత్రాసో రావణాన్నాపి సంభ్రమః)

హనుమంతు డామె యెదుట దన మహారూపము జూపకమున్ను పల్క-న పల్క-లివి. కాగా నాతడు తన పృథురూపమును జూపినవెనుక నాతని బలపరాక్రమము లపై నామెకు ప్రబలవిశ్వాసము గల్గినది. హనుమంతుడు

తన శక్తిపై దా నాధారపడి, తన్ను దా రక్షించుకొన దక్షత గలవాడని యామె విశ్వసించినది.

'కపీశ్వర! నీ సత్త్వమును, బలమును నాకు దెలి యును. నీకు వాయు సమానమగు గమనమును, నగ్ని తుల్యమగు నద్భుత తేజస్సును గలవు.'

(తవ సత్వం బలం చైవ విజానామి మహాకపే
వాయో రివ గతిం చాపి తేజశ్చాగ్నే రివాద్భుతం)

లేదా! రామకార్యభంగమగునని యామె జంకిన దందుమా! అట్లనుకొనుటకును నవకాశము లేదు. రాముని గూర్చి హనుమంతునితో నామె పల్కిన పల్కులు వినుడు.

'రాముడు సబాంధవముగ దశగ్రీవుని సంహరించి, తన బాణవర్షముచే లంక నాకుల మొనర్చి, నన్ను గ్రహించి యేగుట యతనికి దగును.'

(యది రామో దశగ్రీవ మిహ హత్వా సబాంధవం
మామితో గృహ్య గచ్ఛే త్తత్తస్య సదృశం భవేత్
శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః
మాం నయే ద్యది కాకుత్స్థ్ఃతత్తస్య సదృశం భవేత్)

కాబట్టి సీతకు రాముని బలపరాక్రమములపై ప్రబల విశ్వాసము గలదనుట నిశ్చయము.

సీత హనుమద్విషయ మసుర కాంతలకు దెలుపక
మున్నే హనుమంతు డశోకవన వినాశ మొనర్చెను.
ఈ వనభంగము రావణునకు దనరాక దెల్పుటకే యని
యాతడే స్పష్టముగ జెప్పియుండెను.

కనుక రావణు నెమటి కాతని గొనితెచ్చిన దాతని
సాహసకృత్యమేకాని యన్యముగాదు.

ఇక సీత యన్నత మూడవలసిన యగత్యమేమి ?

హనుమంతుడు దూతగను, చారుడుగను లంక
కేగెను. ఆతడు చేసినది సీతతో సంభాషించి నంతదాక
'చారశ్చ గూఢపురుషశ్చ' అన్న ట్టది చారకృత్యము.
తరువాత రావణ సమ్ముఖమున దాను వానర రాజగు
సుగ్రీవుని దూతనని పల్కుచు 'స్వా త్మందేశ హరో
దూతః' అన్నట్టు దూతకృత్యమును నిర్వహించెను.
కావున సీతతో నాతడు సంభాషించునంత దాక వాని
గమనముగానీ, యునికిగానీ, యితరవివరములుగానీ వెల్ల
డించుట రామకార్యమునకు హానిగల్గింపవచ్చును. అంత
దాకనే యాతనికి రహస్య మావశ్యకము. సీతచెంత
నుండి వెడలినంతట నాతని చారధర్మము పూర్తియైనది.
కాబట్టి సీత రాక్షసస్త్రీలయెదుట సర్వవిషయము సమగ్ర
ముగ జాటినను దనకు గష్టముగానీ, రామకార్యమునకు

నష్టముగానీ లేదు. అంతియగాదు; సీతాదర్శన మొన రించినవెనుక దాను నిర్వహింపబూనుకొన్న తన దౌత్య కృత్యమున దన విషయములను వివరముగ దెలుపుకొనుట యవసరమే యగును. ఆ విషయములు రామకార్యసిద్ధికి దోహదములే యగును. కావుననే యా పిమ్మట దనకు గల్గిన సర్వాతంకములను హనుమంతుడు దన కార్య సిద్ధికి సాధనములుగనే వినియోగించుకొనెను. వాలాగ్ర మున కగ్గి ముట్టించిన సందర్భ మిందులకొక ప్రబల నిదర్శనము.

జానకి దానవ స్త్రీలకు దాను సమాధాన మొసంగి నప్పు డాంజనేయు డే మొనర్చుచుండెనో, యాతడు దన మానసమున నే మాలోచించుచుండెనో యా మెకు దెలియదు. అయిన నొక్క-విషయము మాత్రము స్పష్టము. ఏమన : రామకార్యము సాధింప హనుమంతు డెల్లవిధముల నర్హాతముడు; ఆ కార్యనిర్వహణము నుద్దే శించియే యాత డంభోనిధి లంఘించి లంకాపురమున కరుదెంచినాడు.

హనుమంతుడు సీతాదర్శన మొనర్చిన యనంతరము తాను గూఢముగ జరియింపదలంపలేదు. కావుననే యాత డశోకవనమును భంగముసేయుచు, దానవుల

యెదుట దన దేహము బెంచుట తన బలపరాక్రమ పాటవమును వారికి బ్రదర్శించుటకే గదా! కాగా రామకార్యభంగము నాశంకించి జానకి యసత్యమాడె ననుటలో సందర్భశుద్ధి యేమాత్రము గానరాదు.

రామకార్యభంగము నాశంకించుట కొకప్పు డవకాశ ముండెడిది. ఎప్పుడన : హనుమంతుడు లంకాపురమున సీత నన్వేషించుచు శింశుపావృక్ష శాఖాంతరమున జేరి యున్నప్పుడు. అప్పు డాతడు పిట్టవలె నొక కొమ్మ మాటున డాగియుండెను. (పక్షీవ గహనే స్థితః) అట్లు డాగియుండి యాతడు బహువిధముల నాలోచించెను.

'ఇప్పుడు జానకికి గన్పడనగునా! అయినచో నామె తన్ననుమానింపదుగదా! అనుమానించినచో దాను బూనిన కార్యము భంగమగునేమో!

(తతో బహువిధాం చింతాం చింతయామాస వానరః
విపన్నం స్యాత్తతః కార్యం రామ సుగ్రీవయో రిదం)

ఆ సమయమున సీతను దర్శించుటగానీ, యామెతో సంభాషించుటగానీ పరు లెవ్వరికి నీషణ్మాత్రమేని యెఱుక పడరాదు. కనుకనే యాంజనేయు డప్పు డిట్లనుకొనెను. 'ఈ రక్కసుల యెదుట సీతతో సంభాషించుట యన

ర్హాము. ఇప్పుడేమి చేయుదును! నేనిప్పుడు విషమావస్థలో జిక్కు-వడితిని.'

(నిశాచరీణాం ప్రత్యక్షమనర్హాం చాపి భాషణం
కథం ను ఖలు కర్తవ్య మిదం కృచ్ఛ్రగతోఽహ్యాహం)

సీత యెదుటి కాంజనేయుడు వచ్చి నిచ్చిన సమయ మాతని కర్తవ్యకరణమున కనుకూలమైనది.

సీతకు తా నిక శ్రీరాముని జేరుడు నను నాశ చివికి పోయినది. నిరాశయు, నిస్పృహయు దలముసు-లయి నవి. తన ప్రాణములమీది యాశయు సన్నగిల్లినది. తన ప్రాణములు వీసుట మేలా! యని తలపోయుచున్నది. అట్టి తరుణమున నాంజనేయుని వాల్మీకి యామె యెదుట ప్రత్యక్ష మొనర్చినాము.

ఆ యవసరమున రాక్షసాంగన లెల్లరు నిర్భయముగ-గాఢ నిద్రామత్తులై - యెడ లెఱుగక దొరలుచుండిరి. కాబట్టియే హనుమంతు డేకాంతమున సీతా కాంతను గాంచి, యామె నూఱడించి తన సందేశమును నిరాటం కముగ నందీయజాలెను. ఆతసు వేగిరపడవలసిన యవస రము లేకపోయినది. తాను వెల్లడింప దలచుకొన్న విష యము నిర్భయముగ - నిదానముగ-వెల్లడించెను.

ఈ విషయము నాంజనేయు డిట్లు తలపోసెను. 'నేనీ రాక్షసుల నడుమన యుండి సంలాపముచే వంతల గుందు చున్న యీమెను శాంతముగ నోదార్చెదను.

(అంతరం త్వహ మాసాద్య రాక్షసీనా మిహస్థితః
శనై రాశ్వాస యిష్యామి సంతాప బహులా మిమాం)

ఇట్టి యవసరము నాంజనేయుడు లెస్సగ నుపయో గించుకొనెను. వైదేహికి దన యెడ విశ్వాసము గల్గించు కొనెను. రామ చరిత్రమును సంగ్రహముగ వచియిం చెను. ఆమె నోదార్చెను. కాకాసుర గాథ నాలకించెను. తాను దెచ్చిన యంగుళీయము నిచ్చి యామె, యొద్ద నుండి చూడామణి బుచ్చుకొనెను. ఇంతయు నిదానముగ జరిగిపోయినది. కనుక నీ సుందర కాండమునందలి ప్రధానకథా ప్రవర్తనమునకెల్ల రాక్షసస్త్రీల గాఢనిద్రయే మూలము. వారి గాఢ నిద్రా విషయము రావణ కర్ణ ముల బడినచో నాత డా కావలిగత్తెల కుత్తుక లుత్త రించెడివాడే. వారినెల్ల జిత్రవధ యొనర్చెడువాడే. కనుక రాక్షసుల నిద్ర సీతకు హితముకాగా నసురుల కహిత మూలమే యగును. కావున సీత కపినిగూర్చి వివరముగ వారికి దెలుపకుండుట తన రక్షణమునకు గాక రాక్షస స్త్రీల రక్షణమునకే తోడ్పడెను. కనుకనే జానకి తన్నడి

గిన విషయమును సమయోచితముగ సంగ్రహముగ దెలి
పెనేగాని యహితకరమగు వివరణమునకు బూనుకొన
లేదు. ఇది యుచితమే యగునుగాని యిందు దోష మే
మున్నది ? ఇం దన్యతమెక్కడిది ?

దానవాంగన లితర విషయములను వివరించి సీతాంజ
నేయులను శిక్షింపుమని ప్రార్థించిరే గాని తమ నిద్రా
మత్తతనుగూర్చి యొక్కమాటయేని బలుక లేదు.

కావుననే యసుర రాజు గ్రుడ్డై యగ్నివలె కోపసంవర్త
తేక్షణుడ్డై నాంజనేయుని బంధింప నాజ్ఞ యొసగెను.

(హుతాగ్నిరివ జజ్వాల కోప సంవర్త తేక్షణః
హ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః)

కాబట్టి జరిగిన సర్వము సీత వివరింపకుండుట స్వకీయ
రక్షణార్థమేమో కాదు; హనుమంతుని సంరక్షణార్థ మంత
కంటెగాదు; రామ కార్యము జక్కపెట్టుట కసలేగాదు;
కాగా నది రాక్షసాంగనల రక్షణకే యయ్యెను.

దానవ నిద్ర తనకు హనూమత్సమావేశమున కవ
కాశ మొసగినదిగాన వారియెడ సద్భావముతో - వారికి
తోడ్పడుటకే - సీత యెల్ల విషయములు వివరింపలేదని
మన మూహింపవచ్చును. ఇది హేతుదూరము గాదు.

ఈ యంశము త్రిజటా స్వప్న వృత్తాంతమున సూచిత మగుచునే యున్నది.

'తన్నాశ్రయించినవారి యెడ జనకాత్మజ ప్రసన్న రాలగును. ఈ రాక్షసులను మహాభయమునుండి యీమె రక్షింపగలదు.'

(ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతోభయాత్)

త్రిజట తన స్వప్నము సత్యమగుననియు, రాక్షస స్త్రీలకు జానకి యభయ మొసగుననియు గాఢముగ విశ్వసించినది. ఈ స్వప్న వృత్తాంతము వెల్వరించిన యనతి కాలమునకే సీతా హనుమత్ సమావేశ సంఘటనము సంఘటిల్లినది. కనుక జానకి తమ్ము రక్షించునని వారు విశ్వసించిరనుటలో నబ్బురము లేదు. కాబట్టి యేదృష్టితో జూచినను, ఎట్లు పరిశీలించి విమర్శింప బూనినను సీత యన్యతవాదిని కాజాలదు. అంతియగాదు; ఆమె యున్నత పథమున సంచరించుచు దన స్వధర్మమును జక్కగా గాపాడి పోషించుకొనెను.

'కాదు! కూడదు; సీత యాడిన దసత్యమే' యందురా! యది పిడివాద మగును. 'తాము గారణ మూహింపలేని

యలోక సామాన్యమైన మహాత్ముల చరిత్రమును మందులు ద్వేషింతు'రనుటలో వింత యుండదు.

(అలోక సామాన్య మచింత్య హేతుకం
ద్విషంతి మందా శ్చరితం మహాత్మనాం)

పాప బుద్ధి లేక స్వార్థరహితమై పరుల కుపకారము గావింపదలంచి పలికిన యసత్యము సత్యమేగాని యసత్యము గాదని పెద్దలు పలుకుదురు. కాబట్టి వైదేహి వచనము సత్యశోభితమే యగునుగాని యసత్యము గాదని యనుకొనవచ్చును.

'కృష్ణా! నీవొనర్చిన కార్య మపుణ్యమైనను పుణ్యమే యగును. రాస లీలయందు నీవు చూపిన గడుసుదనము గూడ నీ భక్తులకు కీర్తనీయమే యగుచున్నది.

(యత్త్వత్కృతం తదిహ పుణ్య మపుణ్య మన్యత్
నా న్యత్తయోర్భవతి లక్షణ మత్రజాతు
ధూర్తాయితం తవ హి యత్కిల రాసగోష్ఠ్యాం
తత్కీర్తనం పరమ పావన మామనంతి)

ఇక ప్రస్తుత మనుసరింతము.

క్రోధవశమున రావణుకన్నదోయినుండి యశ్రుబిందువులు రాలినవి. నేయివోసిన యగ్నివోలె నాతము మండి

పడి హనుమంతుని దండించుటకై యసురానీకము నాతని మీది కంపెను.

హనుమంతుడు రామలక్ష్మణ సుగ్రీవులకు జయము వల్కుచు, తన మీదికి వచ్చిన సైన్యమును మర్దించుచు, సింహనాదము లొనర్చుచు జెలరేగి యుండెను.

'కోసలేంద్రుడును, సరల కర్ముడును నగు రాముని దాసుడను. శత్రుసైన్యమును నుగ్గునుగ్గుచేయగలవాడను. నా పేరు హనుమంతుడు; నే వాయుపుత్రుడను.'

(దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః)

ఈ హనుమత్సింహనాదములు హతశేషులగు సైనికుల మూలమున నెప్పటి కప్పుడు రావణ కర్ణకుహరముల బడుచునే యుండెను. కురుక్షేత్రమున జరిగిన కౌరవ పాండవ యుద్ధసమయమున కృష్ణార్జును లొక్కయెడనుండి పాంచజన్య, దేవదత్తములను దమతమ శంఖములను దిక్కులు పిక్కటిల్ల బూరటింపగా నా ఘోషమునకు కౌరవుల హృదయములు బ్రద్దలయ్యెననిరిగదా!

(పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః
స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్)

అయినను నా సైన్యము పదునెనిమిదినాళ్లపాటు నిలిచి కదనము చేసినది. కాని యీ వానర వీరుని యుద్ధమో! గడియకాలములోనే పరిపూర్తియైనది. ప్రచండ వాయువు చెట్టు చేమలను, కొంపగోళ్లను నెకటి వెనుక నెకటిగ, నెక్కుమ్మడిగ బడవైచుచు వీర విహారము చేయునట్లు హనుమంతుడను దన తండ్రివలెనే లంకాపురమున విచ్చల విడిగ వీర విహారమొనర్ప దొడగెను.

రావణ ప్రేషితులై వచ్చిన వేలకొలది కింకరులు యమాలయమునకు బోయిరి. మహావీరుడగు జంబు మాలి యమని యింటి కతిథిగ బైనము చేసెను. మంత్రుల పుత్ర లేవ్వరు మరణము నొందిరి. సేనా నాయకులగు దుర్ధర విరూపాక్ష యూపాక్ష భాస కర్ణా దులు ప్రాణములు వీడిరి. సమరోద్ధతుడగు నక్ష కుమా రుడు సమవర్తి పాలికరిగెను.

వాయుపుత్ర డిట్లు వచ్చిన వీరులనెల్ల బరిమార్చుచు, దన చేతులు తీటయైత్తి రణకేళి నభిలషించుచు, తోరణ స్తంభమునైనెక్కి తనభుజస్తంభము లప్పళించుచు సింహ నాదము సేయుచుండెను.

అప్పుడు శత్రు విదర్శిష్ణుడును, సురాసుర శోక దాతయునగు తన కుమారు నింద్రజిత్తును బ్రోత్సహించి

రావణు డాంజనేయుని మీది కంపెను. అతని రాకకు సమర విద్యాపండితుడగు సమీరనందను డానందము నొంది, తనదేహమునువిదలించి, కుత్తుక సరిచేసికొనుచు, భుజాస్ఫాలన మొనర్చుచు,నాకసము ప్రతిశబ్దింప నార్చుచు నాతని మీదికెగిరి దుమికెను.

ఆ యిర్వురు వీరులకు పోరు ఘోరమయ్యెను. తన యొద్దనున్న సమస్త శస్త్రములను దానవుడు ప్రయోగించెను. కాని హనుమంతునెడ ఫలితము గానరాకపోవుటచే నింద్రజిత్తునకు బ్రహ్మాస్త్రము బ్రయోగింపక తప్పలేదు.

ఆ యస్త్రప్రయోగమున కంజనీ కుమారుడు నిశ్చేష్టుడై నేలమీదబడి, తన బాల్యమున బ్రహ్మ యిచ్చిన వరమును దలపోసి, తన్ను గాంచ రావణుడుగూడ దహ తహలాడుచుండుననితలచి యాయస్త్రమునకుగట్టువడెను.

ఇంద్రజిత్తునకు బ్రహ్మాస్త్రప్రయోగము తెలియును. కాని యందు బ్రావీణ్యము తక్కువ. కనుకనే యతడు బ్రహ్మాస్త్రముచే గట్టువడ్డ పవమానసూనుని వల్కల పాశముచే బంధించెను.

బ్రహ్మాస్త్రమున నొక్క రహస్యమున్నది. ఇతర సాధనముచే బంధించినచో బ్రహ్మాస్త్రము పాటి దప్పి పోవును. కనుక నిప్పు డాయస్త్రము సడలిపోయినది.

(అస్త్ర బంధ స్య చాన్యం హి నబంధ మను వర్త్తతే)
పోనీ, మరల నా యస్త్రమును బిగింపరాదా! యన్న
నది సాధ్యపడదు. మఱియొకయస్త్రమును ప్రయోగించి
బంధించుటయు నిరర్థకమే యగును.

గరళము ప్రయోగించిన రోగియెడ ననౌషధములు
వ్యర్థములగు నట్లు బ్రహ్మాస్త్ర ప్రయోగమైన వెనుక
ననాస్త్రములు వ్యర్థములగును.

(పునశ్చ నాస్త్రే విహతేఽస్త్ర మన్యత్
ప్రవర్త్తతే సంశయితాఃస్మ సర్వే)

ఈ తత్త్వ మింద్రజిత్తున కెఱుక లేదు. హనుమంతు
నకు నీ రహస్యము తెలియదు. వల్కల బంధముతో
దన్ను గట్టగా బ్రహ్మాస్త్రము విచ్చిపోయినదని యాత
డూహింపలేదు.

(అస్త్రేణ హనుమాన్మక్తో నాత్మాన మవబుధ్యతి)
రాక్షసరాజ సన్ముఖమునకు పవనతనయు డా సమయ
మున రాక్షస నాయకులచే గొనిపోబడెను.

హనుమంతుడు - రావణుడు

హనుమంతు డట్లాసభాంగణమునకేగి తేజోబలసమా
యుక్తుడును, భాస్కరతేజస్కుడునగు రావణు నవలో
కించి ముగ్ధుడాయెను.

రావణుడును హనుమంతు నాలోకించియిట్లనుకొనెను.

'పూర్వము కైలాసపర్వతమును గడగడ లాడించి నప్పుడు నందికేశ్వరుడు 'నా యెడ క్రోధము జూపి యుండెనుగదా! ఆత డేమేని నిట్లు వచ్చియుండునా? లేక బాణాసురు డేమేని నీ రూపమున నరుడెంచి యుండునా?' యని శంకించుచు చెంతనున్నవారిని జూచుచు నిట్లు పలికెను.

:- వీ డెచ్చటినుండి వచ్చినాడు? ఏల యిందు వచ్చి నాడు? వచ్చినవాడు రక్కసులను దర్జింపనేల? మన వనమును భంగము చేయనేల?

హను:— నే నొక వానరమాత్రుడను. రాక్షసరాజ దర్శనమున కనువుగా నీ వనమును భంగమొనరించితిని. నన్ను జంపవచ్చినవారిని నేను జంపితిని. బ్రహ్మవరము వలన బ్రహ్మాస్త్రమునకు గట్టువడితిని. ఆ యస్త్రము నన్నువీడినను నేనొక రాజకార్యము నుద్దేశించి నేనిటకు వచ్చితిని.

'రావణ! రాముడు పిత్రువాక్య పరిపాలనార్థము విపినభూముల కరుదేఱి, యరణ్యమున నపహృతయయిన తన జానకి నన్వేషించుచు వచ్చివచ్చి సుగ్రీవునితో సుహృ ద్భావము నెఱపినాడు. వానరపుంగవుడగు వాలిని

నీ వెఱుగుదువుగదా ! రాము డొక్క బాణముతో వానిని జంపి జానకి నన్వేషించుటకై వానరుల నెల్ల దిశలకు బంపినాము. నే నిచ్చటి కామె నన్వేషింప నరుదెంచి యామెను నీ యింట గనిపట్టితిని. నేను నీ కొక్క హితమును జెప్పుచున్నాను. వినుము.

'పరదారాపహరణము బుద్ధిమంతులు తలంపరానిది. ఆ రామ లక్ష్మణుల నెమరొక్కనుట సురాసురుల కేని దుర్లభము. క్రూరసర్పమును దెచ్చి గృహమున నిల్పు కొనుట యపాయ కరము. గరళముతోడి యన్నమును గాంక్షింపకుము.

(విష సంస్పృష్ట మత్యర్థం భుక్త మన్న మివౌజసా)

'కనుక సీతను రాముని కర్పించి శరణుగోరుము లేదా! యామె నీలంకకు కాళరాత్రి యగును. నీకంఠమున కామె కాలపాశ మగును. నామాట వినుము. అధర్మము నాచరింపబూనకుము. అది తత్క్షణమును గట్టి కుడుపకపోదు. ధర్మనియమ మిదియే. లేక యర్థశాస్త్రము నాలో చింతువా! జనస్థాన దానవవధమును, వాలిసంహారమును, సుగ్రీవ స్నేహమును బరికింపుము. ఎట్లు చూచినను నీవు రాముని సేవించుట మేలు. లంకకు నిప్పు బెట్టకుము. రాక్షసరాజ! యథార్థమగు నా మాట నాలిం

వుము. రామసేవకుడను;దూతను; విశేషించి వానరుడను
నగు నా మాటను మన్నింపుము.'

(సత్యం రాక్షసరాజేంద్ర శృణుష్వ వచనం మమ
రామ దాసస్య దూతస్య వానరస్య విశేషతః)

మఱగిన తైలముమీద శీతలజలము జల్లినచో
మంటలు మండునుగాని యది చల్లాఱునా! ఆంజనేయుని
హితమున కసురరా జగ్ని హోత్రమువలె మండిపడి
యాతనిం జంప నాజ్ఞ యిచ్చెను.

అప్పుడు విభీషణు డాకులపడి యిట్లు పలికెను.

'రాక్షసరాజ! ఈత డొక దూత. దూతను జంపుట
భూనేతలకు దగదు. దూత మంచివాడుగానీ, చెడ్డవాడు
గానీ; వాడు స్వతంత్రుడు గాడుగదా! తన రాజు పలికిన
వాక్యముల నాతడు పల్కును. అం దాతని దోష మే
మున్నది ?

(సాధుర్వా యది వాఽసాధుః పరై రేష సమర్పితః
బ్రువ్ పరార్థం పరవా న్న దూతో వధ మర్హతి)

'కనుక నాతనిజంపుట రాజనీతికివిరుద్ధము,లోకగర్హితము.

(రాజధర్మ విరుద్ధంచ లోకవృత్తేశ్చ గర్హితం)

రావ:— పాపాత్ములను జంపుటలో పాపము లేదు.
కనుక నీతని వధియింతును.

(న పాపానాం వధే పాపం... తస్మాదేనం వధిష్యామి...)

విభీ:— రాజా! రాజకార్యావసరములందు దూతలను దమ యిచ్చ వచ్చినట్లు మాటలాడ నిచ్చుట రాజ సమయము. ఇత డడుకుమారాదుల జంపి మన కప్రియము సేయుట నిశ్చయమే. అయినను దూతలను శిక్షించుట కుచితములగుశిక్షలు వెక్కు-లుగలవుగదా! వారి కంగ చ్ఛేదము గల్పింపవచ్చును. కొరడాలతో గొట్టింప వచ్చును. తలబోడి చేయింప వచ్చును. కాని దూతవధ మాత్రము దోషదాయకమగును.

'రావణ! ధర్మవాదము నందును, లోకవృత్తము నందును, శాస్త్ర సమాలోచన గ్రహణము నందును నీవుత్తముడవు. కనుక నీకపిని దండింప మాని యీతని బంపిన యాతనిదండించుటయుచితము. నీచెంత యోధాను యోధులు వెక్కు-రున్నారు గదా!

(నచాప్యస్య కశ్చిత్తే కంచి త్పశ్యామ్యహం గుణం తేషాయం పాత్యతాం దండో యైరయం ప్రేషితః కపిః)

రావణు డీ హితము నాలించి తన భటులతో నిట్లనెను.

:- శోతులకు దోక యిష్టభూషణము. కనుక దానిని గాల్చి యీతని నావలకు దోలివేయుడు.

(కపీనాం కిల లాంగూల మిష్టం భవతి భూషణం
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు)
'తోక కగ్గిముట్టించి పట్టనము నలుదిక్కు-ల నీతని
ద్రిప్పి పరిభవించి పంపివేయుడు.

(లాంగూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతాం)

రాక్షసు లామాట లాలించుటయే తడవుగ ప్రాత
గుడ్డలుదెచ్చి, తైలముతో దడిపి, యాతని తోకకు జుట్టి
దాని కగ్నిహోత్రము నంటించిరి. మంట లాకసమున
కెగయదొడగెను. ఆవింత జూచుచు, కేకలు వెట్టుచు
బారులెల్లరు బురవీధుల బ్రోగైరి.

బగబగ లాడుచున్న మంటలతోడి వాలమునెత్తి
యాత డందుబాటులోనున్న కొందఱ నడచికొల్చెను.

రక్కసి మూక లాతని నలుదిక్కు-ల ద్రిప్పుచుండగా
కొందఱు రక్కసులేగి సీతకీ విషయము జెవినివేసిరి.

అప్పు డాజానకి తనయపహరణము వంటి యామాట
నాలించి, శోకసంతప్తయై యగ్ని నిట్లభ్యర్థించెను.
'నేను పతిసేవా పరాయణ నైనచో, నేదపస్సు నాచ
రించుచున్నచో, నా కేకపత్నీత్వమున్నచో నో యగ్ని
హోత్రమా ! హనుమంతు నెడల నీవు చల్లబడుము.

(యద్య స్తిపతి శుశ్రూషా యద్య స్తి చరితం తపః
యది చా స్త్యే కపత్నీత్వం శీతో భవ హనూమతః)
'శ్రీరామునికి నాయెడ గొంత యను గ్రహమున్నచో,
నా కేమేని పతినిబడయు భాగ్యమున్నచో నో యగ్ని
హోత్రమా ! హనుమంతునెడ జల్లబడుము.

.(యదికశ్చి దనుక్రోశ స్తస్య మయ్య స్తిధీమతః
యదివా భాగ్య శేషో మే శీతో భవ హనూమతః)

'నేను వృత్తసంపన్న ననియు, పతి సమాగమ లాలస
ననియు, నా ధర్మాత్మ డెటిగిన-చో నో యగ్ని హోత్ర
మా ! హనుమంతునెడ జల్లనగుము.

(యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసాం
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః)

'సత్య ప్రతిజ్ఞుడగు సుగ్రీవుమున న్ని దుఃఖసముద్రము
నుండి దరిజేర్చు వాడగునేని నో యగ్ని హోత్రమా !
హనుమంతునెడ జల్లనగుము.'

(యది మాం తరయే దార్య స్సుగ్రీవ స్సత్యసంగరః
అస్మా ద్దుఃఖాంబు సంరోధా చ్ఛీతో భవ హనూమతః)
సీత యిట్లు ప్రార్థింపగా తీవ్రార్చియయిన యా యగ్ని తన
తీవ్రతను జల్లబఱచుకొని ప్రదక్షిణ జ్వాలలతో నా తని
బరామర్శించెను !

హనుమంతు డిట్లగ్ని జ్వాలలచే నలముకొనియు జల్లదనము ననుభవించుచు, దన దేహమును సంకుచించి బంధములు పటాపంచ లొనర్చుకొని ఆత డప్పు డాలో చించెను. 'నాకు వీరగ్నిని బహూకరించిరిగాన నీయగ్ని వీరికే యొప్పగింతును. ఈ లంక సుశిక్షిత సైనిక నిలయ ముగదా! కావున నిందలి దుర్గములను గాల్చివైచి నా శక్తి నెకింత వీరికి రుచి చూపుదును. నా పితృదేవుడగు వాయుదేవుని మిత్రుని కీనాడు నా శక్తికొలది సంతర్పణ మొనర్తును.' ఇట్లూతలచి యచ్చటనున్న యుత్తమోత్తమ భవనములకెల్ల - నొక్క-విభీషణ గృహాముదక్క - జిచ్చు వెట్టెను. మంట లాకాశమున కెగురుచు ఫెళఫెళార్భటు లతో విజృంభించెను. స్త్రీలు తమ చంటిబిడ్డలతో నేడ్చుచు జెల్లాచెదరై యటు నిటు బర్వులెత్తదొడగిరి. పురుషులు దిక్కు-దోచక గంతులు వేయసాగిరి. హా హా కారములు చెలరేగినవి.

ఆయగ్నిలో గృహములు దహనమైనవి. భవనములు భస్మములైనవి. సౌధములు బూదియైనవి.

రాక్షసు లిట్లు తమదోషమునకు దగిన శిక్ష ననుభవించిరి. విధి తప్పదుగదా! రావణ పరాజయమునకు, లంకా నాశమున కిది సూచనమా! యని వారు శంకించిరి.

ఇంకా

బ్రహ్మయో, యింద్రుడో, మఱియెవ్వడేని నిర్జరనాథుడో
యిట్లు వచ్చియుండునని యేడ్వదొడగిరి.

అట్లాత డాలంకాపురమునెల్ల దగ్ధమొనరించి, స్వకీయ వాలాగ్నిని జలరాశిలో జల్లార్చుకొని శ్రీరాముని దన చిత్తమున సంస్మరించెను.

అసురులిట్లేమ్మచుండ హనుమంతుని వీరకృత్యమునకు బ్రకృతిసంతసించు చుండెను. ప్రకృతిలో జలము సమాన తలమును బొందునట్లు ప్రకృతియు సమతలమై స్థిరత్వము బొందుచుండును. లంకావాసు లొనర్చిన యుద్ధకృతకార్య ములకు నేమ వారి కనుభవించువంతు వచ్చినది. భౌతిక భోగముల క్షణికత్వమును హనుమంతుడు వారి కెఱుక పఱచెను. ఈతని యీకార్యము విశ్వకల్యాణము జేకూ ర్చెను. సూక్ష్మప్రకృతి ననుసరించి స్థూలప్రకృతియు బ్రవ ర్తిల్లుచుండును. బాహ్యప్రకృతిలో జరుగుచున్న యెగుడు దిగుడులను ముందు సూక్ష్మప్రకృతి సమము చేయుచుం డును. దాని ననుసరించి స్థూల ప్రకృతియు సమమగు చుండును. అట్లే భౌతిక ప్రకృతి కాధ్యాత్మిక ప్రకృతియంత రంగమువంటిది. అగ్నిజ్వాలలాకాశమున కెగురుచు నిరం తరము నిలిచియుండనట్లే యావేశోద్రేకములు నట్ట చిర

కాలము నిలిచియుండవు. కొంతదడవున కాంజనేయుడు శాంతినొంది యిట్లాలోచించెను.

'జ్వలించుచున్న యగ్నిని జలముచే జల్లార్చునట్లు తమ మనస్సునం దుత్థితమగు కోపమును మార్చుకొనువారే మహాత్ములు.

(ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోప ముత్థితం
నిరుంధంతి మహాత్మానో దీప్త మగ్ని మివాంభసా)

'కోపమున్నవాడు పాపకృత్య మొనర్చును. క్రుద్ధుడు తన గురువునేని వధియించును. అట్టివాడు పరుషవాక్కులతో సాధుజనుల నధిక్షేపించును.

(క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యా ద్గురూ నపి
క్రుద్ధః పరుషయా వాచా నర స్సాధూ నధిక్షిపేత్)

'కోపము గల్గినవానికి ననవలసినమాటయు, ననరాని మాటయు దెలియదు. ఆతడు చేయని కార్యముగానీ, పలుకనిమాటగానీ యుండదు.

(వాచా వాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్
నా కార్యమస్తి క్రుద్ధస్య నా వాచ్యం విద్యతేక్వచిత్)

'సీతా క్షేమమునుగూడ జింతింపక యిట్లగ్ని వెట్టిన సిగ్గు లేని నాజన్మము చీకొట్ట దగినది. ఇప్పుడు జానకీ దేవికిని

హానిగల్గియుండును. అవివేకముతో నీ కార్యమొనర్చి స్వామి హితమును జెఱచితిని. రామ కార్యమునకు మూలచ్ఛేద మొనరించిన యీ నాజన్మము నిష్ప్రయోజనము. నేను బుద్ధిలేక నా వానరత్వమును బ్రకటించితిని.' అని పెక్కు దెఱగుల దన్ను నిందించుకొనుచు మరల నిట్లు తలపోసెను.

'సుందరాంగియు, కల్యాణియు నగు సీతాసతికీ యగ్ని యపాయ మొనర్చునా? ఒనర్పదు. ఎప్పటికి నిట్లు జరుగదు. ఆమె తేజస్సంపదయే యామెను రక్షించును. ఈ యగ్ని నన్నే చెనకలేదే! మఱి మహాపతివ్రత యగు జానకి నంటునా?' ఇట్లాలోచించుచున్నంతలో నతనికి సీతా క్షేమవార్త సూక్ష్మప్రకృతినుండి ధ్వనించుచు నాతని వీనుల బడియెను. అదియే దేవతావాక్కు.

'జానకీదేవి దహింపబడలేదు; ఆశ్చర్యము.'

(జానకీ నచ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవసః)

ఈపల్కులకు బలముగ చారణులు పల్కిన మాటలు విని యాంజనేయు డమితానందము నొందెను.

అగ్నిహోత్రునకు మహాపతివ్రతా రత్నమగు జానకిని దహించు శక్తిలేదని విశ్వసించిన హనుమంతు డా విష

యము సీతాపునర్దర్శనముచే నిరూపించుకొని, తన కార్య
మున సఫలుడై కిష్కింధకేగనెంచి యరిష్ట పర్వతాగ్రము
పైనుండి యుత్తరదిక్కున కొక్క యెగు రెగిరెను.

ఆ నీలాకాశము చంద్రఖండమను తెల్లగలువలతో, సూర్యబింబమను జలపద్మములతో, పుష్యమీశ్రవణములను కాదంబములతో, మేఘములను శైవాల శాద్వలముతో, పునర్వసు వనెడి మహా మీనముతో, అంగారక గ్రహ మను మొసలితో, నైరావతమను మహా ద్వీపముతో, స్వాతియను హంసతో విశోభితమై, వాతసంఘాత జాత తరంగ భంగమైన నిర్మలకౌముది యనెడి శిశిరాంబు వులతో, భుజంగ యక్ష గంధర్వులనెడు కమలోత్పల ములతో విలసిల్లుచున్న యాగగన సాగరమును మహా నౌకవలె నాతడు గడచినాడు.

వినువీధినెగురుచు బోవుచున్న యాతడప్పు డాకసమును గ్రసించుచున్నట్లు, చంద్రుని తననఖములచే గీరుచున్నట్లు, నక్షత్ర భానుమండల భాసితమగు గగన మండలము నపహరించు చున్నట్లు, మేఘజాలముల నాకర్షించు చున్నట్లాతడా యాకాశ తలము నధిగమించెను. ఆ నభో మండలమున బెక్కు వర్ణములతో బ్రకాశించుచున్న మేఘ మధ్యమునుండి శ్వేతాంబర ధారియగు నొంజ

నేయుడు చంద్ర బింబమువలె దేజరిల్లుచు, గరుసునివలె మేఘములను జీల్చుకొనుచు, బాణమువలె బయనించుచు తీరమున కొకింత దూరమున నుండగనే మేఘమువలె గర్జిల్లెను. ఆ గర్జానాదము వానరులాలించి యాతడు వెడలిన కార్యము సఫలమయిన ట్లూహించి యానంద ముతో, ఫలాదులతో నెదురువచ్చి బహుమానపూర్వక ముగా ప్రాంజలిచేసి సమ్మానించిరి. ఇట్లే జానకి వివాహా నంతరము మిథిలనుండి రాముని తో నయోధ్య కేగినప్పు డును, రావణ సంహారానంతరము లంక నుండి యయోధ్య కేగినప్పుడు నాపుర కాంత లానందోత్సాహములతో నామె కంజలి పూర్వకముగ మ్రొక్కులిడిరి. అప్పు డాంజ నేయుడు వారితో సీతను జూచితి నని యచ్చటి విషయ మును సంగ్రహముగ జెప్పెను.

(స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః
దృష్టా సీతేతి విక్రాంత స్సంక్షేపేణ న్యవేదయత్)

వానరు లా సాఫల్యము నాలించి సంతోష పరవశులై కొందఱు సింహనాదము చేసిరి; కొందఱు కేకలువైచిరి; మఱికొందఱు గర్జించిరి; వేఱొక కొందఱు కిలకిలలాడిరి; ఇతరులు ప్రతిగర్జించిరి; కొందఱు తమ తోకలనెత్తి నేల మీదగొట్టిరి; కొందఱు తమ వస్త్రములను విసరిరి;

కొంద ఱొగిరి గంతులువైచిరి; కొంద ఱాతని గొగలించు కొనిరి. వానిని గాంచి వానరు లెల్లరు బ్రాంజలులైరి.

ప్రణామపూర్వకముగా నంగద జాంబవదాదులకు వీరుషమును, విక్రాంతుషమును నగు హనుమంతుడు ప్రదర్శించిన యాశౌజ్యోతి యిది. వానరులపాలిటి సంజీవి యిది. 'చూచితిని' అన్న మహోర్థమును, నమృతోపమును నగు హనుమద్వచనము చెవులబడిన యంతనే యా వానరు లమితానందము నొందిరి.

(తతో దృష్టేతి వచనం మహోర్థ మమృతోపమం
నిశమ్య మారుతే స్సర్వే ముదితా వానరా భవన్)

మును ముందుగ 'దృష్టా' (చూచితిని) అనుటచే హనుమకున్న యుత్సాహావేశమును, నావిషయము వారికి దెలుప నాతడు పొందిన యావేగమును, ఆ ముత్తెమంత మాట వినగోరి యచ్చటనున్న వానరులు వీనులు విచ్చుకొని ప్రతీక్షించుచున్న యాతురతయు మనకు స్పష్టము లగుచున్నవి. ముందుగ రెండక్షరముల చిన్న పదముతో (దృష్టా) 'చూచితిని' అని హనుమంతుడు వారి యాశాలతకు బ్రాణముపోసెను. తన యుత్సాహాతిశేకము నాపుకొనలేక యొక్కమాటతో దన సాఫల్యము వచియించెను. అట్లుగాక ముందు 'సీతా' యని ప్రారంభించినచో

'ఆఁ! సీత...ఏమైనది ? ఆమె కేమి జరిగినది ?' అని యిత్యాదిగా పెక్కు భావములు విద్యుత్తరంగములవలె నుద్భవింపగ తదేక విచారముతో నున్న యా వానర వీరులెంత యావేదము నొందిపోయెడువారో ! కనుకనే హనుమానుడు 'దృష్టా' యని ముందుగ బలికి యా వెనుక దనవార్త నారంభించెను.

హనుమ ద్వాక్యములను విన్న యంగదుని కావే శము, నుత్సాహము పొంగి పోయినవి.

సీతనుజూచి వచ్చితిమి గాని యామెను గొనిరాలేదని రామసుగ్రీవులకు విన్నవించుట విఖ్యాత విక్రములగు మీ కుచితము గాదు. కాబట్టి మనమేగి సీతనిప్పుడ గొని తెత్తము; పదండి అని పలికెను. ఇట్టి యుత్సాహము కర్తవ్య కార్య విఘ్నములను గడకు దోలుటలో నబ్బుర ముండదు. కాని చివరకు నాత డడి యనుచితమని నిశ్చ యించి వారిని సమూశ్వసించి వానరులతో నిట్లు పల్కెను.

అంగద:-వానరవీరులారా! మీ రెల్లరు జెప్పుకార్యము నాకు గర్తవ్యమగును. నేను రాజనుగాను; యువరాజను. స్వామి కార్యమును నిర్వహించుకొని యత్సాహ పర వశులై వచ్చియున్న మిమ్ము దిరస్కరింపరాదు.

ఆ వచనము విన్న యా వానరు లానందపరవశులై యంగదుని బ్రశంసించి తమ రాజభక్తిని దృఢీకరించిరి. ఆత డప్పు డా మధువనమున వానరులు దమయిచ్ఛ వచ్చి నట్లు విహరింప నానతిచ్చెను. వారా యుత్సాహముతో మధువనమును బ్రవేశించిరి. ఆ సంతోషముతో వానర సమూహ మా వనమును నాశముచేసెను.

హనుమంతుడు సీతా లోచ నావలోకన మధువును, నామె వాఙ్మధువును గ్రోలి యానందించుచుండ దక్కిన వానరు లా మధువన పుష్ప ఫల మధుపానముచే నానందించుచుండిరి. వారా యుత్సాహముతో ద మాఙ్నిజ్ఞవెట్ట వచ్చిన వనపాలకుడగు దధిముఖుని చావమోదిరి. తన యవస్థను విన్నవించుకొన్న దధిముఖునే సుగ్రీవుడును మందలించి వానర స్వేచ్ఛావిహార సాహసమునకు గారణ మగు సీతాదర్శనము నూహించి సౌమిత్రితో సుగ్రీవు డిట్లు పలెఁను.

'సీతను జూచివచ్చినాడు; సందేహము లేదు.'

(దృష్టా సీతా న సందేహః)

తరువాత నీ సాఫల్యమును సుగ్రీవుడువిని, శ్రీరాముని యొద్దకు బరువెత్తి యాతనితో నిట్లు వచియించెను.

రామ! సువ్రత! యీఅడిల్లుము. కౌసల్య కడుపు పంట ధన్యమైనది. దేవి కనబడ్డది; సందేహము లేదు. హనుమంతు డామెను గాంచినాడు.

(కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత!
దృష్టా దేవీ నసందేహో న చాన్యేన హనూమతః)

ఆ మాటలతో రాముని యుత్సాహ ముద్వేల మయ్యెను. ఆతని యానందము హద్దులుమీఱెను.

హనుమంతుడు రామునిచెంతకేగి తలతో నాతనికి బ్రణమిల్లి నియతయు, నశ్రుతయు, దేవియు నగు సీతా క్షేమము రామునికి నివేదించెను.

(హనుమాన్ స్తు మహాబాహుః ప్రణమ్య శిరసాతతః
నియతా మశ్రుతాం దేవీం రాఘవాయ న్యవేదయత్)

జానకీ క్షేమము దెలిసి యామె వృత్తాంతము విశదముగ దెలియ నువ్విళ్ళులూఱుచు రాముడు 'ఆమె యెచ్చట నున్నది? యెట్లున్నది? యేమన్నది? యేమిచేయుచున్నది? యేమి చెప్పినది?' అని పెక్కు ప్రశ్నము లడుగగా నా మారుతి దక్షిణ దిక్కునకు దిరిగి, యామె నుద్దేశించి ప్రణామ మొనరించి, తన ప్రయాణము మొదలు కొని సర్వ విషయములను సంగ్రహముగ వివరించెను.

'రామ! జానకి రావణాంతఃపురమునందలి యశోక వనవాటికలో క్రూరరాక్షస రక్షణములో కృశించుచున్నది. ఏకవేణియు, దీనయునై నీయంద చిత్తమునెల్ల నిల్పుకొని యధశ్శయ్యయు, వివర్ణాంగియునై, హేమంతర్తువునందలి పద్మినివలె కాంతిడతిగి, రావణునియెడ బెడమొగముతో మరణము నభిలషించియు నీ యందలి చిత్తముతో నిలిచి యున్న యామె నెట్టకేలకు గాంచితిని.

(రావణాంతఃపురే రుద్ధా రాక్షసీభి స్సురక్షితా
ఏకవేణీధరా దీనా త్వయి చింతా పరాయణా
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే
రావణా ద్వినివృత్తార్థా మర్తవ్య కృతనిశ్చయా
దేవీ కథంచి ల్లోకుత్స్థ త్వన్మనా మార్గితా మయా)

అని తా నెనరించిన ప్రయత్నములను, నామెకు దన యెడ విశ్వాసము గల్పించుకొన్న విధానమును, జానకి చెప్పిన కాకాసుర గాథయు, మనశ్శిలా తిలక వృత్తాంతమును, రామాంగుళీయ ప్రదానమును, సీతా చూడారత్నాదానమును, సీతా ప్రార్థనమును విన్నవించి, యా రత్నము రాముని కర్పించి జానకీసతిని గొనివచ్చుటకై సర్వప్రయత్నములు సత్వరముగ నెనరింప బ్రార్థించెను. రాము డా రత్నము నత్యాదరమున గైకొని, హృదయ

తలమున నుంచుకొని, సౌమిత్రితో జేరి యామెను దలచి తలచి దురపిల్లెను. ఆమణి వృత్తాంతము నిట్లు రాము డాంజనేయునికి వివరించెను.

ఈ రత్నమును మా మామ - జనకుడు మా వివాహ కాలమున జానకి కొసంగినాడు. ఇది జలసంభూతము. యజ్ఞకాలమున బ్రీతుడైన యింద్రుని వలన నిది జనకు నకు జేరినది. దీనిని జూడగనే నాకు జనకుడును, నా జనకుడును కంటబడినట్లున్నారు. సీతాదేవి నా కన్నుల యెదుట నున్నట్లు తోచుచున్నది. అని తన సానుతాప మును బ్రకటించెను.

మఱియు నాత డిట్లు వచియించెను. సీత యొక్క మాసము జీవించిన నిక చిరంజీవ యయినట్లే. ఆమెను వీడి యొక్క క్షణమేని నే జీవింపజాలను. నన్నచ్చటికి వెంటనే గొనిపొండు. అందులకు వలయు ప్రయత్నము లెల్ల నెనర్పుడు; కానిండు.

ఆంజనేయుడు సీతకు దాను జెప్పిన విశ్వాస వాక్యము లను దెలిపి, వారి యుత్సాహము నుజ్జ్వలింపజేసి, యాశా లతకు దోహదముచేసి తన వాక్యములను ముగించెను.

ఇతి

భారతీ ప్రెస్, తెనాలి - 1951.